అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 25-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 83 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

విద్యార్థులకు యూఎస్ షాక్



భారీగా ఎఫ్-1 వీసాల తిరస్కరణ

గత ఆర్థిక సంవత్సరంలో

41 శాతం అప్లికేషన్లు రిజెక్ట్

పదేండ్లలో ఇదే గరిష్టం

వివరాలు 13లో



స్టాండప్ కమెడియన్ షోపై

రేగిన వివాదం

హేబిటేట్ స్టూడియోను కూల్చివేసిన బీఎంసీ అధికారులు

కునాల్ కమ్రా క్షమాపణ చెప్పాలి : మహా సీఎం

కోర్టులు ఆదేశిస్తేనే చెప్తా : కమ్రా

మూక హింసే వారి మార్గం : సీపీఐ(ఎం) ఖండన

మూతబడిన స్టూడియో, కమ్రాపై ఎఫ్ఐఆర్

ముంబయి : మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేపై కమ్రా ఇటీవల చేసిన వ్యాఖ్యలతో రాజకీయ దుమారం చెలరేగిన తరుణంలో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సిబ్బంది ముంబయిలోని కమ్రా షో ప్రదర్శించబడిన హేబిటేట్ స్టూడియోలో పలు భాగాలను కూల్చివేశారు. ఈ స్టూడియో నిబంధనలను ఉల్లంఘిస్తోందని అందుకే కూల్చివేశామని అధికారులు చెప్పారు. అయితే ఎలాంటి నిబంధనలు ఎలా ఉల్లంఘించబడ్డాయో సరైన సమాచారం లేదు. బీఎంసీ అధికారులు అధికారికంగా ఎలాంటి వివరాలనూ ఇవ్వలేదు. అయితే,ఖార్‌లోని యూనికాంటినెంటల్ హోటల్ లోపల గల వేదిక వద్దకు సుత్తులు పట్టుకుని పౌర అధికారులు ప్రవేశించడం కనిపించింది.

ఇదిలావుండగా, శిండేను ప్రస్తావిస్తూ 'గద్దార్ లేదా రాజద్రోహి' అని తాను చేసిన వ్యాఖ్యల గురించి తానేమీ చింతించడం లేదని కమ్రా ముంబయి పోలీసులకు తెలిపారు. న్యాయస్థానాలు ఆదేశిస్తేనే తాను క్షమాపణలు చెబుతానని కమ్రా ఇప్పటికే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసెంబ్లీలో మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో తక్కువ స్థాయి కామెడీని, డిప్యూటీ ముఖ్యమంత్రిని అగౌరవపరచడాన్ని సమర్థించలేమని అన్నారు. కమ్రా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు ...5లో

త్వరలో మంత్రివర్గ విస్తరణ

నాలుగు పదవులకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్

రేసులో ఆ నలుగురు ఎవరు?.. ముహూర్తం ఉగాదికేనా!

గంటన్నరకు పైగా ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సహా టీ-కాంగ్రెస్ నేతల భేటీ



ఎస్ఎల్‌బీసీపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, జూపల్లి

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సోమవారం ఢిల్లీలోని ఇందిరా భవన్ లో కీలక భేటీ జరిగింది. ఇందులో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై చర్చ జరిగింది. ప్రస్తుతం ఆరు పదవులు ఖాళీగా ఉండగా... ఇందులో నాలుగింటికి కాంగ్రెస్ అధిష్టానం పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. ఈ భేటీలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణు గోపాల్, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర నుంచి ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు హాజర య్యారు. హైకమాండ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం ఢిల్లీకి వచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్‌లు నేరుగా ఇందిరా భవన్‌కు చేరుకున్నారు. ఈ సమావేశం రాత్రి 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు గంటల పాటు సాగింది. అయితే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మీటింగ్ మధ్యలో నుంచి వెళ్లిపోయారు.

ఇదే తుది సమావేశం : పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్



త్వరలోనే క్యాబినేట్ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి వర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, ఇతర అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించినట్టు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లినట్టు ...5లో

సహాయక చర్యల్లో వేగం పెంచండి

ఎస్ఎల్‌బీసీ సమీక్షలో సీఎం రేవంత్

కేంద్రం నుంచి అనుమతులు తీసుకోండి

ప్రత్యేకాధికారిగా శివశంకర్ నియామకానికి ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించాలని సీఎస్‌ను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమా దానికి సంబంధించి కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని ...5లో



జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలపై చర్చకు

బీజేపీ అడ్డగింత

చర్చ జరపాల్సిందే : సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ డిమాండ్

డీకే శివకుమార్ వ్యాఖ్యలపై కమలం పార్టీ ఆందోళన

ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారు : కాంగ్రెస్

స్తంభించిన పార్లమెంట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఉభయసభలు స్తంభించాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో గుట్టలుగా.. నోట్లకట్టలు వెలుగులోకి రాగా.. ఈ అంశంపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమైంది. దీనికి ప్రతిగా కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్లకు సంబంధించిన ప్రకటనపై అధికార బీజేపీ పార్లమెంటును స్తంభింపజేసింది. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మార్చడానికి వెనుకాడబోనని చెప్పారని ఆరోపిస్తూ అధికార బీజేపీ సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో ఆందోళనలతో గందరగోళం సృష్టించారు. అవసరమైతే రాజ్యాంగంలో మార్పులు చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేసిన ప్రకటన రాజ్యాంగ ఉల్లంఘన అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో ఆరోపించారు. మత ఆధారిత రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని చేసిన ఈ ప్రకటన చాలా తీవ్రమైన విషయమని, రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ నాయకుడు చేసిన వివాదాస్పద ప్రకటనపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని రిజిజు డిమాండ్ చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరని అన్నారు. రిజర్వేషన్లపై శివకుమార్ ప్రకటనను బీజేపీ వక్రీకరించిందని ఖర్గే ఆరోపించారు. బీజేపీ సభ్యులు ఆందోళనలో భాగంగా బిగ్గరగా నినాదాలు చేయడంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఇంతలో, శివకుమార్ ప్రకటనపై అధికార ...13లో

ఎంపీల జీతాలు 24 శాతం పెంపు

2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపు 13లో

వడగండ్ల వాన ఊడ్చేసింది

రైతులను ఆదుకోండి : జీరో అవర్‌లో ఎమ్మెల్యేల విజ్ఞప్తి ..



రైతులకు పరిహారం అందజేస్తాం : మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ తమ నియోజకవర్గాల్లో వడగండ్ల వాన పంటలను ఊడ్చేసిందనీ, చేతికందే దశలో పంట రాళ్లపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. అది పూర్తికాగానే పరిహారాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు వివరించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని మాడ్గులలో వడగండ్ల వానకు నాలుగువేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని వివరించారు. కరెంట్ స్తంభాలు కూలిపోయి ఆయా గ్రామాల్లో కరెంట్ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని కోరారు. తలకొండపల్లి, పండగొని చెరువు కట్ట తెగిపోయాయనీ, వెంటనే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసుధన్‌రెడ్డి కూడా పంట నష్టపోయి రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిర్మల్‌లో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగలేకపోతున్నారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతిరెడ్డి మాట్లాడుతూ పసుపు పంట కు మద్దతు ధర కోసం, ఎర్రజొన్న కొనుగోలు కోసంఇంకెన్నాళ్లు ఈ పిల్ల తోవలు

గిరిజన ఎమ్మెల్యే ఆవేదన

తమ నియోజకవర్గాల్లోని తండాలకు పిల్లతోవలు ఇంకెన్నాళ్లంటూ గిరిజన ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, తెల్లం వెంకట్రావు, మురళీనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని తండాలకు బైక్‌లు, ఆటోలు కూడా పోవని తెలిపారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి చేరుకోవాలంటే నరకం కనిపిస్తోందని వాపోయారు. వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో వానాకాలంలో గిరిజనులు కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. బోథ్ కేంద్రంలో డిగ్రీ కళాశాలలకు అనుమతి ఇవ్వాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపూర్, చర్లకు రహదారికి అనుమతి ఇవ్వాలని కోరారు. ...5లో

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్ వివరాలు 5లో..



చలో హైదరాబాద్ ఉద్రిక్తం

ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముట్టడికి ఆశా వర్కర్ల యత్నం

అరెస్టు చేసిన పోలీసులు..

లాగి వ్యాన్లలో పడేసిన వైనం

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు

అరెస్టైన వారిని పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం వివిధ జిల్లాల నుంచి ఆశా వర్కర్లు వేలాదిగా కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో డీఎంహెచ్ఎస్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించి ఆశాలను అడ్డగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జిల్లాల్లోనూ ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. డీఎంహెచ్ఎస్ ప్రధాన ద్వారం ...13లో

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలివ్వాలి : సీఐటీయూ 13లో.



హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 28న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు గడువు ఏప్రిల్ 4 వరకు ఉండగా, 7న నామినేషన్ల స్క్రూటినీ చేపడతారు. అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఏప్రిల్ 9 వరకు ఉంటుంది. ఏప్రిల్ 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏప్రిల్ 25న ఓట్లను లెక్కిస్తారు. 29తో ఎన్నికల ప్రక్రియను ముగిస్తారు. మే 1తో ఎమ్మెల్సీ ప్రభాకర్ పదవీ కాలం ముగియనున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల్లో మనీ గేమ్

ఎన్నికలలో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలు ఏవైనా వ్యయం మాత్రం కొండలా పెరిగిపోతూనే ఉంది. గత సంవత్సరం దేశంలో ఐదు ఎన్నికలు జరిగాయి. వీటికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా రూ.3,861 కోట్లు. ఒక్క లోక్‌సభ ఎన్నికలకే రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తెలిపింది. అయితే ఇది అనధికారిక అంచనా. మరి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు చేసిన ఖర్చుపై ఎన్నికల కమిషన్ వెల్లడించిన అధికారిక లెక్కలు ఎలా ఉన్నాయి?

2024లో పార్టీల ఖర్చు రూ. 3,861 కోట్లు | అనధికారిక లెక్క లక్ష కోట్లపైనే | ఆదాయ, వ్యయాల్లో బీజేపీయే టాప్



ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలు తమ ఆదాయాన్ని, వ్యయాన్ని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్‌కు నివేదికలు అందిస్తుంటాయి. అయితే అందులో పూర్తి వివరాలుండవు. కొన్ని జమా ఖర్చు లను రహస్యంగా ఉంచుతాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాల ఆధారంగా కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషి యేటివ్ (సీహెచ్ఆర్ఐ) అనే సంస్థ ఇటీవల ఓ అధ్యయనం జరిపింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఏ ...13లో

మంచినీళ్ల మాదిరిగా ఖర్చు...

'దిగ్భ్రాంతి కలిగిస్తున్న ఈ లెక్కల్ని చూస్తుంటే ఒక విషయం స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నికలు ఇంకెంతో కాలం ప్రజాస్వామ్యం గురించి జరగబోవు. అవి ధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లే యుద్ధ క్షేత్రాలుగా మారుతాయి. రాజకీయ పార్టీలు ఈ విధంగా డబ్బును మంచినీళ్ల మాదిరిగా ఖర్చు చేస్తుంటే సామాన్య మానవుడి మనసులో ఓ ప్రశ్న మెదులుతుంది. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వస్తోంది? చివరికి ప్రయోజనం పొందేది ఎవరు?. ఏదేమైనా ఎన్నికలలో ఓట్లు కాదు... డబ్బే నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోంది. భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది డబ్బే. ఈ ధన ప్రవాహాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోగలదా? లేదా ధనబలం, గోప్యత ఇలా కొనసాగుతాయా? అనేదే తేలాల్సి ఉంది' అని వెంకటేష్ నాయక్ చెప్పారు.



అలహాబాద్ హైకోర్టుకే

యశ్వంత్ వర్మ

ఆయన ట్రాన్స్‌ఫర్‌ను నిర్ధారించిన సుప్రీంకోర్టు కొలీజియం

కేంద్రం ఆమోదం తర్వాతే అమలులోకి

ఛీ! ఆ చెత్త మాకొద్దు ! బార్ అసోసియేషన్


న్యూఢిల్లీ : తన అధికారిక నివాసంలో భారీ ఎత్తున నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ధారించింది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయటాన్ని ధృవీకరించింది. అగ్నిప్రమాద ఘటన సందర్భంగా ఆయన అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీగా లభ్యం కావటం తీవ్ర కలకలం సృష్టించిన విషయం విదితమే. ఈ ఘటన తర్వాత ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ...13లో

తిరిగేసి..మరగేసిన మల్‌రెడ్డి

ఫ్లోలో కాంగ్రెస్‌పైనా సెటైర్లు..నవ్విన సభ్యులు

గంటకుపై ప్రసంగంలో తిప్పితిప్పి మాట్లాడిన వైనం

తుర్కయంజాల్ చెరువు, కలెక్టరేట్ ఎదుట భూ ఆక్రమణలపై విచారణకు డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభలో సోమవారం మున్సిపల్ శాఖ పద్దుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తన ప్రసంగాన్ని తిరిగేసి..మరగేసి...నవ్వులు పూయించారు. ఫ్లోలో కాంగ్రెస్‌పైనా సెటైర్లు వేశారు. మంత్రి శ్రీధర్‌బాబు రన్నింగ్ కామెంట్రీ ద్వారా దాన్ని సరిచేసే ప్రయత్నం చేశారు. హైడ్రాను స్వచ్ఛంద సంస్థగా సంబోధించారు. 'అందుకే హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నా. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎవ్వరికీ మంత్రి పదవి దక్కలేదు. నువ్వు త్వరగా మంత్రివి కావాలన్నా' అంటూ కేపీ.వివేకానంద, ఇతర బీఆర్ఎస్ సభ్యులు రన్నింగ్ కామెంట్ చేశారు. 'జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండిపోతే బండి, సైకిల్ పోతే సైకిల్, కార్లు పోతే కార్లు, ఇంటి తలుపులు పోతే తలుపులు ఇస్తామని బీజేపీ, కాంగ్రెస్ పార్టీవాళ్లు ప్రచారం చేసి ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. ఇచ్చారా..ఇచ్చారా' అంటూ గద్గదస్వరంతో అన్నారు. 'కాంగ్రెస్ కాదు..బీఆర్ఎస్' అంటూ కాంగ్రెస్ సభ్యులు అనడంతో అటు బీఆర్ఎస్..బీజేపీ సభ్యులు...ఇటు కాంగ్రెస్ సభ్యులు పగలబడి నవ్వారు. సభకు సరిగా ప్రిపేరయ్యి రాకపోకపోతే నవ్వులపాలు కావాల్సి వస్తుందని ఆయన ఉదంతం స్పష్టం చేసింది. అతని ప్రసంగంలో రిపిటేషన్స్ వస్తున్నాయనే నెపంతో 'త్వరగా ముగించండి' అని స్పీకర్ ప్రసాద్‌కుమార్ రెండు, మూడు సార్లు సూచించగా...'అధ్యక్షా..నీది, నాది ఒకటే జిల్లా. రంగారెడ్డి జిల్లా ప్రజల బాధలు చెప్పొద్దా..కూర్చోమంటే కూర్చుంటా అధ్యక్షా' అంటూ సాగదీసుకుంటూ పోయారు. బీఆర్ఎస్ సభ్యులు ఆయన ప్రసంగంపై రన్నింగ్ కామెంట్ చేస్తే.. తాను 2019 ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఆరువేల ఓట్లతో గెలిస్తే అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ మందబలాన్ని, పోలీసులను, అధికార యంత్రాంగాన్ని తనపై ప్రయోగించి 300 ఓట్లతో తాను ఓడిపోయినట్టు ప్రకటింపజేశారని ఆరోపించారు. తాను గెలిచానని ప్రకటించిన తర్వాత అధికార మందబలంతో పోలీసులతో తనను వెళ్లగొట్టారని వాపోయారు. అందుకే, తన నియోజకవర్గ ప్రజలు ఈసారి 41 వేల భారీ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. తాను మొదటి నుంచీ ఫార్మాసిటీకి వ్యతిరేకమని నొక్కి చెప్పారు. గతంలో ఎల్బీనగర్‌లోని సిరీస్ కంపెనీతో వంద కిలోమీటర్ల వరకు వాయు, భూగర్భ జలాల కాలుష్యం జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఫార్మాసిటీ పెట్టి హైదరాబాద్‌ను కాలుష్యనగరంగా మార్చుదామని అనుకున్నారా? అని బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. తమ ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్కడఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్యేలంతా అక్కడ ఇండ్ల ప్లాట్లు కొనుక్కోవాలనీ, సరసమైన ధరలకే ఇప్పుడు ప్లాట్లు లభిస్తున్నాయని చెప్పారు. తన నియోజకవర్గంలో ఎమ్మెల్యేల ఇండ్లు ఉన్నాయంటే తనకు కూడా గొప్పే కదా అన్నారు. పెద్ద అంబర్‌పేట వరకు మెట్రోను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. 600 ఎకరాల తుర్కయంజాల్ చెరువు కబ్జాకు గురవుతున్నదనీ, చెరువు మధ్యలోంచి రోడ్డు వేయించారని సభా దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఆ చెరువు కబ్జాలకు గురైందని ఆరోపించారు. మొన్న జీరో అవర్‌లో లేవనెత్తితే ఇప్పుడు ఆ రోడ్డును తొలగించే పనులను అధికారులు చేపట్టారని తెలిపారు. అయితే, వేల ట్రాక్టర్ల మట్టిని పోసి చెరువు కబ్జాకు యత్నించిన వారితోనే ఆ మట్టిని తొలగింపునకు అయ్యే ఖర్చులు పెట్టించాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న విలువైన 95 ఎకరాల అసైన్డ్ భూములను భూ యజమానులను బెదిరించి తక్కువ రేటు చెల్లించి కొందరు కొనుగోలు చేశారనీ, ఆ భూములపై విచారణ జరిపించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, నాలాల అక్రమాలపై లెక్కలు తీయాలనీ, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. హైడ్రాను సమర్థించారు. గత ప్రభుత్వం మున్సిపాల్టీల మీద రుణాలు తెచ్చుకుని అందులో సగం మాత్రమే వాటికి తిరిగి ఇచ్చిందన్నారు. మున్సిపాల్టీలకు ఆదాయ వనరులు లేకుండా చేశారనీ, హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాల్టీలకు చెందిన ఆదాయం నేరుగా హెచ్ఎండీఏకు వెళ్తున్నదని వాపోయారు. ఆ ఆదాయాన్ని మున్సిపాల్టీలకే దక్కేలా చూడాలని కోరారు. 22/ఎ కింద ఎన్ని భూములున్నాయి? ఎన్ని ఆక్రమణలకు గురయ్యాయి? అనే దానిపై లెక్కలు తీయాలనీ, లేకపోతే సమాజం క్షమించదని అన్నారు.

హైదరాబాద్‌ను విస్మరిస్తోన్న కాంగ్రెస్ సర్కారు

గతేడాది జీహెచ్ఎంసీకి కేటాయించిన నిధుల్లో 25 శాతమే విడుదల

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెంచే కార్యాచరణ చేపట్టాలి : బీఆర్ఎస్ సభ్యులు కే.పీ.వివేకానంద



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నగరాభివృద్ధిని రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విస్మరిస్తున్నదని బీఆర్ఎస్ సభ్యులు కే.పీ.వివేకానంద విమర్శించారు. సోమవారం శాసనసభలో మున్సిపల్ శాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌కు ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 25 శాతమే ఖర్చుపెట్టిన విషయాన్ని ఎత్తిచూపారు. మార్చి నెలలో తాగునీటి సమస్యలు రావడమేంటని ప్రశ్నించారు. రూ.800 కోట్లు ఖర్చుపెడితే ఎనిమిది నెలల్లో పూర్తిచేసి కృష్ణా జలాలను తరలించి నగర తాగునీటి అవసరాలను తీర్చొచ్చన్నారు. కొండపోచమ్మ నుంచి పది టీఎంసీల నీళ్లను నగర తాగునీటి అవసరాల కోసం తరలించే అవకాశమున్నా...దాన్ని కాదని దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి తరలించాలని టెండర్లు పిలవడాన్ని తప్పుబట్టారు. దీనిద్వారా రూ.ఆరేడు వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని హెచ్చరించారు. సుంకిశాల పూర్తయితే డెడ్‌స్టోరేజీ నీళ్లు వచ్చేవనీ, ఈస్టిండియా కంపెనీగా మారిన మెగా నిర్వాహకం వల్ల సుంకిశాల కూలిపోయిందని విమర్శించారు. నీటి తరలింపునకు అయ్యే ఖర్చుల భారం మొత్తం మెగాపై వేయాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థపై విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. నగరంలో ప్రతి ఏటా 15 నుంచి 20 శాతం విద్యుత్ అవసరాలు పెరుగుతున్న రీత్యా తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలనీ, సబ్‌స్టేషన్లను నిర్మించాలని సూచించారు. నగరంలో 72 కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని అధికారులు లేఖలు రాస్తే ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. గత బడ్జెట్‌లో జీహెచ్ఎంసీ కి కేవలం రూ.2654 కోట్లు కేటాయించారనీ, అందులో రూ.1200 కోట్లు మాత్రమే విడుదల చేశారని గుర్తుచేశారు. హెచ్ఎండీఏకు రూ.2,500 కోట్లు కేటాయించి పైసా కూడా ఇవ్వకపోవడంపై విమర్శలు ఎక్కుపెట్టారు. జలమండలికి రూ.3385 కోట్లు కేటాయిస్తే.. రుణాలకే రూ.800 కోట్లు పోయాయని తెలిపారు. మెట్రోకు రూ.1100 కోట్లు కేటాయిస్తే.. రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. మూసీ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు కేటాయించి రూ.80 కోట్లే ఇవ్వడాన్ని బట్టే మూసీ సుందరీకరణపై వారి చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతున్నదన్నారు. సుందరీకరణ చేయలేదుగానీ..170 మంది పేదల ఇండ్లను కూల్చివేశారని విమర్శించారు. హైడ్రా, ఫ్యూచర్‌సిటీ, మూసీ సుందరీకరణ పేరుతో గొప్పలు చెప్పుకోవడం, హడావిడి చేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సారి బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.7582 కోట్లు అడిగితే రూ.3100 కోట్లే ప్రతిపాదించడమేంటని ప్రశ్నించారు. అందులోనూ సగం ఖర్చుపెడతారో? లేదో? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు పారిశుధ్య కార్మికులకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు అభివృద్ధి పనుల నిమిత్తం భూసేకరణ కోసం రూ..400 కోట్లు అడిగితే కేవలం రూ.18 కోట్లు మాత్రమే ప్రతిపాదించడమేంటని ప్రశ్నించారు. హైడ్రాతో రియల్ ఎస్టేట్ రంగం మొత్తం కుదేలైపోయిందని ఎత్తిచూపారు. నగరంలో 40 శాతం విద్యుత్‌దీపాలు వెలగడం లేదని ప్రస్తావించారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్ సర్వే ఏమైందని ప్రశ్నించారు. ఉస్మానియాతో నగరం చుట్టూ కడతామన్న నాలుగు ఆస్పత్రుల నిర్మాణం ఎంత వరకు వచ్చిందని నిలదీశారు. ప్రభుత్వ నెగెటివ్ ప్రచారంతో హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభావం పడుతున్నదని వాపోయారు. సీఎం దావోస్, ఇతర పర్యటన ద్వారా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు నిజంగా వచ్చాయా? దమ్ముంటే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనార్టీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇవ్వని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపి, ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మతాలకతీతంగా మనుషులందరినీ మనుషులుగా చూసిన గొప్ప పాలకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మతాలకతీతంగా అన్ని పండగలకు ప్రభుత్వ కానుకలు అందించింది. గంగా-జమునా తహజీబ్ సంస్కృతిని కొనసాగిస్తూ, సమాజంలో శాంతిని పెంపొందించే సంస్కృతిని నెలకొల్పాం. మైనార్టీ బాలబాలికలకు అత్యుత్తమ విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశాం. విదేశీ విద్యావకాశాలను కల్పించేందుకు ప్రత్యేక విదేశీ విద్యా పథకాన్ని అమలు చేశాం. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ మంగళం పాడుతోంది...." అని కేటీఆర్ విమర్శించారు.

"దేశంలో ఎక్కడైనా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంటుంది. కానీ, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ ఉంది. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కొత్త కల్చర్. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మైనార్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ, పథకాలను వెంటనే అమలు చేయాలి. మైనార్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామన్న హామీతో పాటు అన్ని హామీలను నెరవేర్చాలి. అప్పటి వరకు మైనార్టీల తరఫున రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకొస్తాం..." అని కేటీఆర్ స్పష్టం చేశారు.

సర్క్యులర్‌తో ఉద్యమాలు ఆపలేరు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఓయూలో విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సర్క్యులర్‌తో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజాస్వామ్య గొంతుక ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలకు అనేక హామీలిచ్చి మోసం చేయడమే కాకుండా వారిని అణచివేసేందుకు పూనుకుందని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించి అన్యాయం చేశారని వాపోయారు. ఓయూలో ఆందోళనలు, నిరసనలు తెలపొద్దంటూ వీసీ జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు చేస్తున్న ఉద్యమానికి సీపీఐ(ఎం) తరపున సంఘీభావం ప్రకటించారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించకుండా నిరోధిస్తూ సర్క్యులర్ జారీ చేసి ఆంక్షలు విధించడమంటే సమాజాభి వృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. యూనివర్సి టీలలో ప్రొఫెసర్లు, విద్యార్థులు తమ న్యాయ మైన ఆకాంక్షలను చెప్పుకోవడానికి ఒక ప్రజాస్వామ్య వేదిక ఉండాలని ఆకాం క్షించారు. అలాంటప్పుడే యూనివర్సిటీలు సమాజాభి వృద్ధికి మార్గదర్శకం అవుతాయని, ఆ వైపు కృషి చేయాల్సిన అవసరం పాలకవర్గాలపై ఉన్నదని అన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. న్యాయబద్ధంగా పోరాడుతున్న విద్యార్థి సంఘాలను, వారి కార్యకలాపాలను అడ్డుకోవడమంటే ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఇటీవల యూనివర్సిటీలో నెలకొన్న పరిస్థితులపై నిజనిర్ధారణ జరిపి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ.. యూనివర్సి టీలోని కళాశాలల ప్రిన్సిపాళ్లను, వివిధ శాఖల అధిపతులను సంప్రదించకుండా ఓయూ వీసీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్ మాట్లాడుతూ.. ఉద్యమాలకు యూనివర్సిటీలు దిక్సూచిగా ఉన్నాయని, ఆ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పద్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు మురహరి, సీఎల్‌సీ నాయకులు నారాయణ రావు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, పీడీఎస్‌యూ విజృంభన అల్లూరి విజయ్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ రావు, ఓయూ ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ నెల్లిసత్య, ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు ఉదయ్, పీడీఎస్‌యూ నాయకులు మంద నవీన్ రాకేష్ శ్రీను అసిఫ్ పాల్గొన్నారు.



మహిళా సంక్షేమం జరగాలంటే ఎక్సైజ్ ఆదాయం తగ్గాలి

- అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా సంక్షేమం జరగాలంటే ఎక్సైజ్ ఆదాయం తగ్గాలని బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ సూచించారు. సోమవారం అసెంబ్లీలో పురపాలన, పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, సమాచార, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసన వ్యవహారాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ రంగాల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్తలు మద్యానికి బానిసలై చనిపోతున్నారనీ, దీంతో 30 ఏండ్లలోపు మహిళలు వితంతువులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి వితంతు పెన్షన్ ఇవ్వడం సరైందా?, బెల్టుషాపులు లేకుండా చేయడం సరైందా?అన్నది ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్ బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతరులను అందులో చేర్చడం సరైంది కాదన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలకు అధికారాలివ్వాలని చెప్పారు. చిన్నచిన్న మరమ్మతులు, బల్బులు వంటి పనులకూ హైదరాబాద్‌లో నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. మున్సిపాల్టీలకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్నపుడు ప్రజలకు ఉపాధి హామీ పనులు దొరికేవని చెప్పారు. మున్సిపాల్టీల్లో విలీనం అయ్యాక అభివృద్ధి ఏమోగానీ ఉపాధి దొరకడం లేదనీ, దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలో మార్చిలోనే ఇంత కరువు ఎప్పుడూ చూడలేదన్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని చెప్పారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయాలనీ, పంటల బీమాను తేవాలని కోరారు. ఆదిలాబాద్‌కు పరిశ్రమలు రావాలంటే ఎయిర్‌పోర్టు రావాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధి అవుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కల్పించుకుని 11 ఏండ్లకుపైగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలలో వివక్ష జరుగుతున్నదని చెప్పారు. విభజన హామీలను అమలు చేయడం లేదన్నారు. దీనిపై బీజేపీ సభ్యులు మాట్లాడాలని కోరారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.11 లక్షల కోట్ల నిధులు వచ్చాయని చెప్పారు. దీనిపై ప్రత్యేక చర్చకు సిద్ధమన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయని అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించడమే కాకుండా నిధులను ఖర్చు చేయకపోవడం కూడా అట్రాసిటీ కిందికే వస్తుందన్నారు. 11 శాతం వడ్డీకి అప్పులు తేవొద్దనీ, ప్రజలపై భారాలు వేయొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు, ఐదు శాతానికే అప్పు వస్తుందని చెప్పారు.

కేసీఆర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

సీఎం రేవంత్ రెడ్డికి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీకి హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరారు. కాంగ్రెస్ నేత నర్సారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సిద్ధిపేట నుంచి పాదయాత్రగా బయలుదేరిన పార్టీ శ్రేణులు సోమవారం హైదరాబాద్ చేరుకున్నాయి. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించాయి. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం అందించనున్నట్టు తెలిపాయి. కాగా సోమవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు కలిశారు. 24వ తానా కాన్ఫరెన్స్‌కు రావాలని సీఎంను ఆహ్వానించారు.

సంగారెడ్డిలో డంపింగ్ యార్డ్ రద్దుకు

హైదరాబాద్‌కు కదిలొచ్చిన జనం

- ధర్నాచౌక్ వద్ద ధర్నాకు భారీగా వచ్చిన బాధిత గ్రామాల ప్రజలు
- ప్రజలకు, ప్రకృతికి ప్రమాదకరం డంపింగ్ యార్డ్
- విరమించుకోవాలని ప్రజాసంఘాల పోరాట వేదిక నేతల హెచ్చరిక
- రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ -ముషీరాబాద్/గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్ లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు నిర్మాణం పనులను నిలిపివేయాలని కోరుతూ సోమవారం హైదరాబాద్(ఇందిరాపార్క్)లోని ధర్నాచౌక్ వద్ద జేఏసీ, ప్రజాసంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డంపింగ్‌యార్డు ప్రజలకు, ప్రకృతికి ప్రమాదకరమని తెలిపారు. ఈ ధర్నాకు ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డ్ నిర్మాణాలను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టం కలిగించే ఆలోచనలను విరమించుకోవాలన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణం జరుగుతున్న క్రమంలో గ్రామాన్ని ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్, అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉన్నా అలాంటివి చేయకుండానే డంపింగ్ యార్డు నిర్మాణం పనులు ఏవిధంగా చేస్తారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ఎన్నికైన ప్రజాప్రతినిధుల నుండి ఎలాంటి స్పందన లేదని అన్నారు. డంపు యార్డు నిర్మాణం జరుగుతున్న క్రమంలో రైతులపై కేసులు పెట్టి నిర్బంధాలకు రాష్ట్ర ప్రభుత్వం గురి చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల విధిస్తున్న నిర్బంధ ఖండను తక్షణమే నిలిపివేయాలన్నారు. ప్రజల కష్టాలను తీర్చాలిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందన్నారు. డంపు యార్డు నిర్మాణం జరుగుతుంటే జిల్లా మంత్రి ఏం చేస్తున్నారన్నారు. గత బీ ఆర్ ఎస్ , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు డంప్ యార్డ్ నిర్మాణం చేస్తూ ఆ ప్రాంత ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని అన్నారు. జనావాసాలకు దూరంగా పర్యావరణానికి నష్టం కలగకుండా డంపింగ్ యార్డు నిర్మాణం చేయాలన్నారు. నల్లవల్లి ప్యారానగర్‌ను మరో జవహర్ నగర్‌గా మార్చాలని చూస్తే ఊరుకోబోమని, ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పోరాట వేదిక నాయకులు జి.జయరాజ్, కె.రాజయ్య, ఏ.మాణిక్యం, గుమ్మడిదల మండల జేఏసీ నాయకులు చిమ్ముల జైపాల్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సంగారెడ్డి జిల్లా ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు ఎం నర్సింలు, బి.నాగేశ్వరరావు, అశోక్, కె.రాజయ్య, నల్లవల్లి ప్యారానగర్ జెఏసి నాయకులు రామకృష్ణ, ఆంజనేయులు సురేష్, రాజు, మల్లేశం గౌడ్, జేఏసీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కుమార్ గౌడ, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల మహిళలు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి

- జీరో అవర్‌లో నాయిని రాజేందర్ రెడ్డి వినతి
- తమ నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరిన పలువురు సభ్యులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ కార్యాలయాల పేరుతో బీఆర్ఎస్ కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకోవాలని వరంగల్ (పశ్చిమ) నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. సోమవారం శాసనసభలో జీరో అవర్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్జూమర్ నేమ్ బీఆర్ఎస్, ఫాదర్ నేమ్ బీఆర్ఎస్ అన్నట్టు ఇష్టానుసారంగా భూములను కబ్జా పెట్టారని ఆయన ఆరోపించారు. తాను సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాలను అందజేసేందుకు సిద్ధమని తెలిపారు. ఆ కబ్జాలు నిజమనీ, ఉమ్మడి వరంగల్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కబ్జా భూములను విడిపిస్తే రాష్ట్రానికి ఆర్థికంగా ఇబ్బందులు తప్పుతాయని అభిప్రాయపడ్డారు. తాను ఆరోపించిన కబ్జాలు ముమ్మాటికీ నిజమనీ, తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఇందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని ప్రశ్నించారు. సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ గతంలో అభివద్ధికి నక్సలైట్లు అడ్డుపడితే, ప్రస్తుతం అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సీనియర్ ఫారెస్ట్ అధికారులు హైదరాబాద్ లో ఉంటూ పర్యవేక్షణ మరిచిపోయారని చెప్పారు. కలప అక్రమ రవాణా చేసే స్మగ్లర్లపై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ గణపతి సముద్రం చెరువులో కేవలం 1.30 లక్షల చేపపిల్లలు వేసి 8 లక్షల చేపల పిల్లలను వేసినట్టు కాంట్రాక్టర్ మోసం చేశారని తెలిపారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ ఆస్పత్రిలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలనీ, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా మాట్లాడుతూ మూసారాం బాగ్ వద్ద వంతెన నిర్మాణం కోసం మూసీ నీటిని ఆపుతుండటంతో దోమలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం మూసీ నీటిని వదలాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ రకాల భూముల కబ్జా యథేచ్ఛగా కొనసాగుతుందని తెలిపారు. హైడ్రా అధికారులకు, కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు రక్షణశాఖతో తక్షణం భూబదలాయింపును చేపట్టాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైన కాలువలను తవ్వాలని కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో బస్టాండ్ ను పూర్తి చేయాలని కోరారు. అండర్-19 క్రికెట్‌లో ఎంపికైన ఇద్దరు మహిళల్లో ఒకరికే ప్రోత్సాహకం రూ.ఒక కోటి ఇచ్చారనీ, మరొకరికి కూడా ఇవ్వాలన్నారు.

గజ్వేల్‌పై.. సీఎంకు కుట్రబంధం

- 26న మల్లన్న సాగర్‌పై అసెంబ్లీలో చర్చిస్తాం..
- రద్దు చేసిన రూ. 182 కోట్ల నిధులు మంజూరు చేయాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజ్వేల్‌పై కుట్రబంధం ఎంచుకున్నారని, కేసీఆర్ మాత్రం పేగు బంధం పెంచుకున్నారని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన చేతకాక రేవంత్ రెడ్డి దుష్ట పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గం 2014 ముందు ఎలా ఉందో.. ఆ తర్వాత ఎలా ఉందో సీఎం తెలుసుకోవాలని సూచించారు. మొదటి నుంచి గజ్వేల్ నియోజకవర్గం అంటే రేవంత్ రెడ్డికి పడదని, తాము ఎన్నికలకు ముందు గజ్వేల్ అభివృద్ధికి రూ.182 కోట్ల నిధులను మంజూరు చేయగా వాటిని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రద్దు చేసిందని తెలిపారు. దేశ ప్రధానిని గజ్వేల్‌కు తీసుకొచ్చి దేశంలోనే గుర్తింపు తెచ్చిన ఘనత కేసీఆర్‌కు ఉందన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని గజ్వేల్ నుంచి ప్రారంభించి ఇంటింటికీ తాగునీరు ఇచ్చారన్నారు. సాగు, తాగునీటిలో గజ్వేల్ ప్రాంతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కోత పెట్టడంతో పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కోటి రూపాయలకు ఎకరం చొప్పున ఉంటే.. ఇప్పుడు జీరోకు వచ్చిందన్నారు.

26న మల్లన్న సాగర్‌పై చర్చిస్తాం

గజ్వేల్ పట్టణంలో మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలపై చర్చించేందుకు కట్‌మోషన్ అనుమతి తీసుకున్నామని హరీశ్ రావు అన్నారు. ఈ నెల 26న అసెంబ్లీలో నిర్వాసితుల సమస్యలపై చర్చిస్తానని, సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తానన్నారు. తాము రూ.1260 కోట్లు మల్లన్న సాగర్ నిర్వాసితులకు కేటాయించామని, 95శాతం పనులు పూర్తయినట్టు, ఇంకో ఐదు శాతం నిధులు కేటాయిస్తే సమస్య పరిష్కారం అవుతుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ నియోజకవర్గం కావడం వల్ల రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ ఉసేన్, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు లక్షల రూపాయల రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శాసనసభ సభ్యులు, మాజీ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో సోమవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు నల్లబ్యాడ్జీలతో అసెంబ్లీ సమావేశాలకు హాజరై నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేయకుండా మాట తప్పిం దని సభలో నినాదాలు చేశారు. "రుణమాఫీ బూట కం, కాంగ్రెస్ నాటకం!" "రెండు లక్షల రుణమాఫీ అరకొర, కాంగ్రెస్ కొరకొర!" "రెండు లక్షల రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ డౌన్ డౌన్!" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్దపెట్టున నినదించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు న్యాయం చేయాలనీ, రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నిరసన

రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని బీజేపీ సభ్యులు శాసనసభలో నినాదాలు చేశారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని నినదించారు.

మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనార్టీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిథ్యం ఇవ్వని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపి, ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మతాలక తీతంగా మనుషులందరినీ మనుషులుగా చూసిన గొప్ప పాలకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మతాలకతీ తంగా అన్ని పండగలకు ప్రభుత్వ కానుకలు అందించింది. గంగా-జమునా తహజీబ్ సంస్కృతిని కొన సాగిస్తూ, సమాజంలో శాంతిని పెంపొందించే సంస్కృతిని నెలకొల్పాం. మైనార్టీ బాలబాలికలకు అత్యుత్తమ విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశాం. విదేశీ విద్యావకాశాలను కల్పించేందుకు ప్రత్యేక విదేశీ విద్యా పథకాన్ని అమలు చేశాం. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ మంగళం పాడుతోంది...." అని కేటీఆర్ విమర్శించారు. "దేశంలో ఎక్కడైనా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంటుంది. కానీ, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ ఉంది. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కొత్త కల్చర్. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మైనార్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ, పథకాలను వెంటనే అమలు చేయాలి. మైనార్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామన్న హామీతో పాటు అన్ని హామీలను నెరవేర్చాలి. అప్పటి వరకు మైనార్టీల తరపున రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకొస్తాం..." అని కేటీఆర్ స్పష్టం చేశారు.

31లోపు రైతుభరోసా చెల్లిస్తాం

అసెంబ్లీలో మంత్రి తుమ్మల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 31లోపు రైతు భరోసా నిదులను పూర్తిగా చెల్లిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ రూ.49,500 కోట్లు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు రూ.20 వేల కోట్లు మాఫీ చేశారని వివరించారు. మిగిలిన రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. రైతుల బాధను అర్థం చేసుకుని రుణమాఫీ చేయాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ రుణమాఫీకి సంబంధించి ఏడాదిలో రూ.20 వేల కోట్లు మాఫీ చేశామన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.11 వేల కోట్లు రుణమాఫీ చేసిందని వివరించారు. పంటరుణాలు, దీర్ఘకాల రుణాలు, తాత్కాలిక రుణాలు వేర్వేరని అన్నారు. కుటుంబానికి రూ.రెండు లక్షల్లోపు రుణమాఫీ చేశామని చెప్పారు. రైతు భరోసా నిధులను ఈనెల 31లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోన్న కేంద్రం

- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తున్నదని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ భూములను అమ్మేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవు తున్నదని అన్నారు. భూములను అమ్మేందుకు ప్రభుత్వం ఎందుకు?, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు సరిపోతారని ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం ప్రయివేటుపరం చేస్తున్నదని విమర్శించారు. చివరి రక్షణరంగాన్ని కూడా ప్రయివేటీకరణ చేస్తున్నదని అన్నారు. ఎల్ఐసీ ఆస్తులను అమ్ముతున్నదని వివరించారు. నిధుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం పలు రంగాలను ప్రయివేటీకరిస్తున్నదని చెప్పారు. కానీ బీజేపీ సభ్యులు కేంద్రానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. కేంద్రం చేస్తే ఒప్పు, రాష్ట్రం చేస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

నవతెలంగాణ

మంగళవారం 25 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

దక్షిణాపథం...



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం...ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుంది. అదే జరిగితే దక్షిణాది భవిష్యత్తు ఆగమ్యగోచరమే. కొన్ని రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటిస్తే... కొన్ని రాష్ట్రాలు విఫలమయ్యాయి. అదే నేడు బీజేపీకి కలిసివచ్చే అంశమైంది. అది దక్షిణాపథానికి శాపమై కూర్చుంది. ఇది దేశాన్ని వెనుకబాటుకు గురిచేసిన వారికి రివార్డివ్వడం లాంటిది. పరిపాలనలో, ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నప్పటికీ, తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటుంది వాస్తవం. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించి.. ఆ పనిని చేయని రాష్ట్రాలకు సీట్ల నజరానా ప్రకటించడం వైచిత్రి. ఈ వివక్షతపైనే దక్షిణాది రాష్ట్రాల నేతలు మండి పడుతున్నారు. శనివారం చెన్నయ్‌లో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన మొదటి జాయింట్ యాక్షన్ కమిటీ 'ఫెయిర్ డీలిమిటేషన్'ను డిమాండ్ చేసింది.

> దేశంలో ఒక రాష్ట్రం మరో రాష్ట్రం మీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే సిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మరో పాతికేండ్లు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇదేదో రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో ప్రయోజనం కలిగించేది కాదు. జాతీయ సమైక్యతను మరింత పటిష్టం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడమే. ప్రస్తుత డీలిమిటేషన్ విధానంతో దేశానికి 36శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికగా మాత్రమే డీలిమిటేషన్ జరిగితే కేంద్రం చూపేది మాత్రం తెడ్డే.

భిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య ప్రజాస్వామిక దేశం మనదన్న విషయాన్ని కేంద్రం ప్రతిసారి విస్మరిస్తూనే ఉంది. అందుకే రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మార్చడం ద్వారా లబ్ధిపొందే మోడీ హిడెన్ ఎజెండా దాగి ఉందన్నది బహిరంగ రహస్యమే. దేశ భవిష్యత్తుకూ రాజకీయ గమనానికి సంబంధించిన కీలకాంశాలపై కూడా పారదర్శకంగా, సమగ్రంగా చర్చ లేకుండా ఒంటెత్తు పోకడలతో వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి రివాజు. ప్రతి అడుగులోనూ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామిక పద్ధతులకు తిలోదకాలిచ్చి అంతా తన గుప్పిట్లో పెట్టుకోవడం బీజేపీ సర్కారు విధానం. రాష్ట్రాల హక్కులపై దాడి చేయడం, అంతకంతకూ అధ్యక్షతరహా పాలనను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి దారితీయడం దీని లక్షణంగా ఉంది. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరుగుతున్నట్టు నమ్మించడానికి జరుగుతున్న కుటిల ప్రయత్నాలకు అంతే లేదు.

తాజాగా నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈ వలయంలో చిక్కి సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావాల్సిన పెరుగుదల రాదనీ ఈ ముఖ్యమంత్రుల విమర్శ. యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎంపీ సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 174 నుంచి 284కు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలకు ఉన్న సీట్లే పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దేశ రాజకీయాల్లో, విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడంలో.. దక్షిణాది మాటకు విలువ లేకుండా పోయే ముప్పుంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అన్యాయానికి గురైన దక్షిణాది రాష్ట్రాలకు ఇది పుండు మీద కారం చల్లడమే అవుతుంది.

దేశంలో ఒక రాష్ట్రం మరో రాష్ట్రంమీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే సిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. బీజేపీ అంటకాగుతున్న చంద్రబాబు, పవన్‌లు కానీ, విపక్షపార్టీ అధినేత జగన్ కానీ తమిళనాడు సమావేశానికి వెళ్లకుండా కేంద్రం ముందు ఆ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. "దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు విభేదాలను వీడి, పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలి. తమతమ శాసనసభల్లో దీనిపై తీర్మానం చేయాలి" అన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మిగతా రాష్ట్రాలు పరిగణలోకి తీసుకోవాలి. దక్షిణ భారత గళాన్ని బలంగా, ఐక్యంగా యావత్ దేశానికి మరింత గట్టిగా వినిపించాల్సిన అవసరం ఉంది.

'ఉస్మానియా' గొంతుపై సర్క్యులర్ కత్తి!

ఉస్మానియా విశ్వవిద్యాలయం వందేళ్లను పూర్తిచేసుకుని మరో ఎనిమిదేండ్లతో తన నూతన శకాన్ని ప్రారంభించింది. ఇది చరిత్రలో ఎన్నో ఘట్టాలను, అనేక మైలురాళ్లను అధిగమించి విద్యారంగాన్ని విస్తృతస్థాయిలో అభివృద్ధిపరచటంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుగాంచింది. ఎంతోమందిని అత్యుత్తమ మేధావులుగా తీర్చిదిద్దింది. అలాంటి వర్సిటీలో మార్చి పదమూడున రిజిస్ట్రార్ పేరు మీద ఒక విచిత్రమైన సర్క్యులర్ జారీ అయింది. వర్సిటీలో ధర్నాలు, రాస్తారోకోలు చేయకూడదని, నినాదాలివ్వకూడదని ఆ సర్క్యులర్ సారాంశం. ఇది యూనివర్సిటీలో భావప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు. 'ప్రజాపాలన' అంటే ఉద్యమాలకు పుట్టినిల్లయిన ఉస్మానియా గొంతు నొక్కడమా? వర్సిటీ అంటనే భిన్నభిప్రాయలను పంచుకునే కేంద్రం. ఇక్కడ జరిగే ప్రతి చర్య, లేదా కార్యక్రమం, విద్యతో సహా అందరిలో ఆలోచన శక్తిని పెంచేదే. అలాంటప్పుడు ఇలాంటి సర్క్యులర్‌ను అమలు చేయడం సరైందేనా? ఇప్పటికే ఈ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలని పదిరోజులుగా విద్యార్థులు ఉద్యమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా వివక్షకు గురైంది యూనివర్సిటీ విద్యనే. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో యూనివర్సిటీల మీద వివక్ష చూపి ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్ చేయలేదు, సరిపడా నిధులు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1880కి పైగా ప్రొఫెసర్, అసోసియెటెడ్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తమది ప్రజాపాలనగా చెప్పుకునే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ



హయాంలో కూడా ఉస్మానియా ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతున్నది. అదే రీతిలో వర్సిటీ పట్ల వివక్ష కొనసాగుతున్నది.అయితే ఇక్కడ పరిష్కరించాల్సిన అంశాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని పరిష్కరించడటానికి బదులు వాటిని ఉద్దేశపూర్వకంగానే పెడదారిన పెట్టి ఉన్నత విద్యను రోజు రోజుకు బలహీనపరుస్తున్నది. తెలంగాణలో అన్ని యూనివర్సిటీలో అరకొర వసతులతో నడుస్తున్నప్పటికీ, అవి అందించే విద్యానాణ్యత పెద్ద సవాలుగా మారింది.యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలను కొనసాగించడానికి నిరంతరం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఉద్యమాల్ని ఆణిచేసేందుకు సర్క్యులర్ అనే వాదన కూడా జరుగుతున్నది.

వాస్తవానికి ఓయూ ఒక విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఒక క్లాసురూమ్ ఫంక్షన్ జరగడానికి సరిపడా నాలెడ్జ్ రిసోర్సెస్ లేక దాదాపు దశాబ్దం దాటింది. మొత్తం కాంట్రాక్టు ఫాకల్టీతో యూనివర్సిటీ నడుస్తున్నది. క్లాసురూమ్ ఫంక్షన్ ఆగిపోయి చాలా కాలమవుతున్నది. ప్రస్తుతం యూనివర్సిటీకి వస్తున్న విద్యార్థుల్లో మెజార్టీ విద్యార్థులు చక్కటి ఆంగ్లభాష పరిజ్ఞానంతో వస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందున్నారు. వారు అసంతృప్తితో తరగతి మొఖం చూడటానికి ఇష్టపడటం లేదు.కరోనా కాలంలో కోల్పోయిన రెండేళ్ల కాలాన్ని రీసెర్చ్ చేసుకోవడానికి అన్ని యూనివర్సిటీలు రెండేళ్ల సమయాన్ని ఇచ్చినప్పటికీ, ఓయూ మాత్రం ఇవ్వడం లేదు. పీహెచ్‌డీ పరిశోధనలకు డెడ్‌లైన్ పేరుతో అధికారులు ఆటంకపరుస్తున్నారు. సబ్మిషన్ చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించటం లేదు. ఇది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలకు పూర్తి విరుద్ధం. యూనివర్సిటీ విద్య అనేది విద్యార్థి భవిష్యత్తులో విలువైన ఘట్టం. వారు ఎంచుకున్న రంగంలో అధునాతన జ్ఞానం, నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి, అలాగే ఏదైనా వృత్తిలో విజయం సాధించడానికి అవసరమైన విమర్శనాత్మక ఆలోచన, జ్ఞానాన్ని సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో విశ్వవిద్యాలయ విద్య సహాయపడుతుంది.

యూనివర్సిటీ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం మితిమీరింది. ఇది చాలా సమస్యాత్మకమైనది. ఎందుకంటే ఇది ఉన్నత విద్య స్వయం ప్రతిపత్తిని, విద్యా సమగ్రతను పారదర్శకత లేకుండా చేస్తున్నది. వివిధ సమీకరణల పేరుతో అర్హతలేని వ్యక్తులను వీసీలుగా నియ మిస్తున్నది. వారి చేత యూనివర్సిటీల్లో వివిధ అకాడమిక్ స్థానాల్లో నియమించబడిన వారు సైతం విద్యార్థి వ్యతిరేకవిధానాలను అమలు పరుస్తున్నారు. దీనివల్ల యూనివర్సిటీ విద్య ప్రమాణాలు దారుణంగా దిగజారడమే కాకుండా యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తి కోల్పోతున్నాయి.ఈ సంక్షోభం అధిగమించలేనిది కాదు. విశ్వవిద్యాలయాలు తాత్విక సంప్రదాయాన్ని నూతన ఆవిష్కరణలతో సమతుల్యం చేసుకోవాలి. యూనివర్సిటీ అభివృధిలో విద్యార్థులను భాగస్వామ్యం చేసుకోవాలి. వైస్ ఛాన్సలర్ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వ్యవస్థ రగిలిస్తున్న ఉద్యమాలపై విద్యార్థులు స్పందించి ఉద్యమిస్తున్నప్పుడు వారి ఆవేదనను అర్థం చేసుకోవాలి. ఓయూ అనేది ఒక నిరంతర సంఘర్షణ కేంద్రం. ఇది సామాజిక, అస్తిత్వ, రాజకీపరమైన చర్చలకు నెలవు. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఇక్కడి విద్యార్థి సంఘాల మధ్య ఉద్యమించే స్వభావాలు మారాయి కావచ్చు. కానీ అణచివేత, అన్యాయాల పట్ల ఒకే పద్ధతిలో ఉద్యమిస్తున్నాయి. కనుక భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమైన సర్క్యులర్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలి.

- సునీల్ నీరడి, 9493021021

సుంకాల యుద్ధం - బలహీన పడుతున్న అమెరికా ఆధిపత్యం



సాత్యకి రాయ్

ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తున్న శక్తులు తమ ప్రచార దిశను మార్చుకున్నట్టుంది. నిన్నటిదాకా అంతర్జాతీయ వాణిజ్యం మీద ఏ దేశమూ ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని, ఆంక్షలు లేని వాణిజ్యం భాగస్వా ములందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తమ తమ దేశాల ప్రయోజనాలను రక్షించుకోవడమే ప్రధానంగా మారినట్టు కనిపిస్తోంది. దానితోబాటు పాతకాలపు వలసాధిపత్య భావాలను కూడా మళ్లీ ప్రకటిస్తున్నారు. ఈ ప్రపంచాన్ని శాసించే హక్కు తమకే ఉందన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అమెరికా వివిధ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులే ఎక్కువ. అమెరికా నుండి ఆ దేశాలకు జరిగే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ట్రంప్ అటువంటి దేశాల నుండి వచ్చే దిగుమతులపూ అధిక సుంకాలను విధిస్తున్నాడు. ఈ చర్యల్లో ఆర్థిక హేతుబద్ధత కన్నా ప్రజలను ఆకట్టుకోవడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలో అమెరికా చాలా ఉదారంగా ఇతర దేశాల ఎడల వ్యవహరించినట్టు, దానివలన ఆ దేశాలన్నీ ప్రయోజనాలు పొందినట్టు, ఇప్పుడు అమెరికా తన స్వంత దేశపు పరిశ్రమల రక్షణకు, తన స్వంత కార్మికుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడానికి సుంకాల పెంపు తప్పదన్నట్టు ఈ నాటకం నడుస్తోంది.

పెట్టుబడి ఎప్పుడూ రంగులు మారుస్తూనే వుంటుంది. నయా ఉదారవాద శకం ప్రపంచం మీద తన విధానాలను రుద్దడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థలను సాధనాలుగా వాడుకోవడంతో ఆవిష్కరించ బడింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టవచ్చో, అక్కడికల్లా ప్రపంచ పెట్టుబడి తరలిపోయింది. ఎక్కడ సహజ వనరులు చౌకగా దొరుకుతాయో అక్కడ వాటిని చేజిక్కించుకుంది. ఒకదాని వెంట మరొకటిగా దేశాలు ఈ నయా ఉదారవాద పెత్తనానికి లొంగిపోయాయి. పోటీ ప్రపంచం అనే పేరుతో తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద తమకున్న నియంత్రణను విడిచిపెట్టి, తమ పాలనా విధానాలను తామే రూపొందిం చుకునే హక్కును సైతం గాలికొదిలేశాయి. దిగుమతుల మీద ఆంక్షలు ఎప్పుడైతే సడలించడం జరిగిందో అప్పుడు ఆ యా దేశాల్లోకి పెద్దపెట్టున సరుకులు వచ్చి పడడం మొదలైంది. దాని వలన దేశీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఈ విధానాలకు లోబడి వ్యవహరించడానికి నిరాకరించిన చైనా వ్యూహాత్మకంగా తన స్వంత శక్తి సామర్థ్యాలను పెంచు కోవడం మీద కేంద్రీకరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకుంది.

> ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశనకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సి డీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు.

చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధా నాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు. ప్రస్తుతం జి-7దేశాలు నమోదు చేస్తున్న ఆర్థిక వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటుతో ఉన్న దేశాలు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అగ్ర స్థానం క్రమంగా చేజారుతోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో పడి గతంలో తాను ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య సూ త్రాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వచ్చిన అమెరికా ఇప్పుడు 'జాతీయ ప్రయోజనాల' గురించి మాట్లాడుతోంది. ఎంత గొప్పగా జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడినా, అదనంగా విధించిన సుంకాల వలన అమెరికాకు దిగుమతి అయే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని వలన అమెరికన్ పౌరులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తుంది. ఇంకో పక్క ఈ కొత్త సుంకాలపై అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, ఆయా దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను ఏ విధంగా మార్చుకుంటారో చూడాలి. దీని పర్యవసానాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ విధంగా స్వీకరిస్తుందో అదీ చూడాలి. వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఉత్పత్తి, సరఫరా చెయిన్లను ఏ విధంగా దెబ్బతీస్తాయో అది కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న వాణిజ్యచర్చలు రానున్నకాలంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ఏవిధమైన ప్రభావాన్ని చూపుతాయో చూడాలి.

ప్రతీకార సుంకాలు

భారతదేశానికి, అమెరికాకు నడుమ 125 బిలియన్ల డాలర్ల (12,500 కోట్ల డాలర్లు లేదా రూ. 10, 79,500 కోట్లు) వాణిజ్యం సాగుతోంది. అమెరికాకు భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై విధించే సగటు సుం కం ఇప్పుడు 2.8 శాతం ఉంది. అదే అమెరికా భారతదేశానికి ఎగుమతి చేసే సరుకుల మీద సగటు సుంకం 7.7 శాతం ఉంది. ఇప్పుడు అమెరికా కూడా భారతదేశం నుండి ఎగుమతి అయే సరుకుల మీద 7.7 శాతానికి సుంకాన్ని పెంచనుంది. దీని వలన వివిధ రంగాల్లో వివిధ రకాలుగా ప్రభావం పడుతుంది. ట్రంప్ కోరుతున్నట్టు అమెరికా నుండి మనకు దిగుమతి చేసుకునే సరుకులపై మనం సుంకాన్ని గనుక తగ్గిస్తే అప్పుడు అక్కడి నుండి ఎక్కువగా దిగుమతి అయే వ్యవసాయ ఉత్పత్తులు భారతీయ మార్కెట్‌లో చౌకగా లభిస్తాయి. మన స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు రేట్లు ఇంకా తగ్గిపోతాయి. అదే మనదేశం నుండి ఎగుమతి అయే సరుకులపై అమెరికా ఎక్కువ సుంకాన్ని విధిస్తే ఇక్కడి నుండి మనం పంపే ఆటో విడిభాగాలు, మాంసం తదితర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, వజ్రాలు, బం గారు ఆభరణాలు, రసాయనాలు, ఔషధాలు వంటివి మరింత ఖరీదౌతాయి. అప్పుడు వాటికి అమెరికాలో డిమాండ్ తగ్గుతుంది. ఒక తాజా అధ్యయనం ప్రకారం మన దేశం నుండి ఎగుమతి చేసే ప్రాసెస్డ్ ఫుడ్ మీద సుంకం 32.37 శాతం పెరుగుతుంది. అదే విధంగా ఆటో విడిభాగాల మీద 23.10 శాతం, వజ్రాలు, ఆభరణాల మీద 13.32 శాతం, రసాయనాలు, ఔషధాల మీద 8.63 శాతం పెరుగుతుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద, లెదర్, పేపర్, గ్లాస్, ప్లాస్టిక్ వస్తువుల మీద, జౌళి, దుస్తుల మీద, యంత్రాల మీద, కంప్యూటర్ తయారీలో ఉపయోగించే ఖనిజాల మీద, వివిధ రకాల లోహాల మీద సుంకాలు పెరుగుతాయి.

సుంకాలు పెరిగితే మనం ఎగుమతి చేసే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన ఎగు మతులు తగ్గవచ్చు. మరోపక్క అమెరికా తాను భారతదేశానికి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తుల మీద విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని పట్టుబడుతోంది. ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశనకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సి డీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు. ఇప్పటికే వినిమయ సరుకుల ఉత్పత్తి రంగంలో దిగుమతుల దాడి ఫలి తంగా దేశీయ పరిశ్రమలు దారుణంగా దెబ్బ తినిపోయాయి. ఇకపైన రైతుల పరిస్థితీ అలాగే అవుతుంది. ఏ దేశానికి ఆ దేశం తన జాతీయ



అవసరాల రీత్యా, ప్రత్యేకతల రీత్యా సుంకాలను విధిస్తుంది. దానికి భిన్నంగా అగ్రరాజ్యం ప్రయోజనాల కోసం సుంకాల విధానాన్ని మార్చితే దాని ప్రతికూల ప్రభావం దేశంలోని ప్రజల మీద తీవ్రంగా పడుతుంది.

అమెరికాలో సంక్షోభం

ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయివుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజు కోగలదో వేచిచూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది.

> ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయివుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజు కోగలదో వేచిచూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది.

అమెరికాలో కార్మికవర్గం నిజ వేతనాలు బాగా దెబ్బ తినిపోవడం, మరోవైపు కార్పొరేట్లు సూపర్ లాభాలకు పడగలెత్తడం వల్లే డెమోక్రాట్లు ఎన్నికల్లో ఓడిపోయారు. నిజానికి వాళ్ల దగ్గర రిపబ్లికన్లు ప్రతిపాదించిన మితవాద ఎజెండాకు ప్రత్యామ్నాయమైన ఎజెండా అంటూ ఏదీ లేదు. ఈ రెండు పార్టీల నడుమ ఉన్న విధానపరమైన తేడా దాదాపు శూన్యం. నిస్సహాయులమై పోయామని భావిస్తున్న అమెరికన్ పౌరులకు ట్రంప్ ప్రకటించిన రక్షణాత్మక విధానాలు ఒకింత ఆశను కల్పించాయి. ఆ ఆశను నిలబెట్టుకోడానికే ట్రంప్ ఇప్పుడు తాను అమెరికన్ పరిశ్రమలను, అమెరికన్ కార్మికుల ఉద్యోగాలను కాపాడేందుకు పాటు పడుతున్నట్టు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో న్యూడీల్ పేరిట కీన్సియన్ విధానాలు అమలైన కాలంలో అమెరికన్ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, సదుపాయాలు గత యాభైఏండ్ల కాలంలో క్రమంగా కరిగి పోయాయి. గత రెండు దశాబ్దాల కాలంలో కార్మికుల నిజవేతనాలు బాగా పడిపోయాయి. కార్పొరేట్ల లాభాలు బాగా పెరిగాయి. ఇప్పుడు దిగుమతుల మీద అమెరికా విధిస్తున్న అదనపు సుంకాల వలన దేశీయంగా ఉత్పత్తి అయే సరు కులకు డిమాండ్ కొంతమేరకు పెరిగి కొన్ని ఉద్యోగాలు కలగవచ్చు. కాని అదనపు సుంకాల వలన దిగుమతి అయే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని భారం మళ్లీ కార్మిక వర్గం మీదనే పడుతుంది. అప్పుడు వారి జీతాలను గనుక పెంచితే అమెరికన్ ఉత్పత్తుల ధరలు పెరిగి వాటి డిమాండ్ తగ్గుతుంది. దాని వలన ఉపాధి అవకాశాలు తగ్గి పోతాయి. ఒకవేళ జీతాలను పెంచకపోతే కార్మికవర్గం సంక్షోభ భారాన్ని నేరుగా మోయవలసి వస్తుంది. ఏది జరిగినా దెబ్బ తినిపోయేది కార్మికవర్గమే.

ఇప్పుడు కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా కార్పొరేట్ల దోపిడీకి బలైపోవడమే కనిపిస్తోంది. ఆ కార్పొరేట్లు స్వదేశీయులా, లేక బహుళజాతి సంస్థలా అన్నదానితో నిమిత్తం లేదు. అయితే ప్రభుత్వాలు మాత్రం 'జాతీయ ప్రయోజనాలు' అన్న ముసుగులో ఈ కార్పొరేట్ల దోపిడీని ప్రజలు గమనించకుండా దాచిపెడుతున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

హెచ్‌సీయూ ఇంకెన్నిసార్లు తన భూముల్ని కోల్పోవాలి?



బి.మదన మోహన్ రెడ్డి
9989894308

మనదేశ ప్రభుత్వ రంగంలో నిధులు, నియామకాలు, నిర్వహణతో ఆరోగ్యకరంగా ఉండే ఉన్నత విద్యాసంస్థలు అతి తక్కువగానే ఉన్నాయి. అటువంటి వాటిలో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ఒకటి. 1974లో ఏర్పాటైన హైదరాబాదు విశ్వవిద్యాలయం అంచలంచెలుగా ఎదిగి నేడు ఐదు వేల పైచిలుకు విద్యార్థులతో దేశంలోని టాప్ టెన్‌లో ఒకటిగా నిలుస్తూ వస్తుంది. అటువంటి విశ్వవిద్యాలయ పరిధి భూములను అభివృద్ధి పేరిట నాలుగు వందల ఎకరాలను వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధపడింది. ఇది ఉన్నత విద్యావ్యవస్థపైన తీవ్రప్రభావం చూపుతుంది. ప్రతి విశ్వవిద్యాలయానికి ఒక ఇకానిక్ సింబల్ ఉంటుంది. ఉస్మానియాకు ఆర్ట్స్ కాలేజ్ భవనం, ట్రిబుల్ ఐటీ-హైదరాబాదుకి మర్రిచెట్టు ఉన్నట్టు హైదరాబాదు విశ్వవిద్యా లయానికి మసురంరాక్ అనేది ఉంది. ఈ వేలం ద్వారా అది కూడా ప్రమాదంలో పడిం ది.హైదరాబాదు విశ్వవిద్యా లయం స్థాపించి యాభై ఏండ్లు గడిచిన శుభతరుణంలో ఈ భూముల వేలం వేయడమన్నది అసహేతుకం.

ఈ విశ్వవిద్యాలయం మొదటి నుంచి భూమిని కోల్పోవడమే ఉంది.1974లో 2,324 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నాటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాదు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి తహశీల్దార్ ఆఫీసు కోసం 1987వ సంవత్సరంలో ఐదెకరాలు (2009 వరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఒక మండలం), ఆర్టీసీ డిపో కోసం 1990లో పదెకరాలు, స్థానికంగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పిల్లల ప్రాథమిక విద్యకై 1994లో నవోదయ పాఠశాలకు ముప్పై ఎకరాలు, రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం 1990లో 62 ఎకరాలు (అనంతరం హైదరాబాదు ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేశారు-1998), గచ్చిబౌలి స్టేడియం కోసం 2000లో 108 ఎకరాలు, ఐయంజీ భారత కోసం 2004లో 400 ఎకరాలు (ప్రస్తుతం వేలంలో ఉన్నది), ఏపీ, టీఎన్జీవోస్ హౌసింగ్ కోసం 2007లో 134.28 ఎకరాలు (కోవిడ్ కాలంలో ఇంకా అధిక మొత్తంలో ఆక్రమణలకు గురైంది), టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ కోసం 2009లో 210 ఎకరాలు... ఇలా నిరంతరం విశ్వవిద్యాలయం తన భూమిని వివిధ అవసరాల రీత్యా కోల్పోవడం కొనసాగుతూనే ఉంది.

వేలం భూమి నిజంగా ఎవరిది?

2004లో నూతనంగా ఏర్పడిన ఐఎంజీ భారత అనే క్రీడా సంస్థకు నాటి చంద్రబాబు ప్రభుత్వం 850 ఎకరాల భూమిని రెండు చోట్ల కేటాయించింది. అవి వర్సిటీ పరిధిలో 400 ఎకరాలు, శంషాబాద్‌లో 450 ఎకరాలు. వర్సిటీకు పరిహారంగా సమానమైన భూమిని కేటాయిస్తాము అన్న హామీతో ముందుకెళ్లింది. అనంతరం వచ్చిన వైయస్ఆర్ ప్రభుత్వం ఆ కేటాయింపులను నిలుపుదల చేశారు. సదురు సంస్థ కోర్టుకు వెళ్లడం, ప్రభుత్వం ప్రతివాదనలు వినిపించడం ఇలా ఇరవై ఏండ్ల పాటు ఈ కేసు నడిచి ఇటీవల సుప్రీంకోర్టు ఆ సంస్థకు ఆ 400 ఎకరాలపై ఎటువంటి అధికారం లేదని తీర్పుని వెలువరించింది. వాస్తవానికి ఈ భూమి కోర్టు వివాదంలో ఉండడంతో వర్సిటీ నుంచి తీసుకొన్న భూమికి ప్రతి భూమిగా ఎక్కడా కేటాయించిన దాఖాలాలు లేవు. వాటిపై వర్సిటీకి కూడా నైతిక హక్కు ఉంది. ఫైనాన్షియాల్ డిస్టిక్ వల్ల పెరిగిన ధరల రీత్యా



ప్రభుత్వం వాటిని కార్పొరేట్ కంపెనీలకు వేలం వేయడానికి చూస్తున్నారు. ఈ చర్యను నిరసిస్తూ విద్యార్థులు ధర్నాలు చేసినా ప్రభుత్వం నుంచి ఏ విధమైన ప్రకటన చేయకపోవడం శోచనీయం. హైదరాబాద్ మహానగరంలో సహజసిద్ధ అడవులుగా మిగిలింది కేవలం కేబిఆర్ పార్క్, హైదరాబాదు విశ్వవిద్యాలయం మాత్రమే. నగరవాసులకు ఈ రెండు ఉపిరితిత్తుల మాదిరి ఆక్సిజన్ అందిస్తున్నాయి. వర్సిటీలో లేళ్లు, నెమళ్లు, కుందేళ్లు, దుప్పులు, అడవి పందులు, వివిధ పక్షులు, కీటకాలు, చెరువులు ఒక బయోలైఫ్ ఉంది. ఇవేకాకుండా పురాతన ఆనవాలైన రాకాసి శిలలు, ఏకశిలలు ఉన్నాయి. ప్రయివేటు పరంగా చేస్తే ఈ ఆనవాళ్లు, జీవజాతుల మనుగడకు ప్రమాదంగా మారుతుంది.

స్వర్ణోత్సవ వేళలో వేలమా?

అన్నం పెట్టి, అక్షరం దిద్దించిన బడిని ప్రతిఒక్కరూ మానసిక మాతృత్వశాలగానే భావిస్తారు. జీవికకు నోచుకోని ఎందరో పేద పిల్లలను ఉన్నత స్థానాలలో నిలబెట్టగలిగేది హెచ్‌సీయూలాంటి విశ్వవిద్యాలయాలే. అటువంటి సంస్థల నుంచి ఎదిగినవాళ్లను తిరిగి తనవైపు చూసేలాగా మనసులో మెదులుతూనే ఉంటుంది. మధ్యతరగతి నుంచొచ్చిన తనను మేధావిగా మార్చి నందుకు కృతజ్ఞతగా డాక్టర్ కృష్ణా చివుకుల అనే పూర్వ విద్యార్థి ఐఐటీ మద్రాసుకు రూ.228 కోట్ల విరాళాన్ని అందించారు. నేటి తెలంగాణ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క, ఐటీ శాఖామంత్రిగా వ్యవహరిస్తున్న దుద్దిల్ల శ్రీధర్ బాబు ఇద్దరూ హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులే. రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ఉండి కూడా ఈ నాలుగు వందల ఎకరాల వర్సిటీ భూమిని వేలం వేయడాన్ని ఆపలేకపోవడం అసమర్థతగానే చూడాల్సి ఉంటుంది. తొంభై శాతం ఆర్థిక సామాజిక అసమానత కుటుంబాల పిల్లలే ఈ విశ్వవిద్యాల యంలో చదువుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని శాఖలుగా ఏర్పాటు చేసుకోవాలన్నా, ప్రపంచస్థాయి సంస్థలతో పోటీపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నా ఆహ్లాదకరమైన క్యాంపస్ ఉండాలి. వర్సిటీ స్థాపించి యాభై ఏండ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ వేలం వేయడం అత్యంత బాధాకరం. దీన్ని వెంటనే ఆపి నాడు వర్సిటీ నుంచి తీసుకున్న భూమి తిరిగి అప్పజెప్పేలా చర్యలు తీసుకోవడం దేశభవిష్యత్తుకు ప్రయోజనం. అదే విధంగా ప్రకృతిరీత్యా కూడా ఆరోగ్యకరం. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించాలి. అందుకు మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూనుకోవాలి. జ్ఞానం పంచిన విశ్వవిద్యాలయం భవిష్యత్తు తరాలకు అంతర్జాతీయంగా పెంపొందించే విధంగా పాటుపడాలి అంతేకానీ, చదువులమ్మ చెట్టు కొమ్మలని నరుకుతుంటే గుడ్లప్పగించి చూస్తూ.. గొడ్డలి నప్పగించి మిన్నకుండిపోతే హెచ్‌సీయూ భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించదన్న విషయాన్ని గమనంలో పెట్టుకోవాలి.

> తొంభై శాతం ఆర్థిక సామాజిక అసమానత కుటుంబాల పిల్లలే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని శాఖలుగా ఏర్పాటు చేసుకోవాలన్నా, ప్రపంచస్థాయి సంస్థలతో పోటీపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నా, ఆహ్లాదకరమైన క్యాంపస్ ఉండాలి. వర్సిటీ స్థాపించి యాభై ఏండ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ వేలం వేయడం అత్యంత బాధాకరం. దీన్ని వెంటనే ఆపి నాడు వర్సిటీ నుంచి తీసుకున్న భూమి తిరిగి అప్పజెప్పేలా చర్యలు తీసుకోవడం దేశభవిష్యత్తుకు ప్రయోజనం. అదే విధంగా ప్రకృతిరీత్యా కూడా ఆరోగ్యకరం. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించాలి. అందుకు మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూనుకోవాలి.

పంట నష్టాలపై సర్వే చేయాలి

- వరి ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్
- హన్వాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ- హన్వాడ

గ్రామాల్లో సాగునీరందక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఏ.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సాగర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే చేసినట్టు చెప్పారు. సాగునీరందక పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఎండిపోయిన వరి పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం చెప్పినట్టు అందరికీ రుణమాఫీ కాలేదని, గ్రామాల్లో 40శాతం మంది రైతులకు ఇంకా అందలేదని తెలిపారు. ధరణిలో లోపాల వల్ల రైతుల భూములు అందులో నమోదు కాలేదని, లోపాలను సరిచేసి రైతులు సాగు చేసుకుంటున్న భూములను పాస్‌బుక్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎకరాకు రూ.7500 చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కిందన ఇవ్వాల్సిన ఇండ్లను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం తహసీల్దార్ కిష్టనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ.. కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, పంచాయతీ కార్యదర్శులకు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏ.లక్ష్మయ్య, నాయకులు రమణయ్య, టి.రాములు, శ్రీకాంత్, వెంకటమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. పంటలు కోతకు వచ్చే తరుణంలో అవి దెబ్బతినటంలో నష్టపోయిన రైతులు ఆందోళనలో ఉన్నారని పేర్కొంది. మొక్కజొన్న, వరి, మామిడి, కూరగాయలు, చెరుకు తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'పిడుగులు పడి ఇద్దరు మరణించారు. గొర్రెలు, మేకలు, పశువులను నష్టపోయారు. కొన్ని చోట్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం తడిసింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వానాకాలంలో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం 1.5 లక్షల ఎకరాలకు రూ.15.80 కోట్లు మాత్రమే సహాయం చేసిందని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడితో పోల్చితే అది నామమాత్రమేనని తెలిపారు. ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో రైతులకు బాగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.11వేల కోట్ల నష్టం జరిగిందని ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ప్రారంభించలేదని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన 'పీఎమ్ ఫసల్ బీమా స్కీమ్'లో గత ప్రభుత్వం చేరినప్పటికీ ప్రీమియం చెల్లించక పోవడంతో రైతులకు పరిహారం అందలేదని తెలిపారు. అందువల్ల యాసంగిలో జరిగిన పంట నష్టాన్ని సేకరించి, పూర్తి పరిహారాన్ని రైతులకు చెల్లించాలని కోరారు

సహాయక చర్యల్లో వేగం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి సమీక్షించారు. సీఎంతోపాటు మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల రోజులుగా ప్రమాదస్థలి లో కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని విపత్తు నిర్వహణ విభాగం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రయివేటు సంస్థలన్నీ కలిపి 25 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 700 మంది సిబ్బంది నిమగ్నమైనట్టు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తున్నామనీ, ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు చేరవేస్తున్నట్టు చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్ కండ్లకు కట్టేలా ప్రమాదం జరిగిన రోజున, ఇప్పుడున్న పరిస్థితుల ఫొటోలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఇన్‌లెట్ వైపు నుంచి సొరంగంలో 14కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగినందున గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా సాగుతున్నదని అధికారులు వివరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30 మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్‌గా గుర్తించినట్టు చెప్పారు. జీఎస్ఐ, ఎన్జీఆర్ఐ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రమాదానికి గురైన కార్మికుల ఆచూకీ కనుక్కునేందుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ఆపద సమయంలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో గుర్ ప్రీత్ సింగ్ మతదేహం మార్చి తొమ్మిదవ తేదీన బయటికి తీసిన విషయం తెలిసిందే. కాగా మిగతా కార్మికులను గుర్తించేందుకు ఆపరేషన్ కొనసాగించాలనీ, అవసరమైన అన్ని ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సీఎం అధికారులకు సూచించారు. ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకు పనులు కొనసాగించాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ, సింగరేణి, హైడ్రా, ఫైర్ సర్వీసెస్ ప్రతినిధులు, ఎస్-ఎల్‌బీసీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ ఎండీ పంకజ్ గౌర్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

ఇదే తుది సమావేశం : పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అయితే మంత్రివర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గం, తదితర అంశాలపై అధిష్టానంతో ఇదే చివరి సమావేశమని స్పష్టత ఇచ్చారు. మరోసారి చర్చ ఉండదని పేర్కొన్నారు. "రాష్ట్రంలో జరుగుతోన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఖర్గే, రాహుల్ గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం, విద్యా రంగాల తీరుపై రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అడిగారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు గురించి పలు అంశాలను తెలుసుకున్నారు. వాటివల్ల ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు లాభం జరుగుతుంది? ఎంతమందికి ప్రవేశాలు లభిస్తాయి? అని అడిగారు." అని తెలిపారు. వీటితో పాటు... క్యాబినెట్ విస్తరణ, పీసీసీ కొత్త కార్యవర్గం, వివిధ కార్పొరేషన్ చైర్మెన్లు, బోర్డుల నియామకంపై చర్చించినట్టు మీడియాకు తెలిపారు. వీటిపై తమ అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. అన్ని విషయాలపై త్వరలో అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుం టుందని చెప్పారు.

'మధ్యాహ్న' బకాయిలు విడుదల చేయాలి

ఎన్నికల హామీ రూ.10,000 వేతనం ఇవ్వాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మహాధర్నా



నవతెలంగాణ - ముషీరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వారికి రూ.10,000 వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న అధ్యక్షతన మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు పది వేల రూపాయల వేతనం అమలు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయకపోగా.. అరకొరగా ఇచ్చే వేతనం కూడా పెండింగ్‌లో పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పనిచేస్తున్న మహిళలంతా అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన వారేనని, వారికి ఇచ్చే వేతనం చాలా తక్కువ అని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటోందని తెలిపారు. ప్రభుత్వం గుడ్డుకిచ్చే బడ్జెట్‌తో రెండు గుడ్లు కూడా రావు.. మూడు ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని ప్రశ్నించారు. ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు ఎంతకాలం అప్పులు చేసి పెడతారని ప్రశ్నించారు. గుడ్లను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం నేరుగా పాఠశాలలకు కూడా సరఫరా చేయాలని కోరారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్ర స్కీమ్‌లకు కేంద్ర ప్రభుత్వం తన వాటా చెల్లించడం లేదు. దీని ప్రభావం మధ్యాహ్న భోజన కార్మికులపై కూడా పడుతోందని అన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బడ్జెట్ కేటాయించి అమలు చేస్తే మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జి.పద్మ, మాయ, ఉన్ని కృష్ణ, చిన్నన్న, కృష్ణమాచారి, చామంతి లక్ష్మీ, పద్మ, సుల్తాన్, హంస తదితరులు పాల్గొన్నారు.

స్టాండప్ కమెడియన్ షోపై రేగిన వివాదం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో షిండేకు క్షమాపణ చెప్పకపోతే కమ్రాను వీధుల్లో తిరగనిచ్చేది లేదని శివసేన ఎమ్మెల్యే ముర్జి పటేల్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కమ్రా ప్రకటన వెలువడింది. శిండేపై అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసినందుకు కమ్రాపై ముంబయి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే హేబిటేట్ స్టూడియోను ధ్వంసం చేసినందుకు 40మంది శివసేన కార్యకర్తలపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. స్టూడియోపై, హోటల్ ఆవరణపై వారు దాడికి దిగారని పోలీసులు తెలిపారు.

శివసేన కార్యకర్తలు తమ వేదికను ధ్వంసం చేసినందున హేబిటేట్ స్టూడియోను మూసివేస్తున్నట్టు అంతకుముందు స్టూడియో యాజమాన్యం ప్రకటించింది. "మేం దిగ్భ్రాంతి చెందాం, ఆందోళన చెందుతున్నాం. మమ్మల్ని లక్ష్యంగా చేసుకుని విధ్వంసానికి దిగిన చర్యలతో మా హృదయాలు చెదిరిపోయాయి." అని ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం స్టూడియో యాజమాన్యం పేర్కొంది. "కళాకారులు తమ అభిప్రాయాలకు, సృజనాత్మక ఎంపికలకు మాత్రమే బాధ్యత వహిస్తారు. తాము ప్రదర్శించిన కంటెంట్‌లో ఎన్నడూ జోక్యం చేసుకోరు." అని స్టూడియో పేర్కొంది. "కానీ దాదాపుగా ప్రదర్శనకారుడికి ప్రాక్సీగా వున్న ప్రతిసారీ తమని ఎలా నిందిస్తున్నారో, లక్ష్యంగా చేసుకుంటున్నారో ఇటీవలి సంఘటనలతో తాము పునరాలోచించుకోవాల్సి వస్తోందని పేర్కొంది.

మేం కానీ, మా ఆస్తులు గానీ ఇబ్బందుల్లో పడకుండా వుండేలా భావ ప్రకటనా స్వేచ్ఛకు ఒక వేదికను అందించేందుకు ఉత్తమ మార్గాన్ని రూపొందించుకునేవరకు స్టూడియోను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం కళాకారులు, ప్రేక్షకులు, దీనితో ప్రమేయమున్న ఇతర పక్షాల వారినందరినీ వారి అభిప్రాయాలు తెలియచేయాల్సిందిగా కోరుతున్నామని, ప్రదర్శనకారుల హక్కులను కూడా తాము గౌరవిస్తామని స్టూడియో నోట్ పేర్కొంది. ఈ వీడియో వల్ల మనోభావాలు దెబ్బతిన్న వారందరికీ స్టూడియో క్షమాపణ చెబుతూ అంతకుముందు ఒక పోస్టు పెట్టింది. కునాల్ కమ్రా ఇటీవల చేసిన వీడియో తయారీలో హేబిటేట్ స్టూడియో ప్రమేయం లేదని, ఆ వీడియో వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా సమర్థించడం లేదని పేర్కొంది. కమ్రా షో నిర్వహించిన హేబిటేట్ స్టూడియోలోనే గత నెల్లో పెద్ద ఎత్తున వివాదానికి దారి తీసిన వివాదాస్పద ఇండియాస్ గాట్ లాటెంట్ షో చిత్రీకరించబడింది.

సీపీఐ(ఎం) ఖండన

స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాను లక్ష్యంగా చేసుకుని ఆయన షోను ప్రదర్శించిన స్టూడియోను పాలక గూండాలు ధ్వంసం చేయడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఇదే స్టూడియోలోని పలు భాగాలను మున్సిపల్ అధికారులు సోమవారం కూల్చివేశారు. కమ్రాను బెదిరించడం, అడ్డగించడంతో సహా ఆయనపై అనేక కేసులను ప్రభుత్వం నమోదు చేసింది. ఈ పరిస్థితి చూస్తుంటే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలకు మూక హింస ఒక్కటే చట్టమని స్పష్టమవుతోందని సీపీఐ(ఎం) విమర్శించింది. ఈ తరుణంలో కునాల్ కమ్రాకు ఆయన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సీపీఐ(ఎం) బాసటగా వుంటుందని ఆ ప్రకటన పేర్కొంది.

ఎంఎంటీఎస్ బాధితురాలిని పరామర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు

- బాధితురాలికి భరోసానివ్వాలి..నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న 22 ఏండ్ల యువతిపై లైంగికదాడి చేసిన దుర్మార్గులను అరెస్ట్ చేయకపోవడం బాధాకరమని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు, రామారావు పటేల్ అన్నారు. బాధితురాలి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఖండించారు. సోమవారం సాయంత్రం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో బాధితురాలిని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయడంతోపాటు ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఇంత దుర్మార్గం జరిగినా నిందితులను అరెస్ట్ చేయలేదనీ, ఈ విషయంలో ప్రభుత్వం నుండి సరైన స్పందన కూడా లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ఆడపిల్లపై అఘాయిత్యానికి ప్రయత్నించారని తెలిసిన వెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని స్పందించిన తీరు అభినందనీయమన్నారు. బీజేపీ పక్షాన బాధితురాలికి అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. బండిసంజయ్ చొరవ తీసుకుని యశోద ఆస్పత్రికి బాధితురాలిని తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బాధితురాలిపై దాడి చేసిన ఆగంతకులను పట్టుకుని శిక్షించకపోవడం, కనీసం బాధితురాలికి తగిన వైద్య, ఆర్థిక సాయం కూడా చేయకపోవడం క్షమించలేనిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా వెంటనే ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించిన తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- పీఆర్టీయూ తెలంగాణ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ఈనెల 31లోపు చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బిల్లులు సుమారు రెండేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల వేతనంలో నుంచి మినహాయించిన డబ్బులు అవసరానికి ఉపయోగించుకోవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పిల్లల పెండ్లికిగాని తల్లిదండ్రుల ఆస్పత్రి ఖర్చులుగాని చెల్లించాలంటే తాము జమ చేసిన డబ్బులు అవసరానికి కూడా వాడుకునే పరిస్థితి లేదని తెలిపారు. సరెండర్ బిల్లులు, మెడికల్ బిల్లులు, ఇన్సూరెన్స్ డబ్బులు, జీపీఎఫ్ డబ్బులు కూడా ఏండ్ల తరబడి ఈ-కుబేర్‌లో ఉన్నాయని వివరించారు. బిల్లులు రాక ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఏలు ఇవ్వడం లేదనీ, పీఆర్సీ ఊసేలేదని పేర్కొన్నారు. డీఏలు అడిగితే జీతాలిచ్చేది కష్టమని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. పైసా పైసా జీపీఎఫ్‌లో జమ చేసుకుంటే అవసరానికి అందడం లేదని పేర్కొన్నారు. పిల్లల పెండ్లి ఎలా చేయాలనీ, ఆస్పత్రి ఖర్చులు ఎలా భరించాలని ప్రశ్నించారు. కేవలం జీతం తప్ప ఏమీ ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు. ఆ నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను ప్రత్యేక బడ్జెట్ కేటాయించి చెల్లించాలని కోరారు. లేకుంటే ఉద్యమ కార్యచరణ చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

ఆశాలను అరెస్టులు చేసి అగౌరవ పరుస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేసి వారిని అగౌరవ పరిచిందని మాజీ మంత్రి టి హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ అరెస్టులను బీఆర్ఎస్ ఖండిస్తున్నదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు వేతనాలు పెంచాలని అడగడమే ఆశాలు చేసిన నేరమా? అని ప్రశ్నించారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి స్టేషన్లకు తరలించడం దుర్మార్గమని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశాల పట్ల ఎందుకింత నిరంకుశత్వం? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా?అని నిలదీశారు. ఆశా సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం మూడు సార్లు వారి పారితోషికాలను పెంచిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రూ.1,500లు మాత్రమే ఉన్న వేతనాన్ని, రూ.9,750లకు పెంచిందని తెలిపారు. విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించి, ఆ బిల్లులను ప్రభుత్వమే చెల్లించిందని పేర్కొన్నారు. ఆశాల గౌరవాన్ని పెంచింది కేసీఆర్ అయితే, నేడు అరెస్టులు చేసి అగౌరవ పరుస్తున్నది రేవంత్ ప్రభుత్వం అని విమర్శించారు.

వడగండ్ల వాన ఊడ్చేసింది

(మొదటిపేజీ తరువాయి)

రైతులు ఉద్యమించారని తెలిపారు. వారిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. కామారెడ్డి శాసనసభ్యులు వెంకట రమాణారెడ్డి మాట్లాడుతూ చాలాకాలంగా ఉద్యోగులకు, పోలీసు సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ శాసనసభ్యులు వీరపల్లి శంకర్ మాట్లాడుతూ చటాన్‌పల్లి ఆర్‌వోబీని పూర్తి చేయాలన్నారు. తన నియోజకవర్గంలో ఎమ్ఎన్‌సీ కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించా లని డిమాండ్ చేశారు. జేపీ దర్గాకు అభివృద్ధి నిధులు విడుదల చేయాలని కోరారు. ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తాపస్‌పల్లి, రాజాపేట, గుండాల గ్రామాల్లోని చెరువుల్లో తుంగను తొలగించాలన్నారు. ఆ కాల్వను పునరుద్ధరించాలని కోరారు. తాండూరు శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక మున్సిపాల్టీలో తాగునీటి కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి శాసనసభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్‌లో ఓ మాజీ మంత్రికి సంబంధం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నదనీ, సమగ్ర విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎయిడెడ్ టీచర్లకు జీతాలివ్వాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులతోపాటు 11 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకు ఫిబ్రవరి వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామృష్ణారావును సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం 010 పద్దు కింద వేతనాలు పొందే ఉద్యోగులకు మాత్రమే ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు విడుదల చేస్తున్నదని తెలిపారు. ఇతర ఉద్యోగులకు మాత్రం వేతనాల చెల్లింపునకు నిర్దిష్ట తేదీ ఉండటం లేదని పేర్కొన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కొందరికి జనవరి వేతనాలు కూడా అందలేదని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి వేతనాలు ఇంకా విడుదల చేయలేదని తెలిపారు. నిర్ణీత సమయానికి వేతనాలు విడుదల కాకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇన్కమ్ టాక్స్ చెల్లింపుల భారంతోపాటు ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో వేతనాలు రాక అవస్థలు పడుతున్నారని వివరించారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఎయిడెడ్, మోడల్ స్కూల్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జనవరి, ఫిబ్రవరి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

కేటీఆర్‌ను కలిసిన హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ బృందం

- తమ ఉద్యమానికి మద్దతివ్వాలని కోరిన విద్యార్థులు
- భూముల పరిరక్షణకు అండగా ఉంటామని కేటీఆర్ హామీ
- ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచన



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ సోమవారం యూనివర్సిటీ విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో కలిశారు. తమ ఆందోళనలకు సంబంధించిన వివరాలను కేటీఆర్‌కు విద్యార్థులు వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం పట్ల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో, ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా మద్దతు అందిస్తామని కేటీఆర్ తెలిపారు. భూముల పరిరక్షణ కోసం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. అలాగే, బ్యాకరి కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ శాఖ జోక్యం చేసుకోవాలని, ఆ శాఖ మంత్రిని కలవాలని కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌తో పాటు విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌తో సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ తెలియజేశారు. తమ ఆందోళనను అర్థం చేసుకొని, న్యాయమైన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన కేటీఆర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని, హైదరాబాద్ యూనివర్సిటీ భూములతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థులు ప్రకటించారు.

'చలో పార్లమెంట్'

మే 20 నుంచి సమ్మెలోకి రవాణా రంగ కార్మికులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రోడ్డు రవాణా రంగాన్ని ఏకస్వామ్యంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లతో సహా వివిధ డిమాండ్లను లేవనెత్తుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) 'చలో పార్లమెంట్' మార్చ్‌ను నిర్వహించింది. మణిపూర్, జమ్మూ కాశ్మీర్ సహా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వేలాది మంది రోడ్డు రవాణా కార్మికులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే 20న కార్మిక సంఘాలు నిర్వహించనున్న జాతీయ సమ్మెలో భారీ విజయం సాధించాలని పార్లమెంట్ మార్చ్ పిలుపునిచ్చింది. రవాణా కార్మికులు సమ్మెలో పూర్తిగా పాల్గొంటారని ప్రకటించింది.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీఐటీయూ

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ మాట్లాడుతూ రోడ్డు రవాణా రంగ కార్మికులు చేపట్టే పోరాటాలకు సీఐటీయూ పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. డీఎంకే ఎంపీ షణ్ముగం, సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, సచ్చిదానందం, సీపీఐ(ఎంఎల్) ఎంపీ సుధామ ప్రసాద్ మాట్లాడుతూ రవాణా కార్మికుల పోరాటానికి తమ మద్దతును ప్రకటించనున్నట్టు తెలిపారు. పార్లమెంటులో సమస్యలను లేవనెత్తడానికి ప్రయత్నిస్తా మని హామీ ఇచ్చారు.

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను వివరించారు. కార్మికులు "మే 20 సమ్మెను విజయవంతం చేయాలనే" నినాదంతో ఆమోదించారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి తమ డిమాండ్లను లేవనెత్తినప్పటికీ, పరిష్కారం లేని నేపథ్యంలో పార్లమెంట్ మార్చ్ జరుగుతోందని అన్నారు. రోడ్డు రవాణాకు సంబంధించిన ఇతర సంఘాలతో చర్చలు జరుగుతున్నాయని, మరికొన్ని మే 20 సార్వత్రిక సమ్మెలో చేరడానికి ఐక్యంగా పోరాడటానికి అంగీకరించాయని ఆయన అన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల తగ్గుదలకు అనుగుణంగా డీజిల్ ధరలను తగ్గించడం, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంపును నివారించడం, టోల్ రేట్లను తగ్గించడం, ఏకస్వామ్య చర్యను తిప్పికొట్టడం, ఓలా, ఉబర్ వంటి గుత్తాధిపత్య సంస్థల రవాణా రంగంలో శ్రమ దోపిడీని అంతం చేయడం, రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం వంటి డిమాండ్లను పార్లమెంట్ మార్చ్ లేవనెత్తింది. డిమాండ్లను వివరించే వినతిపత్రాన్ని ప్రధానమంత్రికి పంపించింది. పార్లమెంట్ మార్చ్‌లో కెకె దివాకరన్, నేపాల్‌దేవ్ భట్టాచార్య, కడకంపల్లి సురేంద్రన్, జిబన్ సాహా తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను కట్టలేదని అటవీశాఖ కార్యాలయానికి తాళం

మున్సిపల్ అధికారులు నోటీసు జారీ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ పట్టణంలోని అటవీ శాఖ నుంచి ఆస్తిపన్ను కట్టలేదని మున్సిపల్ అధికారులు కార్యాలయానికి తాళం వేశారు. ఎనిమిదేండ్లుగా పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అధికారులు సోమవారం స్థానిక అటవీ శాఖ డివిజన్ కార్యాలయానికి తాళం వేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించిన అధికారులు పెండింగ్ బకాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. బకాయిలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా అటవీ అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయానికి తాళం వేసి పెండింగ్ బకాయిలు చెల్లించాలని హెచ్చరించారు.

19 బెట్టింగ్ యాప్‌లకు నోటీసులు

మియాపూర్ పోలీసుల దర్యాప్తు ముమ్మరం

కోర్టులో మెమో దాఖలు

నవతెలంగాణ-మియాపూర్

బెట్టింగ్ యాప్‌లపై మియాపూర్ పోలీసులు కొరడా ఝుళిపిస్తూ యాప్‌లను నడిపిస్తున్న యజమానులకు సోమవారం నోటీసులు పంపించారు. కోర్టులో మెమో దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లపై సీరియస్‌గా ఉన్న పోలీసులు ఇప్పటికే పలువురు సినీ హీరోలు, హీరోయిన్లు, సోషల్ మీడియాపై కేసులు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 11 మందిపై కేసులు నమోదు కాగా, ఈ నెల 19న మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హీరో రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్‌తో సహా మొత్తం 25 మందిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో సోమవారం కీలక ముందడుగు పడింది. మియాపూర్ పోలీసులు 19 బెట్టింగ్ యాప్‌ల యజమానులను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. ఏ 23, జిగిల్ రమ్మీ డాట్ కామ్, యోలో 247, ఫెయిర్ ప్లే,జీత్ విన్, వి బుక్, తాజ్ 77, ధని బుక్ 365, 247, 3 365, 25 365, 3 365 జెట్ ఎక్స్, ప్యారీ మ్యాచ్, తాజ్ 777 బుక్, ఆంధ్రా 365 యాప్‌ల నిర్వాహకులను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. కోర్టులో మెమో సైతం దాఖలు చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా తాము యాడ్ ప్రమోషన్ గతంలోనే ఆపేశామని వివరణ ఇచ్చుకుంటున్నారు. ఏది ఏమైనా బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోంది. త్వరలోనే యాప్ యాజమానులకు కూడా విచారించనున్నట్టు తెలుస్తోంది.

బైక్‌ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

- ర్యాపిడో బైక్ డ్రైవర్ మృతి
- జీనోమ్ వ్యాలీలో ఘటన



నవతెలంగాణ -శామీర్ పేట

బైక్‌ను ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ర్యాపిడో బైక్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ విషాద ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన షాదుల్లా(27) ర్యాపిడో బైక్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8:30 గంటల సమయంలో అతను యాక్టివాపై కొల్తూరు వైపు నుంచి తుర్కపల్లి లోని తన ఇంటికి వెళు_న్నాడు. ఈ క్రమంలో భారత్ బయోటెక్ సమీపంలో ఆర్‌కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న యాక్టివాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ర్యాపిడో డ్రైవర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని ఆపాలి

రాహుల్‌గాంధీకి విద్యార్థి, టీచింగ్, నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో బహిరంగ లేఖ

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, దీన్ని వెంటనే ఆపాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పలువురు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి, టీచింగ్, నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో రాహుల్‌కి బహిరంగ లేఖ రాస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములను వేలం వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూముల అమ్మకాల నిర్ణయంపై స్పందించి భూముల వేలాన్ని నిలుపుదల చేయాలని కోరారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములు అమ్మడం ద్వారా యూనివర్సిటీ స్వరూపాన్ని పూర్తిగా కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అనేక జీవ వైవిధ్యాలు, చారిత్రాత్మక ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో యూనివర్సిటీ స్వరూపం కోల్పోవడమే కాక చారిత్రాత్మక ఆధారాలు సైతం కనుమరుగవుతాయని పేర్కొన్నారు. వెంటనే రాహుల్ గాంధీ స్పందించి, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చొరవ చూపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

కొకైన్ అమ్ముతున్న నైజీరియన్‌కు రిమాండ్

నవతెలంగాణ-అంబర్‌పేట

కొకైన్ అమ్ముతున్న వ్యక్తిని హైదరాబాద్ కాచిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ తల్లాజు జ్యోత్స్న తెలిపిన వివరాల ప్రకారం.. గాడ్విన్ అనే అంతర్జాతీయ (నైజీరియన్) డ్రగ్ పెడ్లర్ పాత నేరస్థుడు. నగరంలోని వివిధ కేసుల్లో అతను నిందితునిగా ఉన్నాడు. కొంత కాలంగా కాచిగూడలో ఇద్దరు స్నేహితులతో కలిసి గుట్టుచప్పుడు కాకుండా కొకైన్ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. గాడ్విన్ కొకైన్ అమ్ముతున్నట్టు సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కాచిగూడ పోలీసులతో కలిసి నిఘా పెట్టి అతని పట్టుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాడ్విన్ నుంచి రూ.42వేల విలువ గల 7 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బేకరీలో పేలిన సిలిండర్

పక్కన హోటల్‌లో పనిచేస్తున్న ఐదుగురికి గాయాలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బేకరీలో సిలిండర్ పేలడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటలో మూసి ఉన్న క్రిసెంట్ కేఫ్ అండ్ బేకరీలో సోమవారం ఉదయం ఐదున్నర గంటలకు సిలిండర్ పేలింది. దాంతో బేకరి గోడ కూలిపోయి పక్కన ఉన్న హరి దోశ హెూటల్‌లో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని గాయపడిన వారిని అమీర్‌పేటలోని ఆస్ట్రో ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కర్నాటకకు చెందిన పుండలిక్, సంతోష్, కరణ్ సింగ్, మరో ఇద్దరు ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అందులో పుండలిక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. అతన్ని సీఐ, ఎస్ఐలు పరామర్శించి ఘటనపై వివరాలు సేకరించారు. ఆస్పత్రి యాజమాన్యంతోనూ మాట్లాడారు. హరి దోశ హెూటల్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేకరీ యజమాని మహమ్మద్ హుస్సేన్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

పంటలకు నీళ్లందించడంలో విఫలమైన ప్రభుత్వం

- ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి
- ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- రైతులకు మద్దతుగా రాస్తారోకో, నిలిచిన వాహనాలు



నవతెలంగాణ-చేర్యాల

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. రిజర్వాయర్‌తో చెరువులు, కుంటలను నింపి పంటలను కాపాడాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్‌స్టాండ్ వద్ద రైతులకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎండిపోతున్న రైతుల పంటలకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దేవాదుల నీటితో రిజర్వాయర్‌ను నింపి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ నాలుగు మండలాలు భౌగోళికంగా సముద్ర మట్టానికి 500 అడుగుల ఎత్తున ఉన్నందున ప్రతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వాలు ముందుచూపుతో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించి కాలువల ద్వారా నాలుగు మండలాల్లోని చెరువులు, కుంటలను నింపేందుకు ప్రణాళికా బద్ధమైన ఏర్పాట్లు చేశారన్నారు. కానీ ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ముందు చూపు లేకుండా నీళ్లను నింపకుండా నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే కరువును గుర్తుచేస్తూ సీపీఐ(ఎం) గత రెండు నెలల నుంచి అధికారులకు వినతి పత్రాలు, పత్రికా ప్రకటనలు, ఎండిపోతున్న పంటలను సందర్శించడం వంటి కార్యక్రమాలు చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్లు తగ్గడంతో కొత్తగా రైతులు బోరు బావులను తవ్వుకున్నా నీళ్లు రాక రైతుల పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో చేర్యాల ప్రాంతంలో పశువులకు నీళ్ల తాగేందుకు కూడా కరువు వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. కాబట్టి ఇప్పటికైనా రిజర్వాయర్‌ను దేవాదుల నీళ్లతో నింపి ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపాలని తెలిపారు. లేని పక్షంలో చేర్యాల ప్రాంత రైతులంతా ఏకమై పోరాటం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బద్దిపడగ కృష్ణారెడ్డి, అలేటి యాదగిరి, ఆయా మండలాల కార్యదర్శులు బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, ఎండీ షఫీ, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, మద్దూరు మండల, పట్టణ కమిటీ సభ్యులు ఆముదాల నర్సిరెడ్డి, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం,రాళ్లబండి భాస్కర్, రాళ్లబండి చందు, ఎర్రబోస్ అశోక్, మోకు దేవేందర్ రెడ్డి, గొర్రె శ్రీనివాస్, గందాల బాలు,నాగపురి కనకయ్య, బుట్టి చందు తదితరులు పాల్గొన్నారు.

ఆశాల అరెస్టు అక్రమం

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లను అరెస్టు చేయటం అన్యాయమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు చేపట్టిన ఆందోళనపై పోలీసులు ఓవరాక్షన్ చేయటమేంటని ప్రశ్నించారు. వారి ప్రవర్తన వల్ల అనేక మంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధంతో ఆశ వర్కర్ల ఉద్యమాన్ని అణిచివేయాలనుకుంటే సాధ్యం కాదని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఆశాలు హైదరాబాద్‌లోని కోఠిలోగల కమిషనర్ కార్యాలయంవద్దకు చేరుకోగా ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండను ప్రయోగించిందని గుర్తు చేశారు. ముందస్తుగానే వారిని అరెస్టులు చేయటం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు ఆశాలను కొట్టి, గాయపరచి బలవంతంగా వ్యానుల్లో కుక్కారని తెలిపారు. ఈ సందర్భంగా జయమ్మ అనే ఆశా వర్కర్ స్పృహ తప్పి పడిపోయినా పోలీసులు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది కాళ్ళు, చేతులకు గాయాలయ్యాయని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులపై కూడా పోలీసులు దౌర్జన్యం చేశారని తెలిపారు. వారిని వెంటనే విడుదల చేయాలనీ, ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలెప్పుడు?

బీసీ, మైనార్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలి

అసెంబ్లీలో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఎప్పుడు అమల్లోకి వస్తుందని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో పురపాలన, పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, సమాచార, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసన వ్యవహారాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ రంగాల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలవుతాయని చెప్పారు. వాటికి బీసీ రిజర్వేషన్ వర్తిస్తుందా?లేదా? ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. బీసీ సబ్‌ప్లాన్, మైనార్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకం అమలెక్కడ?అని ప్రశ్నించారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని కోరారు. దళితుల సంక్షేమానికి మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామన్నారనీ, ఇప్పటి వరకు ఆ ఊసేలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ,ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకానికి యువకులు ఎలా దరఖాస్తు చేయాలని ప్రశ్నించారు.



హెచ్‌సీయూ భూములను కాపాడుతాం : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను కాపాడుతామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములను అమ్ముతు న్నారంటూ మీడియాలో వార్తలొస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా రాకతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఒక ఇంచు భూమిని కూడా ముట్టుకునే ఆలోచన లేదని స్పష్టం చేశారు. చెరువులను, కొండలను కూడా పరిరక్షిస్తామని భరోసానిచ్చారు. ఈ ఏడాది ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా రియల్ ఎస్టేట్ అన్ని చోట్ల ఇదే విధంగా పడిపోయిందని వివరించారు. హైడ్రాకు-రియల్ ఎస్టేట్ పడిపోవడానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. అవసరమనుకుంటే తాను బెంగుళూరు తదితర నగరాల్లో ఈ ఏడాది రియల్ ఎస్టేట్ ఎలా తగ్గిందో వివరాలు ఇస్తానని చెప్పారు. హైడ్రా రాకతో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. ఇప్పటి వరకు హైడ్రాకు 9,078 ఫిర్యాదులు వస్తే వాటిలో 7,298 ఫిర్యాదులను పరిష్కరించినట్టు చెప్పారు. ప్రతి రోజు హైడ్రా కార్యాలయానికి వేలాది మంది ప్రజలు న్యాయం కోసం తరలి వస్తున్నారనీ, వారికి న్యాయం చేసేందుకే హైడ్రా పని చేస్తున్నదని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఓయూ విద్యార్థులు మృతి

అర్ధరాత్రి అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై ఘటన



నవతెలంగాణ-ఓయూ

ఆ సమయంలో ఎందుకు బయటకు వెళ్లారో తెలియదు.. కానీ ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అర్ధరాత్రి ఓయూ హాస్టల్ నుంచి బైక్‌పై బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటన హైదరాబాద్ అడిక్‌మెట్ ఫ్లై ఓవర్‌పై జరిగింది. ఓయూ ఎస్ఐ ఎం.ఎ.వహీద్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలోని సప్తగిరి కాలనీకి చెందిన అటికేటి సిద్దార్థ్(20) ఓయూలో మైనింగ్ ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మెగూడ సున్నంపట్టి గ్రామానికి చెందిన బంటు రాజ్ కుమార్(19) మైనింగ్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. న్యూ కిన్నెర హాస్టల్లో ఉంటున్న వీరిద్దరూ కలిసి సోమవారం అర్ధరాత్రి 1:30 సమయంలో మరో స్నేహితుడి కేటీయం బైక్ తీసుకొని ఓయూ నుంచి అడిక్‌మెట్ వైపు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ స్కిడ్ అయ్యి ఫుట్‌పాత్ మీద పడటంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు గమనించి 108కి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దగ్గరుండి ఏర్పాట్లు చేసిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు, విభాగం హెడ్ ప్రొ.చంద్రశేఖర్ సోమవారం ఉదయం నుంచి గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద ఉండి బాధిత కుటుంబాలకు సహకారంగా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఇంజినీరింగ్ కళాశాల తరపున ఇరువురు విద్యార్థుల అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబ సభ్యులకు రూ.30 వేల చొప్పున అందజేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ.జితేందర్ నాయక్, చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్, స్టూడెంట్స్ డీన్ ప్రొ.రాజేందర్ నాయక్, ప్రొఫెసర్లు విద్యాసాగర్, సతీష్ గాంధీ ఆస్పత్రిలో విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించి, తల్లిదండ్రులను పరామర్శించారు. మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బండి సంజయ్ మానసిక స్థితి సరిగా లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన మానసిక పరిస్థితి బాగో లేక కేసీఆర్‌పై బండి సంజయ్ ఏది బడితే అదే మాట్లాడుతున్నారనీ,బాధ్యత గల పదవిలో ఉండి ఆయన అడ్డగోలుగా మాట్లాడటం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హెచ్చరించారు. సోమవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను ఉద్దేశించి బండి మాట్లాడిని మాటలు అభ్యంతర కరమన్నారు. తన పదవినీ, దేశ గౌరవాన్ని దిగజార్చే విధంగా ఆయన మాటలున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తేవటం చేతకాదు కానీ..గాలి మాటలు, రెచ్చగొటే ప్రసంగాలు చేయటం మాత్రం ఆయనకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులను బర్తరఫ్ చేయాలని ప్రధాని మోడిని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండుసార్లు కరీంనగర్ ప్రజలు ఎంపీగా గెలిపిస్తే ఆ జిల్లాను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. కరీంనగర్‌కు, రాష్ట్రానికి కావాల్సిన నిధులేమైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు మాని విద్యా వైద్యం, ఉపాధి గురించి మాట్లాడాలని సూచించారు.

ఆశా వర్కర్ల పై నిర్బంధం ఆపాలి : ఐద్వా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకుంటూ ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేస్తూ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదనీ, దీన్ని తక్షణమే ఆపాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్లు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని తెలిపారు. గిరిజన తండాల్లో పోషకాహారాన్ని అందించటంతో పాటు మహిళలకు, పిల్లలకు ప్రయోజనకర సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆశాల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా అర్ధరాత్రి ఇండ్లపై దాడి చేసి అక్రమంగా అరెస్టులు చేయటమేంటని ప్రశ్నించారు. వారిని నైటీలలోనే తీసుకువెళ్లి పోలీస్ స్టేషన్లలో ఉంచటం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏడో గ్యారెంటీ అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని గతంలో ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలనీ, అరెస్టు చేసిన నాయకులందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



కేసీఆర్‌కు బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ సోమవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెన్నూర్, కోటపటపల్లి, మందమర్రి పోలీస్‌స్టేషన్‌లలో కూడా ఫిర్యాదులు చేవారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు విడుదల చేయించడంలో ధైర్యం చేయని బండి సంజయ్.. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పట్ల ఇష్టానుసారంగా మాట్లాడటం అవివేకమని అన్నారు. కేంద్రంలో మంత్రి పదవి చేపట్టిన ఆయన రాష్ట్రానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధికి సహకరించాల్సిందిపోయి.. అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మరోసారి నోరు జారితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బలమూరి అరవింద్‌రావు, మేడి తిరుపతి, బడుగు రవి, బడికెల సంపత్, మల్లేష్, శేఖర్, సురేష్, తన్వీర్, చెన్నూర్‌లో సాదనబోయిన కృష్ణ, బడికెల సంపత్, మెకానిక్ మల్లేష్, నవాజ్ షరీఫ్, మంత్రి బాపు, మోతె తిరుపతి, రేవెల్లి మహేష్, సురేష్‌రెడ్డి, జోడు శంకర్, నాయిని సతీష్, శ్రీను, జలీల్, నయాబ్, ప్రశాంత్, అశోక్, భారతి, సురేష్, శేఖర్, మణి పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

సమాచార శాఖ కమిషనర్ డా.ఎస్.హరీష్

నవతెలంగాణ-హైదరాబాద్

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. ఈమేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్.హరీష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 31 వరకు ఉన్న గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ సర్క్యులర్ ఇచ్చారు. అక్రిడిటేషన్ల మార్గదర్శకాలను మార్చేందుకు ప్రభుత్వం కొత్తగా ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రతిపాదనలు నివేదిక రూపంలో ప్రభుత్వానికి వెళ్లాయి. ప్రస్తుతం ఆ నివేదిక సర్కారు పరిశీలనలో ఉంది. కొత్త విధానం ఆమోదం పొంది రావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని స్పెషల్ కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో జర్నలిస్టుల విధులకు ఇబ్బంది కలగకుండా అక్రిడిటేషన్ల గడువును మూడోసారి పెంచారు. ఈమేకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్, ఆయా జోన్ల ప్రాంతీయ డైరెక్టర్లు, జిల్లాల డీపీఆర్వోలకు సమాచారం పంపారు.

న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు 'ఐలు' ఖండన

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ చంపాపేటలో జరిగిన న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కె. సత్యనారాయణ, ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. హత్యలకు పాల్పడుతున్న హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో అనేక మంది న్యాయవాదులు హత్యలకు గురవుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాలు సరైన చొరవ చూపకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని చెప్పారు. న్యాయవాదులందరూ ఐక్యంగా నిలబడి న్యాయవాదుల రక్షణ చట్టం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి హత్యలు చేయడం పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం జరిగే పోరాటంలో ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మంగళవారం జరిగే న్యాయవాద విధుల బహిష్కరణకు ఐలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు.

విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలివ్వండి

ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలపై విజిలెన్స్ విచారణ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ)లు సమర్పించిన నివేదికలను అందజేయాలంటూ ప్రభుత్వాన్ని కాళేశ్వరం కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వానికి తాజాగా లేఖ రాసింది. విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతత్వంలో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ ఇప్పటికే విచారణను పూర్తి చేసినట్టు తెలిసింది. సాగునీటి పారుదల శాఖకు చెందిన అన్ని విభాగాల ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, ఇతర శాఖల అధికారులను విచారించింది. ఆయా అంశాలను క్రోడీకరిస్తూ ప్రస్తుతం నివేదికను రూపొందిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ క్రమంలో విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను సైతం ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. మూడు బ్యారేజీలకు సంబంధించి ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించగా, ఇప్పటికే తుదినివేదిక ప్రభుత్వానికి చేరింది. ఇక కేంద్ర ప్రభుత్వం సైతం ఎన్‌డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించగా, ఆ కమిటీ సైతం నివేదికను కేంద్ర జలశక్తి శాఖకు అందజేసింది.కేంద్రం సైతం రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు నివేదికల ను సైతం తమకు అందజేయాలని ప్రభుత్వానికి కమిషన్ సూచించింది. వాటన్నింటినీ పరిశీలించి, నివేదికను సిద్ధం చేసేందుకు కమిషన్ సిద్ధమవుతున్నది. ఈ క్రమంలో అవసరమైన ఇతర విధానపర నిర్ణయాలు తీసుకునే అవకాశముందనీ, రాజకీయ నేతలను విచారణకు పిలవాలా ? వద్దా ? అనేది అప్పుడే చెప్పాలని కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం.

హత్య కేసులో నిందితుడికి 10 ఏండ్ల జైలు..



నవతెలంగాణ- హయత్‌నగర్

క్షణికావేశంలో భార్యా,భర్తలను హత్య చేసిన నిందతుడికి భువనగిరి కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న నిందితుడు రాసాల రాజమల్లు (42) యాదాద్రి భువనగిరి జిల్లాలో 2023 వ సంవత్సరంలో గొర్రెల మంద లు ఊరులో రోడ్లపై వెళుతున్న సమయంలో దుమ్ముదూళి కారణంగా తరచూ జరుగుతున్న గొడవల మూలంగా ఓ వ్యక్తిపై అకస్మాత్తుగా దాడి చేసి చంపాడు. అలాగే అడ్డుకోబోయిన అతడి భార్యను కూడా చంపాడు. ఈ కేసులో యాదాద్రి భువనగిరి పీడీజే కోర్టు నేరస్తునికి పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధించినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి...

- వ్యక్తి అరెస్టు, రిమాండ్..



నవతెలంగాణ-హయత్ నగర్

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగొద్దని పోలీసులు సూచించడంతో మద్యం మత్తులో సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఆట్టి వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేటకు చెందిన లిక్కి యశ్వంత్ రెడ్డి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి లోని మల్లికార్జున నగర్ కాలనీ రోడ్డులో ఈనెల 23న బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నాడు. దాంతో గమనించిన పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడ తాగవద్దు అని సూచించారు. అయినా అతను అతను డ్యూ టిలో ఉన్న సిబ్బంది పైన దాడి చేసి నానా బూతు తిట్టి సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో అతనిని పోలీస్ స్టేషన్‌కు తీసుకురాగా అక్కడ కూడా నానా హంగామా చేసి సిబ్బందిని బూతు మాటలు తిట్టాడు. ఈ విషయంలో కేసు నమోదు చేసి అతన్ని రిమాండ్ తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై లాయర్ దారుణ హత్య

- చంపాపేట్‌లో ఘటన



నవతెలంగాణ-సిటీబ్యూరో/చంపాపేట్

రంగారెడ్డి జిల్లా చంపాపేట డివిజన్ ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఓ లాయర్‌ను దుండగుడు కత్తితో అతికిరాతకంగా హత్య చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్ నేత ఎర్రబాపు ఎస్రాయిల్ సంతోష్‌నగర్‌లోని న్యూ మారుతీనగర్ ప్రాంతంలో శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. వారికి ఏదైనా విద్యుత్ సమస్య వచ్చినప్పుడు అదే ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్ దస్తగిరిని సంప్రదించేవారు. ఇదిలా ఉండగా అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఓ మహిళతో దస్తగిరికి వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే కొన్ని రోజుల కిందట ఆమె తన భర్తతో కలిసి స్వస్థలానికి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న దస్తగిరి.. ఆ దంపతులను ఎస్రాయిల్ దాచి పెట్టాడని భావించాడు. అతని ఇంటికి వచ్చి ఆ మహిళను హైదరాబాద్‌కు పిలిపించాలని కోరేవాడు. అలాగే ఆ మహిళ భర్తను తాను చంపబోతున్నానని, అందులో తనకు త్వరగా బెయిల్ ఇప్పించాలని కోరాడు. దానికి సదరు న్యాయవాది ఒప్పుకోలేదు. తాను న్యాయవాదినని, బ్రోకర్‌ను కాదని చెప్పాడు. అయినప్పటికీ న్యాయవాదితో దస్తగిరి వాదించేవాడు. దాంతొ న్యాయవాది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దస్తగిరికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం న్యాయవాది ఉదయం బైక్‌పై తన ఇంటికి వస్తుండగా కాపు కాచి ఉన్న దస్తగిరి కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మతి చెందాడు. మతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

- హైడ్రా ప్రజావాణికు 63 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమిని స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు కబ్జా చేసేస్తున్నారని వాటిని కాపాడాలని పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. పాఠశాలకు, పిల్లలు ఆడుకునేందుకు ఉద్దేశించిన స్థలాలను కూడా వదలడంలేదని వాపోయారు. ఫుట్ పాత్‌లను, సర్వీసు రోడ్డులను వదలకుండా తోపుడు బళ్ల నుంచి ఏకంగా డబ్బాలు పెట్టేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని, వాటిని తొలగిస్తే ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాలకు ఎంతో ఉపశమనంగా ఉంటుందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువుల్లో వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే పరిమితమవ్వాల్సిన శిఖం భూములలో పక్కన పట్టా భూమి సర్వే నంబరు చూపించి అనుమతులు తీసుకుని ఇళ్లు కట్టేస్తున్నారని ఫిర్యాదులందాయి. దీంతో తాము వ్యవసాయ భూమిని కోల్పోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇలా సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందాయి.

ప్రభుత్వ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా...

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఇంజాపూర్ గ్రామంలో పాఠశాలకు ఆనుకుని ఉన్న 14 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నాడని ప్రజావాణికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆయనను నుంచి భూమిని కాపాడి.. ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టినా.. మళ్లీ అదే పని చేస్తున్నాడని వాపోయారు. పాఠశాల విస్తరణకు, పిల్లల ఆట స్థలానికి ఉపయోగపడేలా చూడాలని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదులో కోరారు. ఇదిలావుండగా మియాపూర్ - బీహెచ్ ఈఎల్ ప్రధాన రహదారిలో ఉన్న గంగారాం చెరువు ఎఫ్‌టీఎల్ ఎగువున ఇంటి స్థలాలున్నా, నిర్మాణానికి అనుమతులివ్వడంలేదని పలువురు వాపోయారు. మా ఇంటి స్థలం చుట్టూ ఇల్లు నిర్మించి ఉన్నాయని, గ్రామపంచాయతీ లే ఔట్‌కు ఎల్ఆర్ఎస్ కూడా కట్టించుకుని రెగ్యులరైజ్ చేశారని, తమకు మాత్రం అనుమతించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

శిఖం భూమిని పక్కనే లే ఔట్

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర మండలం, నాగారం మున్సిపాలిటీలోని అన్నరాయ చెరువులో తనకున్న ఎకరం శిఖం భూమిని పక్కనే లే ఔట్ వేసిన వ్యక్తి ఆక్రమించి దానిని కూడా ప్లాట్ల మాదిరి అమ్మేస్తున్నారని, ఇప్పటికే పలు షెడ్డులు వేశారని అన్నం రాజు హరిబాబు అనే వ్యక్తి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదిలా వుండగా మేడిపల్లి గ్రామంలోని ఊరచెరువుకు ఉన్న పాత నాలాను పునరుద్ధరించాలని పలువురు ప్రజావాణి ఫిర్యాదులో కోరారు. వరదలు వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనం కోసం తవ్విన నాలాను కొనసాగించడం వల్ల తమ పంటపొలాలు దెబ్బతిన్నాయని పలువురు వాపోయారు. దిగువున ఉన్న 6 కాలనీలకు వరద, మురుగు ముప్పు లేకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీ..

- 16 తులాల బంగారం అపహరణ



నవతెలంగాణ -హయత్ నగర్

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం లోని వైదేహి నగర్ రోడ్ నెంబర్ 7 లో నివాసం ఉంటున్న టీవీ సుబ్రహ్మణ్యం శర్మ దంపతులు ఈనెల 20న కూకట్‌పల్లిలో ఉండే వారి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వారి ఇంట్లో పని చేసే వంట మనిషి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దాంతో ఆమె యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించగా బాధితులు విచ్చేసి బీరువాలో ఉన్న వస్తువులు చిందర వందరగా పడి ఉండడం చూశారు. బీరువాలో ఉన్న 16 తులాల బంగారం, కొంత నగదు అపహరణకు గురైందని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దొంగతనం చేసి ఉండొచ్చని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు నిందితులు వచ్చి దొంగతనాలు పాల్పడినట్టు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-చంపాపేట్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ లో వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువచ్చారు. కాలనీ నందు నూతన రోడ్ల నిర్మాణానికి రోడ్లు తవ్వినట్టు తెలిపారు.కానీ ఇక్కడ డ్రయినేజీ వ్యవస్థ మెరుగుపరిచాక రోడ్లు వేయాలని, అనవసరంగా ముందే రోడ్లు తవ్వడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.కావున నూతన డ్రైన్స్ నిర్మాణం చేపట్టాక రోడ్లు వేయాలని కోరారు. అలాగే అధికారులు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ రోడ్లు గతంలో మంజూరు చేయడమైందని, కానీ ఇక్కడ డ్రైన్స్ వ్యవస్థ సరిగ్గా లేదని తెలిసి తాత్కాలికంగా రోడ్డు నిర్మాణ పనులు ఆపినట్టు చెప్పారు. నూతన డ్రైన్స్ నిర్మాణాలు చేశాక రోడ్లు వేద్దామని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పుడున్న 8 ఇంచుల డ్రైన్స్ స్థానంలో 12 ఇంచుల డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలని, అలాగే మిగిలిన మూడు గల్లీలలో ఎత్తుపల్లాలు సరిగ్గా చూసుకొని డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రయినేజీ వ్యవస్థ మెరుగుపరిచాక అనంతరం నూతన రోడ్ల నిర్మాణం పనులు చేపడతామని వివరించారు. డ్రైన్స్ పనుల్లో భాగంగా ఒక వారం,పది రోజులు కొంతమేర ఇబ్బందులు జరుగుతాయి కావున కాలనీవాసులు అధికారులకు సహాయ,సహకారాలు అందించాలని కోరారు. రాబోయే రోజుల్లో ాటర్ వర్క్స్ అధికారులు రమ్యభారతి, షబ్బీర్, శ్రీహరి, శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతి నిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,మహిళలు,కాలనీవాసులు పాల్గొన్నారు.



నీరే మనిషి మనుగడకు ఆధారం

- హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ జి.వినయ్ కుమార్
- కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జలదినోత్సవం

నవతెలంగాణ-తుర్కయంజాల్

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని, జల భద్రతతోనే భవిష్య త్ సురక్షితంగా ఉంటుందని హెచ్ఎం డబ్ల్యూఎస్ మేనేజర్ జి.వినయ్ కుమార్ అన్నారు. సోమవారం హెచ్ఎం డబ్ల్యూఎస్ సహకారంతో తుర్కయంజాల్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవాన్ని నిర్వహించారు. నీటి ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా వినయ్ హాజరై మాట్లాడుతూ నీటిని వథా చేయొద్దని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఫౌండేషన్ సీఈవో బానాల రవికుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ భవిత, అకౌంటెంట్ సింధూర, పాఠశాల సిబ్బంది ఎం.పద్మ, కృష్ణమాచార్యులు, మహేష్, శబానా, అనూష తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు 'డబుల్' ఇండ్లు కేటాయించాలి



- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

నవతెలంగాణ- హయత్‌నగర్

అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ్మా డిమాండ్ చేశారు. సీపీఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ హయత్ నగర్ మండలంలో గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసిన అర్హులైన వారికి వెంటనే గహాలు కేటాయించాలని, అలాగే తాజా ఇంటి సర్వే ఆధారంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 6 గ్యారంటీలను వెంటనే అమలు చేసి, మహిళా పెన్షన్లు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, వద్ధాప్య పెన్షన్లు, రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పేదలు సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే పథకాలను అమలు చేయాలని సూచించారు. హయత్ నగర్ మండల కేంద్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు, 40, 70, 100 గజాల స్థలాల్లో ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షల సహాయం కూడా అందించాలన్నారు. ధర్నా అనంతరం మండల రెవెన్యూ తహశీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి రామావత్ సక్రు నాయక్, మండల కార్యవర్గ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

'ఎల్బీనగర్'లో 15 మంది న్యాక్ ఇంజనీర్ల తొలగింపు



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ పరిధిలో 15 మంది న్యాక్ ఇంజనీర్లను ప్రభుత్వం తొలగించింది. గత ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో న్యాక్ ఇంజనీర్ల వ్యవస్థను తాత్కాలికంగా తీసుకువచ్చింది. సివిల్ ఇంజినీరింగ్ చదివిన యువకులను తాత్కాలిక సిబ్బందిగా నియమించిన గత ప్రభుత్వం.. నగరంలో అక్రమ నిర్మాణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపింది. అయితే న్యాక్ ఇంజనీర్లు గత కొంతకాలంగా అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారని అనేక ఆరోపణలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం ఎల్బీనగర్ జోనల్ పరిధిలో పనిచేస్తున్న 15 మంది న్యాక్ ఇంజనీర్లను తొలగించింది. అదేవిధంగా నగరంలో 27 మంది న్యాక్ ఇంజనీర్లను ప్రభుత్వం టెర్మినేట్ చేసింది. కాప్రా ,హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్, సంతోష్ నగర్, కూకట్ పల్లి సర్కిల్‌లలో పనిచేస్తున్న 27 మంది న్యాక్ ఇంజనీర్లను ఒకేసారి ప్రభుత్వం తొలగించింది. న్యాక్ ఇంజనీర్లను నియమించిన తర్వాత కూడా నగరంలో ఎక్కడా అక్రమ నిర్మాణాలు జరగకుండా నిరోధించలేకపోయారని ఉన్నతాధికారులు తెలిపారు. ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు కోకోళ్లలుగా వెలిశాయన్నారు. న్యాక్ ఇంజనీర్లు ముందుగా నోటీసులు ఇవ్వడం తర్వాత కూల్చివేత చేపట్టకుండా భవన యాజమాన్యం తో కుమ్మక్కయ్యారని ఆరోపణలు ఉన్నాయి.

ఏఐసీసీ తరుణ్ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్‌గా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గుడ గ్రామానికి చెందిన బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఏఐసీసీ తరుణ్ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏఐసీసీ విచార్ విభాగ్ చైర్‌పర్సన్ ఎంపీ గిరిజా వ్యాస్ నియమకపు పత్రాన్ని అందేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన గిరిజా వ్యాస్, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు.ప్రతి నిత్యం పార్టీ అభివద్ధి కోసం పాటుపడతానని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన వంతు కషి చేస్తానన్నారు. అందరి సహకారంతో పార్టీలో అందరిని కలుపుకుపోయి పని చేస్తానన్నారు.పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను సమన్వయం చేసుకొని తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండ నిలబెట్టుకుంటానన్నారు.

చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తాం



- కాకతీయ స్కూల్ అకాడమీ డైరెక్టర్ శ్వేతా రెడ్డి

నవతెలంగాణ- హయత్ నగర్

తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తామని కాకతీయ స్కూల్ అకాడమీ డైరెక్టర్ శ్వేతా రెడ్డి అన్నారు. మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఉన్న కాకతీయ పాఠశాలలో యూకేజీ నుంచి ఒకటో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామని, అందులో భాగంగా పిల్లలు రకరకాల ప్రదర్శనలతో స్టేజిపై తల్లిదండ్రులు మెచ్చుకునేలా వారి ప్రదర్శన ఉందని కొనియాడారు. అన్ని రంగాలలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించుకునేలా తమ పాఠశాలలో శిక్షణ ఇచ్చి ప్రదర్శన ద్వారా వారి నైపుణ్యాలను వెలికి తీస్తామన్నారు. ప్రిన్సిపాల్ పరిమళ, డైరెక్టర్ రవి ప్రసాద్, రాధా, జోనల్ ప్రిన్సిపాల్ రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఇటీవల నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన ఢిల్లి పబ్లిక్ స్కూల్ అధినేత కొమరయ్యను సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడి పల్లి గ్రామ మాజీ కౌన్సిలర్ ఈరెంకి వేణు కుమార్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలసి పూల బొకేను అందచేసి పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

భగత్ సింగ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలి



- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్

నవతెలంగాణ-ఎల్‌బీనగర్

భగత్ సింగ్ ఆశయాలతో యువత ముందు కు సాగాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. డ్రగ్స్ నిర్మూలిద్దాం యువతను కాపాడుకుందాం అంటూ డీవైఎఫ్ఐ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో పొట్టిపాక నితిన్ అధ్యక్షతన సాగర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ ల వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విప్లవ యోధుడు షహీద్ భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తామని, ప్రజలందరికీ విద్య వైద్యం కల్పించాలని కోరారు. ప్రయివేటు స్కూల్, కాలేజీ ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. హక్కుల కోసం భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనోన్మాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలని, సోషలిజం వర్ధిల్లాలని అన్నారు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నశించాలని,సమ సమాజం నిర్మాణం జరగాలన్నారు. అలాగే సాగర్ రింగ్ రోడ్డు నుంచి ఎల్బీనగర్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పొట్టిపాక నితిన్ అధ్యక్షులుగా, గడ్డం రవీందర్ కార్యదర్శిగా ఎన్నికైనారు. ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి ముత్యాలు, సహాయ కార్యదర్శిగా జి.జోషి, పవన్, తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా అరవింద, మిస్టర్ జయ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్, ఆలేటి ఎల్లయ్య, కేవీపీఎస్ సర్కిల్ కార్యదర్శి బిట్రా దుర్గారావు, ప్రభాకర్, సీఐటీయూ సర్కిల్ అధ్యక్షులు ,పొట్టేపాక రామస్వామి. హమాలీ సంఘం, అధ్యక్షులు ఏదుల గోవిందు ఉపాధ్యక్షులు అంజయ్య, కోశాధికారి కుక్కముడి వెంకటయ్య, నాయకులు కాంతయ్య, ముత్యాలు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను క్షయ రహిత నగరంగా మార్చేందుకు అందరూ సహకరించాలి

- ప్రారంభ దశలోనే టీబీని గుర్తించి సరైన చికిత్స ఇవ్వాలి
- ప్రజల్లో అపోహలను తొలగించేందుకు విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీబీ రహిత తెలంగాణ, భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంతో పాటు ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ చేస్తా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాలొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ కేసులను గుర్తించి త్వరగా నివేదించడం, క్షయ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం అత్యవసరమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను క్షయవ్యాధి రహిత నగరంగా మార్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సహకరించాలనీ, టీబీ వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించడానికి ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన మోతదులో ట్రీట్‌మెంట్ ఇవ్వడం ద్వారా బాధితులు భయపడకుండా, వివక్ష లేకుండా సరైన చికిత్స పొందేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అని ఆయన తెలిపారు. టీబీ రహిత హైదరాబాద్ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయివేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలన్నీ తప్పనిసరిగా తమ దగ్గర నమోదైన టీబీ కేసులను అధికారికంగా ప్రభుత్వానికి నివేదించాల్సిన బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ప్రయివేట్ వైద్యులు టీబీ కేసులను నమోదుచేయడం కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా చట్టబద్ధమైన కర్తవ్యమని, ని- క్షయ్ పోర్టల్‌లో 150 శాతం నమోదు చేసేలా లక్ష్యం నిర్దేశించుకోని చురుకుగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా బాగా సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డా. రాజేశ్వరి, డా. స్నేహ శుక్లా మాట్లాడుతూ, టీబీ వ్యాధి ప్రబలుతున్న తీరును, అంతర్జాతీయ స్థాయిలో తీసుకుంటున్న వ్యూహాలను వివరించారు. డాక్టర్ శ్రవణ్ కుమార్ చెస్ట్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. టీబీ సంస్థ డైరెక్టర్ రమేష్ ప్లాన్ ఇండియా, మహావీర్ పీపీఎం ఎన్జీవో, బవ్యా హెల్త్‌కేర్ ప్రయివేట్ ప్రతినిధులు తమ సామాజిక సేవా కార్యక్రమాలను, రోగుల పునరావాసం, ప్రభుత్వ-ప్రయివేట్ భాగస్వామ్యాలపై వారి కృషిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొని, టీబీ నిర్మూలనకు తమ కతనిశ్చయాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, టీబీ కేసుల నివేదికలను బలోపేతం చేయడానికి, క్షయవ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడానికి కషి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి, రాష్ట్ర మహమ్మారి శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వరి, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ స్నేహ శుక్లా, ఛెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, టీబీ అలర్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, అలాగే ప్లాన్ ఇండియా ఎన్జీవో, మహవీర్ పీపీఎం ఎన్జీవో, బవ్యా హెల్త్‌కేర్ ప్రయివేట్ లిమిటెడ్, జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) సిబ్బంది పాల్గొన్నారు. జెఎంజే నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పతంగి రాజ్ భూపాల్ గౌడ్‌కు అభినందనల వెల్లువ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బీజేపీ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పతంగి రాజ్ భూపాల్ గౌడ్‌ను బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ గ్రామశక్తి కేంద్రం ఇన్‌చార్జి, బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు ఏనుగు రాంరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పెత్తుల పుల్లారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ తోట ప్రతాప్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు రామిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు మర్రి అంజిరెడ్డి, గూడూరు చంద్రశేఖర్ రెడ్డి, అందెల ఐలయ్య యాదవ్, తోట అరవింద్ రెడ్డి, యాతం వెంకటేష్ యాదవ్, మంత్రి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మంత్రి కష్ణ, వంక ప్రభాకర్, సతీష్ నంద, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నిద్ర, ఆహారాన్ని నిర్లక్ష్యం చెయ్యొద్దు



నవతెలంగాణ - జవహార్ నగర్

చదువుతో పాటు నిద్ర, ఆహారాన్ని నిర్లక్ష్యం చెయ్యొద్దని, ప్రతి రోజుకు 6 గంటలు చదవడం అలవాటు చేసుకోవాలని జవహర్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్రిస్ అలీ క్రాంతి కీన్ స్కూల్ విద్యార్థులకు సూచించారు. సోమవారం దమ్మాయిగూడలోని క్రాంతి కీన్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో తొందర పడకుండా, ప్రతి సబ్జెక్ట్‌ను స్పష్టంగా, నిబద్ధతతో చదివితే ధైర్యంగా పరీక్షలు రాయవచ్చన్నారు. చిన్న, చిన్న విరామాలతో చదవడం మెమొరీకి మంచిదని, ప్రశాంతతతో సమాధానాలు రాయాలన్నారు. ప్రతి సబ్జెక్ట్‌కు సమాన ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. పరీక్ష రాయబోయే విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ శ్రీనివాస్ రెడ్డి, లావణ్య, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు జాకొబ్, ఉమ, వందన, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా ఎల్లంపేట

అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. కాగా ఇటీవల మేడ్చల్ జిల్లాలోని ఎల్లంపేట, మూడుచింతలపల్లి, అలియబాద్ గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మండల పరిధిలోని డబీల్ పూర్, రావల్ కోల్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, నూతన్ కల్, బండమదారం, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, సైదోనీగడ్డ తండా, సోమారం గ్రామాలను కలుపుతూ ఎల్లంపేట మున్సిపాలిటీగా ఏర్పడనుంది. ఈ గ్రామాల్లో రావల్ కోల్ గ్రామ కేంద్రంగా సైతం నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ లు ఉన్నాయి.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమ వుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్‌లోని అశోక్ నగర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఇంట్లో పురుషుడు చదువు కుంటే ఆ ఇళ్ల మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అదే ఒక మహిళ చదివితే కుటుంబంతోపాటు సమాజాభివృద్ధికి దోహదపడు తుందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్స హించినప్పుడే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కార్పొరేటర్ పన్నాల

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మహిళలు సమాజానికి మూలస్తంభాలు అని పేర్కొన్నారు. వారికి కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఉందన్నారు. వారి కృషి, త్యాగం, ప్రతి మహిళకు గౌరవం ఇవ్వాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి కృషి



- కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

నవతెలంగాణ-అల్వాల్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశానుసారం అల్వాల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనతి కాలంలోనే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరాను త్రీఫేజ్‌గా మార్చి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రహదారి వెడల్పు పనులకు రూ.9.82లక్షలు, సర్కిల్ పరిధిలో రూ.119 లక్షల 32 వేల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. డివిజన్ల వారీగా సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.600 లక్షల వ్యయంతో పనులకు అనుమతులు పొందారని చెప్పారు. మచ్చ బొల్లారం ఆర్ యూబీ, తుర్కపల్లి బొల్లారం ప్రాంతాల్లోని అపరిష్కృత పనులను పరిష్కరించారని తెలిపారు. సుభాష్ నగర్ కల్వర్టు పనులను ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 135 డివిజన్ కార్పొరేటర్ సబితా అనీల్ కిషోర్, నాయకులు డోలి రమేష్, నరేందర్ రెడ్డి, ఢిల్లీ పరమేష్, చరణ్ గిరి, శోభన్ బాబు, ప్రేమ్ కుమార్, మహమ్మద్ మోసిన్, ప్రశాంత్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాసుచారికి కార్పొరేటర్ ప్రభుదాస్ సన్మానం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వాసు చారిని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు సోమవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు ముదిరాజ్, భీష్మచారి, రవి, బాలనరసింహ, శంకర్ గౌడ్, మహేందర్ యాదవ్, నవీన్, శ్రీనివాస్, శీను, బాలచారి తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - చర్లపల్లి

దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారంలో ఏప్రిల్ 5న డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించబోతు న్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజ కవర్గం మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల వాల్ పోస్టర్‌ను డీఎస్ఎస్ జేఏసీ నాయకులు కొరపక అంజి మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు నల్లా రాధకృష్ణ, రాగిరి మోహన్ రెడ్డి, కొరపక అంజి, మల్కజయప్రకాష్, కొమ్మగాళ్ళ వెంకటేశ్వర్లు, ఏళ్ల సంతోష్, బొడ్డుశివ, బైరాపక సురేష్, అశోక్ కుమార్, ఉదయ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను మోడ్రన్‌గా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ బీరప్ప గడ్డలో ఉన్న శ్మశాన వాటికను మోడ్రన్ వైకుంఠధామంగా తీర్చిదిద్దుతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్, బీరప్ప గడ్డ గౌడ సంఘం కులస్తులందరూ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని వారి నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లోని అన్ని శ్మశాన వాటికలు మోడ్రన్ గ్రేవ్ యార్డ్‌గా తీర్చిదిద్దారని అభినందించారు. బీరప్ప గడ్డ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. అందులో కనీస వసతులు లేవని, ఎవరైనా చనిపోతే దింపుడు గాలెం లేదని, భూమిపైన పెట్టుకొని కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్నానాల గదులు లేక మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బర్నింగ్ యూనిట్ లాంటి కనీస సౌకర్యాలు సరిగ్గా లేవని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ వీలైనంత త్వరలో బీరప్ప గడ్డలోని శ్మశాన వాటికను మోడ్రన్ వైకుంఠధామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్, బీరప్ప గడ్డ గౌడ సంఘం కులస్తులు ఉన్నారు.

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టును ఖండించండి



- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టును ఖండించాలని సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అన్నారు. మల్కాజిగిరి మండలంలోని ఆశా వర్కర్స్ తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన చేపడతామని గతంలోనే ప్రభుత్వానికి, అధికారులకు తెలిపినా సోమవారం మధ్య రాత్రి నుండే ఆశా వర్కర్ల ఇండ్లలోకి వెళ్లి అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం చడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఆశా వర్కర్స్‌కు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..ఆశా వర్కర్స్ సేవలను గత ప్రభుత్వాలు అనేక రకాలుగా ఉపయోగించుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. వారి సమస్యల ను విన్నవించుకోవడానికి నిరసన చేపడదామంటే అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా వారి హక్కులను కాలరాస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్స్ డిమాండ్‌లను పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు కొండల్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బొంతు శ్రీదేవి పరామర్శ



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ ఆదర్శ్ నగర్ కాలనీకి చెందిన యువ నాయకుడు వేణుగంటి విజయ్ కుమార్ తండ్రి వెనుగంటి వెంకటేష్ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులను స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం పరామర్శించారు. వారి వెంట రవీందర్ రావు, కల్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్
- కాలనీవాసుల నిధులతో యూజీడీ పనులు ప్రారంభం



నవతెలంగాణ - జవహర్ నగర్

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదో డివిజన్ కారింగుల నర్సింగరావు (కేఎస్ఆర్) కాలనీలో కాలనీ ప్రజల సొంత నిధులు రూ.10 లక్షలతో పాటు రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహకారంతో కాలనీలో 260 మీటర్ల యూజీడీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల సొంత నిధులతో యూజీడీ డ్రయినేజీ పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కాలనీల అభివృద్ధికి ప్రభుత్వ నిధులే కాకుండా ప్రజలు సొంత నిధులను సేకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. ప్రతీ డివిజన్ ప్రజలు ఇలాగే ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో మాధవ్, సింగన బాలరాజు, కెఎస్ఆర్ కాలనీవాసులు నంగునూరు అశోక్ గుప్తా, కారింగుల రాజు, పందిరి శ్రీనివాసులు, కూటి కంటి వెంకటేష్ గౌడ్, కందుల శంకర్, రాజు గౌడ్, మోహన్, ఉచ్చంతల రాములు, దుంపల రాములు, భాషెట్టి వీరేష్, సంద్రి గోపాల్, చంద్రమౌళి, రమేష్ చారి, అబ్దుల్లా, యాకమ్మ మహేశ్వరి, పందిరి పద్మ, కే. పద్మ, మంజుల, యాదలక్ష్మి, మంజుల, అండాలు, లక్ష్మి, స్వరూప, లక్ష్మీ మోహన్, ఖైరున్నిస, తదితర కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో రూ.62 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారుల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణం పనులను జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షించాలన్నా రు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, అల్లిబిల్లి మహేందర్, శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కొండయ్య, సభ్యులు, మనోహర్‌రావు, అంజయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, గొరిగే మల్లేష్,గొరిగే మహేష్, రణధీర్, శ్రీహరి రెడ్డి, రాములు, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి, ప్రసాద్, కాజా , నాగరాజ్, రామ్ రెడ్డి, తదితరులున్నారు.

అథ్లెటిక్స్‌లో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ అథ్లెటిక్స్ అకాడమీ బాలిక ప్రతిభ



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం అంకుశాపూర్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన యువ అథ్లెట్ సత్వికాంజలి రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి రెండు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్నేహలత తెలిపారు. హైదరాబాద్‌లోని గౌడియం ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు విభాగంలో కాంస్య పతకం, 400 మీటర్ల విభాగంలో రజత పతకం గెలుచుకున్నట్టు తెలిపారు. దీంతో పాటు రూ. 2,500 నగదు పురస్కారం అందుకున్నట్టు చెప్పారు. సోమవారం అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్నేహలత ఆమెను అభినందిస్తూ మెడల్స్ వేసి సర్టిఫికెట్‌లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సత్వికాంజలి భవిష్యత్తులో ఇంకా మెరుగైన విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిరూప, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి యాదవ్, అకాడమీ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి బలహీన వర్గాల ఆత్మబంధువు



- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రెష్ యాదవ్
- రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
- తూంకుంట నుంచి దొంగల మైసమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-శామీర్‌పేట

సీఎం రేవంత్ రెడ్డి బలహీన వర్గాల ఆత్మబంధువు అని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో అమోదించిన సందర్భంగా సోమవారం ఉమ్మడి శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి దొంగల మైసమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వజ్రేష్‌యాదవ్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్, మూడు చింతలపల్లి మండల అధ్యక్షులు బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, శామీర్‌పేట్ మండల అధ్యక్షులు యాష్కీ శంకర్ గౌడ్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూధన్ రెడ్డి, రామాలయ కమిటీ చైర్మెన్ పేండం లక్ష్మీనారాయణ, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎద్దు నగేష్ యాదవ్,దోసకాయల వెంకటేశ్, బాలనర్సింహ, కృష్ణారెడ్డి, కిషోర్ యాదవ్, సీనియర్ నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గడ్డం రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మకు అజయ్,మేడ్చల్ నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్, మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం


- పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో సోమవారం కేతమ్మ-మల్లన్న స్వామిల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్మెల్యే చామకూర మల్లారెడ్డి-కల్పన దంపతులు హాజరై పూజాలో పాల్గొన్నారు. అంతకుముందు రూ.16లక్షలతో చేపట్టిన యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అగ్నిగుండాలు, పోతురాజుల ఊరేగింపు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు సోమేశ్వర్ టెంట్ హౌస్ యజమాని సోమేష్ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్, మండల అధ్యక్షులు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్,మాజీ సర్పంచ్, జగన్ రెడ్డి,గ్రామ పెద్దగొల్ల నరసింహ యాదవ్,యాదవ సంఘం సభ్యులు శ్రీశైలం యాదవ్,గోపాల్ యాదవ్,కృష్ణ యాదవ్,మల్లేష్ యాదవ్, శశికుమార్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్,గ్రామస్తులు పాల్గొన్నారు.


హైడ్రోజన్ ఇన్ క్యాన్సర్ ట్రీట్మెంట్‌పై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హైడ్రోనెక్స్-2025 బై ది మోడరన్ లివింగ్-అయాన్ ఎక్స్ఛేంజ్ వారు "హైడ్రోజన్ ఇన్ క్యాన్సర్ ట్రీట్మెంట్" మీద సదస్సు నిర్వహించారు. హైడ్రోనెక్స్-2025, అయాన్ ఎక్స్ఛేంజ్ తాజా వెంచర్ అయినది మోడరన్ లివింగ్ వారు ఆరోగ్యం, స్థిరత్వం స్థిరమైన భవిష్యత్‌లో నీటి పాత్రను వివరిస్తూ పరిశ్రమ నాయకులు, శాస్త్రవేత్తలు, నిపుణులు సోమాజిగూడలోని ధి పార్క్‌లో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ది మోడరన్ లివింగ్ బిజినెస్ హెడ్ రవికాంత్ నిమ్ నాయకత్వం వహించారు "అయాన్ ఎక్స్ఛేంజ్ ఇండియా మొత్తం నీటి నిర్వహణలో 60 ఏండ్ల పాత సంస్థ. హైడ్రోజన్ వాటర్ ఫర్ వెల్‌నెస్ - ది నెక్స్ రివల్యూషన్," నీటి-సానుకూల భవిష్యత్ కోసం టీఎంఎల్ లక్ష్యంను హైలైట్ చేస్తూ కీలకోపన్యాసం చేశారు. "నీరు అనేది పరివర్తన. హైడ్రోనెక్స్-2025 ఆరోగ్యం, దీర్ఘాయువు గురించి," టీఎంఎల్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. డాక్టర్ ఎస్.శ్రీధర్ (ఐఐసిటీ) సుస్థిరతలో పొరల గురించి చర్చించారు. డాక్టర్ బి.దినేష్ కుమార్ (ఐసీఎంఆర్-ఎన్ఐఎన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ) నీటి పొదుపుని నొక్కి చెప్పారు. డాక్టర్ మనోజ్ కురియకోస్ నీటి హీలింగ్ ఎనర్జీని హైలైట్ చేశారు. శ్రీనివాసులు (సర్టిఫైడ్ హైడ్రోజన్ అడ్వైజర్) హైడ్రోజన్ నీటి ప్రయోజనాలను తెలిపారు. డాక్టర్ భరత్ పటోడియా (ఆంకాలజిస్ట్) క్యాన్సర్ చికిత్సలో హైడ్రోజన్ పై అంతర్దృష్టులను పంచుకున్నారు. సుధాకర్ రావు నీటి అవగాహనపై ఉద్ఘాటించారు. హవాయి స్లైడ్ గిటారిస్ట్ జయవంత్ నాయుడు సంగీతం. వెల్నెస్ ని కనెక్ట్ చేశారు. ఆ తర్వాత వాటర్ ఫర్ ది వాయిస్‌లెస్ జంతువుల కోసం వాటర్ బౌల్‌లను ప్రమోట్ చేశారు.

భద్రాద్రి సీతారామ కల్యాణ తలంబ్రాల వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఘట్కేసర్

భద్రాచలం సీత రామ స్వామి కల్యాణ తలంబ్రాలు ఆర్ టీఎ స్ఆర్‌టీసీ లాజి స్టిక్స్ చెంగిచర్ల డిపో ఆధ్వర్యంలో భక్తులు రూ.151 చెల్లిస్తే ఇంటి వద్దకే డెలివరీ చేయబడుననీ డిపో మేనేజర్ కవిత తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామ కల్యాణ తలంబ్రాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇతర వివరాల కొరకు 9154298831 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అనిల్ కుమార్, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

9

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

సభాపతిని సత్కరించిన మైనార్టీ నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కో ఆర్డినేటర్ అండ్ తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటి మెంబెర్ మహమ్మద్ ముజీబుద్దీన్ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎండీ.నయిూమ్, కూకట్‌పల్లి నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.మోసిన్ తదితరులు ఉన్నారు.

జిల్లా సన్నాహక సమావేశం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బాలానగర్ సామ్రాట్ హెూటల్‌లో మేడ్చల్ మల్కాగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధన్ జిల్లా సన్నాహక సమావేశ కార్యక్రమం నిర్వహించారు. పీసీసీ కోఆర్డినేటర్ ఇన్‌చార్జిలు చౌహన్ శివ, కృష్ణ పని ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మేడ్చల్ జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలుగా కోలన్ హనుమంత్ రెడ్డి, బండి రమేష్, వజ్రష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సత్యం శ్రీరంగం, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బ్లాక్ అధ్యక్షులు, మహిళ నాయకురాళ్లు, తదితర నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

'ప్రజావాణి' కి ఫిర్యాదుల వెల్లువ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ జంట సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి జంట సర్కిల్‌ల ఉప కమిషనర్లు ఆర్జీలు స్వీకరించారు. మొత్తం 23 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 11 ఫిర్యాదులో అందాయి. వాటిలో ఇంజనీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ విభాగానికి 4, ఎలక్ట్రికల్ 1, శానిటైజషన్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 12 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 7, శానిటైజషన్ 2 వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆర్జీలు పంపిస్తున్నట్టు వారు తెలిపారు.

దరఖాస్తుదారులతో గౌరవంగా వ్యవహరించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ప్రజావాణికి 99 ఫిర్యాదులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలోనే కాకుండా ఎప్పుడైనా అర్జీలు ఇవ్వడానికి వచ్చే దరఖాస్తుదారలతో గౌరవంగా వ్యవహరించి దరఖాస్తులను స్వీకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 99 ఫిర్యాదులు అందినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలోనే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్,



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, మండల నాయకులు కే.కృష్ణ నాయక్, పి.ధర్మారావులు పాల్గొని ప్రసంగించారు. గత వారం రోజులుగా కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హనుమాన్ నగర్, ప్రగతి నగర్, రామకృష్ణ నగర్, ఆల్విన్ కాలనీ, వాంబే కాలనీ, సాయి నగర్, ఇంద్రహిల్స్, హైదర్నగర్, రాఘవేంద్ర కాలనీ తదితర బస్తీల్లో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఆయా బస్తీల ప్రజలు స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. మంచినీటి సమస్య, రోడ్డు సమస్య, అండర్ గ్రౌండ్ సమస్య, బోర్వెల్ సమస్య, వీధిలైట్లు, రేషన్ కార్డులు, వృద్ధాప్య వికలాంగుల వితంతు, పెన్షన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరూ గ్యారంటీలు అమలు చేయాలన్నారు. అనంతరం ప్రజావాణిలో ఉప కమిషనర్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. పరిశీలించిన కమిషనర్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, లక్ష్మీనారాయణ, చలపతిరావు, రాములు, నరసింహ, షాబుద్దీన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనుల పర్యవేక్షణ..



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధి దిల్ కుష్ నగర్‌లో నగర్ ఓపెన్ నాలాలో డీసిల్టింగ్ పనులను బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆశ, అసిస్టెంట్ ఏఈ డోర కవిత, బీఆర్ఎస్ బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజా, స్థానిక అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, హుస్సేన్ మాజీ అధ్యక్షులు షేక్ కరీముల్లా, బీఆర్ఎస్ పార్టీ దిల్ కుష్ నగర్ సాగర్ అధ్యక్షులు సయ్యద్ సలీం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా తెమడ పరీక్షలు

- ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత టీబీ మందులు పంపిణీ
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జిల్లాలో ఆరు టీబీ యూనిట్ సెంటర్లు, 26 డిసిగ్నేటెడ్ మైక్రోస్కోపీ సెంటర్లు, ఆరు ట్రూ నాట్ సెంటర్లు, ఒక సీబీ నాటెన్స్ సెంటర్లలో ఉచితంగా తెమడ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత టీబీ మందులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ హాస్పిటల్‌లో సోమవారం ప్రపంచ క్షయ నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ముఖ్య అతిథిగా హాజరు కాగా.. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడారు. క్షయ వ్యాధి సోకిన వారికి రూ.వెయ్యి పోషకాహార నిమిత్తం ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో కొత్తగా 4 ట్రూ నాట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. నర్సింగ్ స్టూడెంట్స్ క్షయ నివారణా సిబ్బంది, ఆశాలతో ర్యాలీలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి ప్రాథమిక దశలోనే అనుమానితులను గుర్తించి దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో తెమడ పరీక్షలు చేయించి త్వరితగతిన మందులు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణా అధికారి డాక్టర్ శ్రీదేవి నర్సింగ్ స్టూడెంట్స్, ఆశాలు, క్షయ నివారణా సిబ్బందితో క్షయ వ్యాధి నిర్మూలనకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేయించారు. మెరుగైన సేవలందిస్తూ ఈ ప్రోగ్రాంని నడిపిస్తున్న సిబ్బందికి పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మల్కాజిగిరి ఉప వైద్యాధి కారి డాక్టర్ శోభారాణి, జిల్లా ఎన్టీపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై.శ్రీదేవి, ఐఐఓ డాక్టర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్ పి.శిరీష, బాలానగర్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, డాక్టర్ మమత, డాక్టర్ మౌనిక, రాందేవ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, కుముదినీ దేవి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



- ఆశాలకు కనీస వేతనం నిర్ణయించాలి: సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్

నవతెలంగాణ-నిజాంపేట్

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామీకమని సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా కార్మికుల హక్కుల సాధన కొరకు ఉద్యమించే వారిని ఎక్కడికక్కడే నిర్బంధాలకు గురి చేయడం దారుణమని విమర్శించారు. గత కొంత కాలంగా ఆశ కార్మికుల హక్కు ల కొరకు నిరసనలు, వినతులు, ధర్నాలు, దీక్షలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంతో సోమవారం ఛలో మెడికల్ డైరెక్టరేట్ ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని, ఆశ కార్యకర్తలను, సీఐటీయూ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు, గృహనిర్బంధాలు చేసిందని ఆయన ఆక్షేపించారు. శనివారం ఉదయం నుంచే అరెస్టులు, నిర్బంధాలకు గురిచేసి కార్యక్రమాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. బాచుపల్లి మండలంలోని సీఐటీయూ నాయకులను ఆశా కార్యకర్తలను, ముందస్తుగా అరెస్టు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఆశ వర్కర్స్ మీనా, నాగమణిలను తెల్లవారుజామున 6 గంటలకు ఇండ్ల వద్ద అరెస్టు చేసి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలుస్తుంది. ఆశా వర్కర్ల కనీస డిమాండ్లైన నెలకు రూ.26 వేతనం ప్రభుత్వం ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆపేదే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయమైన ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, పోరాటాల ద్వారా డిమాండ్లను నెరవేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

కార్మికుల పి.ఎఫ్ సమస్యలు పరిష్కరించాలి..



నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల పి.ఎఫ్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ అన్నారు. కూకట్‌పల్లి పి.ఎఫ్ కార్యాలయం డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంబంధించిన పి.ఎఫ్ సమస్యలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. కార్మికుల ప్రమేయం లేకుండా వారి పి.ఎఫ్ ఖాతాలో నిజమైన సొమ్ము, కొంతమంది అక్రమార్కులు సొమ్మును కాజేస్తున్నారని విమర్శించారు. చాలామంది కార్మికుల వేతనాల్లో పి.ఎఫ్ కట్ చేస్తూ కొన్ని సంవత్సరాలుగా అవి ప్రావిడెంట్ ఫండ్ లో జమ చేయడం లేదని తెలిపారు. మున్సిపల్ కార్మికుల వయసుతో నిమిత్తం లేకుండా పని చేయగలిగినంత కాలం పి.ఎఫ్ కట్ చేసి కార్మికుల భవిష్య నిధి నుంచి కార్మికులు లబ్ధి పొందే విధంగా చేయా లని ఆయన కోరారు. ఇంత కాలం లేని సమస్య ఇప్పుడు కొత్తగా ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదన్నారు. పి.ఎఫ్ సమస్యలు పరిష్కారం కాకపోతే పి.ఎఫ్ అధి కారులు, మున్సిపల్ అధికారులు, కార్మికుల ఆందోళన పోరాటాలకు బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఈ. పెంటయ్య, కార్యదర్శి ఎన్. ఎల్లమ్మ,నాయకులు రాజు, వెంకటమ్మ మహిపాల్, నారాయణ, చెన్నయ్య వెంకన్న శ్రీను, మనీ ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం అందజేత..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

విగ్రహాల ఏర్పాటుకు కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రెండు లక్షల రూపాయల చెక్కులు, మాధవరం రామచంద్ర రావు ఒక్క లక్ష రూపాయలు విరాళముల చెక్కులను, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి అందించారు. నాలుగున్నర దశాబ్దాల అతి పురాతనమైన ఆలయం, కూకట్‌పల్లి సీతారామ చంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో 27 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేయనున్నారు. ఆంజనేయ స్వామి, గరుత్మంతుడు స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్టాపించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తూము శ్రావణ్ కుమార్, ఆలయ మాజీ చైర్మెన్ తులసి రావు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసి చెక్కు అందజేత..



నవతెలంగాణ-కూకట్‌పల్లి/ కేపీహెచ్‌బీ

బాధిత కుటుం బానికి ఎల్‌ఓసి చెక్కును కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్ అందజేశారు. కూకట్‌పల్లి డివిజన్‌లో నివాసం ఉంటున్న కోడిరెక్కల రామారావు కిడ్నీ సమస్యతో నిమ్స్ హాస్పిటల్‌లో చేరడం జరిగింది. ఆయన భార్య రత్నకుమారి కూకట్‌పల్లిలోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయాన్ని సంప్రదించగా, వారికి బండి రమేష్ ద్వారా, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయడం జరిగింది. అందుకు రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్‌ఓసీ మంజూరు అయ్యింది. మంజూరు అయిన ఎల్‌ఓసీ లెటర్ నుబండి రమేష్, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా, రామారావు భార్య రత్నకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, శివ చౌదరి, బొట్టు రాజు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పంపిణీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, తన నివాసం వద్ద ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ఒరిగంటి వెంకటరమ రాజుకు రూ.60,000, జి.లక్ష్మమ్మకు రూ.35,000 వేలు చెక్కులు సోమవారం అందజేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే రోజువారి కార్యాచరణలో భాగంగా తన నివాసం వద్ద నియోజకవర్గం ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుంన్నారు. ప్రజాపాలనలో ప్రజా సంక్షేమానికి మన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందాన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శిల్పా బృందావనంలో ఆలయ వార్షికోత్సవం..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, శంషిగుడా శిల్ప బృందావనంలోని, శ్రీ కోదండరామస్వామి దేవస్థానం మూడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించారు. సీతరాముల కల్యాణం వేడుకలకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి, ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామి దేవస్థానం మూడవ వార్షికోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రత్యేక యాగాలు, యజ్ఞాలు, స్వామి వారి కల్యాణం, బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం కన్నుల పండుగగా ఉంన్నారు. స్వామి వారి కల్యాణం జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శిల్పాబృందావనం కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణోత్సవంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్... నవతెలంగాణ - కూకట్‌పల్లి

కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం..



- బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోంమని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఓ ప్రయివేటు కంపెనీలో రహీం అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాలుగా పని చేశాడు. అనివార్య కారణాలవల్ల రహీం ఆ కంపెనీలో పని మానేశాడు. తన కు రావలసిన గ్రాట్యుటీ అమౌంట్ కంపెనీ యాజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగిన తనకు ఇవ్వకపోవడంతో రహీం విసుకు చెందాడు. తనకు తెలిసిన వారి ద్వారా రవిసింగ్ కలిసి, తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పు కున్నాడు. రవి సింగ్ వెంటనే స్పందించి కంపెనీ యజమాన్యంతో పలుమా ర్లు మాట్లాడి.. కార్మికుడికి రావలసిన గ్రాట్యుటీ రూ.50 వేలు కార్మికుడు రహీంకు ఇప్పించాడు. తనకు న్యాయం చేసిన రవి సింగ్‌కి, కార్మికుడు ప్రత్యే క ధన్యవాదాలు తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్ , జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

- సత్యం ట్రస్ట్ చైర్మెన్ సత్యనారాయణ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడతామని ట్రస్ట్ చైర్మెన్ సత్య నారాయణ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్, కేపీహెచ్‌బీ కాలనీలోని వృద్ధు లకు, ఉదయం పూట అల్పాహారం, మంచినీళ్ల ప్యాకెట్లు సోమవారం సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ సత్య నారాయణ మాట్లాడుతూ వృద్ధులందరికీ మనశ్శాంతిని, ఆరోగ్యాన్ని, సంపూర్ణ ఆనందాన్ని సదా ఇవ్వాలని, ఆ భగవంతుడిని మన స్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలియజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హలో ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టి పేద మధ్యతరగతి ప్రజలను తమ వంతుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఇన్‌చార్జిలు అరవింద్, దేశెట్టి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



IN THE COURT OF THE XXII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.No. 3248 OF 2022

BETWEEN:
Canara Bank ...Petitioners/Petitioners
AND
Sri Devika Swashakthi Sangam & 10 others ...Respondents/Respondents

To
1.Sri Devika Swashakthi Sangam, R/o. Rauduragam, Serilingmapally, Hyderabad, Rep. by Donga Jyothi & G.Vijaya
2.Smt D.Jyothi W/o. Sri. Narsimha Murthy, R/o H.No.1-96, Turpu Palem, Dongavari Peta, Malikipuram Mandal, Sivakodu, East Godavari distict
3.Sri.G.Vijaya, W/o.Sri Govardhan Goud, R/o H. No.5-63/A, Pochamma Basthi, Raidurga Golconda, Hyderabad
4.Sri.V.Sujatha,W/o.Sri.V.Malikajun R/O.H.No.5-16/6, Endla Basthi Nagar, Raidurg, Golconda, Hyd
5.Smt.V.S.S.Prabhavathi, W/o. Sri.V.Ganapathi Raju, R/O. H.No. 5-67/1, HS darga Shaikpet, Hyd
6.Miss D.Ganga Teja, W/o. Sri.D.Narsimha, R/o H.No.1-96, Turpu Palem, Donga Vari Peta, Malikipuram Mandalam, Sivakodu, East Godhavari A.P.
7.Smt. C.Chittamma, W/o. Sri.C.Thirupathi, R/o.94, A.V.Model School Jai Santosh Nagar, Tirumalgiri, IDA Jeedimedatla, Hyd
8.Smt.K.Anitha, W/o.Sri.K.Ganesh, R/o.H.No.5-101,Raidurg Golconda Hyderabad
9.Smt.G.Aruna Kumari, W/o. Sri.Bheemraju, R/o. H.No.5-67/1, Pochamma Basti, HS darga Shaikpet, Hyderabad
10.Smt.G.Balamma, W/o. Sri.G.Sanjanna, R/o H. No.8-3-228/578/9/1, Rahamat Nagar, Yousuf Guda, Hyderabad
11.Smt.S.Ganga, W/o. Sri.S.Ramulu, R/o Peddamandadi, Mehaboob Nagar

It is to inform you that the above case is filed against you for recovery of money and the case stands posted to 07.04.2025 for your appearance at 10:30 A.M. If you fail to appear on the above date at 10:30 A.M. in the above said Court either in person or through an Advocate, the suit will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Smt.G.RAMA MANOJA
(ADVOCATE)
Flat No.102, Signature Apartment, Begumpet, Hyderabad - 500 016

IN THE COURT OF THE HON'BLE X ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. NO. 558 OF 2024

Between:
Brij Gopal Mundada S/o Ganesh Lal Mundada, Aged 63 Years, Occ: Business, R/o 21-3-511 to 21-3-511/1, 3rd Floor, Panch Burrag, Moosabowli, Chelapura, Hyderabad. ...Plaintiff
AND
Narayan Lal Mundada S/o Ganesh Lal Mundada, Aged 65 Years, Occ: Business, R/o R/o 21-3-511 to 21-3-511/1, 2nd Floor, Panch Burrag, Moosabowli, Chelapura, Hyderabad. Also Residing at: R/o.Plot No.19, Road No.2, Ambience Fort Attapur, Hyderabad Telangana 500048, Also at:Plot No 25, Road No 2, Industrial Estate, Katedhan, Industrial Estate, Hyderabad, Telangana-500077 Also at: Plot No 26, Road No 2, Industrial Estate, Katedhan, Industrial Estate, Hyderabad, Telangana-500077 ...Defendant

Whereas the above-named Plaintiff has filed the above suit O.S No.558 OF 2024 on the file of Hon'ble X Addl Chief Judge, City Civil Court, at Hyderabad against you the Defendant seeking a relief of recovery of possession and mesne profits under Order VII Rule 1 to 6 R/W section 26 of CPC with respect to suit schedule property i.e., 'A' Schedule of Property all that part and parcel of 2nd Floor of property Municipal No. 21-3-511/1, Panchi Burrag, Moosa Bowli, Chelapura, Hyderabad, admeasuring, 469.27 Sy. yards with structures thereon, admeasuring 2631. 15 sq. feet commercial, 1242.26 Sq . feet parking on the ground floor, 1242.26, Sy. feet commercial, 2631.15 Sq. Feet residential on the first floor 1242.26 Sq. feet commercial, 2631.15 Sq. Feet residential on the second floor and 1242 26 Sq. Feet commercial on the third floor and 'B' Schedule of Property all that part and parcel of 2nd Floor ofproperty Municipal No. 21-3-511/1, situated at Panchi Burrag, Moosa Bowli, Chelapura, Hyderabad admeasuring. 187.55 Sq.Yards with structures admeasuring 1219 Sq. Feet in the cellar, 1219 Sq. Feet commercial on the ground floor, 1315.25 sq. feet residential on the first floor and 1315.25 sq.it residential on the second floor. The Hon'ble Court has ordered for publication of notice through news-paper on 03.03.2025 and posted the matter to 10.04.2025 for your appearance. Please be present before the Hon'ble X Addl Chief Judge, City Civil Court, at Hyderabad with supporting documents if any on 10.04.2025 at 10.30AM either in person or through your advocate, failing which the matter shall be decided in your absence and based upon merits.

(ISSUED UNDER THE ORDERS OF THE COURT)
P.Sumitra
Advocate
II Floor, SVSKL Mansions, 3-6-369/A/18, Street No.1, Himayatnagar, Hyderabad-500 029

డా.రాజశేఖర్ కొప్పుల సేవలు అసాధారణం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

డా.రాజశేఖర్ కొప్పుల సేవలు అసాధారణమని 2002 నుంచి రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ రాజశేఖర్ కొప్పుల ఉస్మానియా వైద్య కళాశాల సంఘం సత్కరించింది. విశిష్ట పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ రాజశేఖర్ కొప్పుల తన అత్యుత్తమ వైద్యసేవలే కాకుండా వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా సామాజిక స్పృహకు విశేష కృషి చేశారు. కోఠిలోని పూర్వవిద్యార్థుల భవనంలో సీనియర్ డాక్టర్లు, కన్సల్టెంట్లు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు, జూనియర్ డాక్టర్ల సంఘం సభ్యులు ఆయన ప్రస్థానాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ కొప్పుల సమాజానికి చేసిన అమూల్యమైన సేవలను గుర్తించి శ్రీ చంద్రశేఖర్ తివారీ, రాణి రుద్రమ తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. డాక్టర్ రాజశేఖర్ కొప్పుల సన్మాన కార్యక్రమంలో డాక్టర్ సురేందర్ రెడ్డి, నీరజ పాల్గొన్నారు. 200 మందికి పైగా సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ఇఫ్తార్ విందు..



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ ప్రిన్స్ హాల్ రాజా సినిమా కేంద్రంలో ఇమ్రాన్ ఖాన్ షకీల్ అహ్మద్ మహమ్మద్ సర్ఫుద్దీన్, అబ్దుల్ కలీం, ఎస్ఎ ఉద్దీన్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ కన్వీనర్ కో కన్వీనర్ లు వల్లభనేని ప్రసాద్ కాటామోని వెంకటేశులు, చిరంజీవి, నవాజ్ ఖాన్ ఇఫ్తార్ విందులో హాజరయ్యారు.



గ్రేటర్‌లో ఒళ్లు గగుర్పొడిచే దారుణాలు

- అత్యాధునికి టెక్నాలేజీ, సీసీ కెమెరాలున్నా..
- నగరంలో మరో దారుణ హత్య





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో ఒళ్లుగగుర్పొడిచే దారుణ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యాధునికి టెక్నాలేజీని, వేలాది సీసీ కెమెరాలను, భారీ నిఘాను ఉపయోగిస్తున్నా ఆశించిన తీరులో ఫలితాలు రావడం లేదు. ప్రతి రోజు ఎక్కడోచోట దారుణ హత్య, లైంగిక వేదింపులు, పాతకక్షలతో కొందరు దారుణాలకు ఒడిగడుతుంటే, మరి కొందరు ప్రేమవ్యవహారం, కక్షలు, ప్రతీకారాలతో రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో నడిరోడ్లపై హత్యలు, లైంగిక వేధింపుల సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా గాంధీ భవన్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని మనోరంజన్ కాంప్లెక్స్ వెనుక ఓ గుర్తు తెలియని మతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఆ వ్యక్తిని బండరాళ్లతో కొట్టి చంపినట్టు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలావుండగా చంపాపేట డివిజన్ ఐఎస్ సదన్‌లో ఓ లాయర్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం అంబేద్కర్‌వాడలో న్యాయవాది ఇజ్రాయేల్‌ను దస్తగిరి అనే నిందితుడు కత్తితో పొడిచి న్యాయవాదిని దారుణంగా హత్యచేసిన సంఘటన సంచలనం రేపింది.

కారుతో ఢీకొట్టడంతో కిందపడిన ...

పాత కక్షలతో ఎల్బీనగర్ ఠాణా పరిధిలో ఓ వ్యక్తిని హత్యచేసిన విషయం తెలిసిందే. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన బొడ్డు మహేశ్(31) ఎల్బీనగర్ భరత్ నగర్‌లో ఉంటూ ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్లక్రితం తట్టిఅన్నారానికి చెందిన స్నేహితుడు నాగరాజు పెళ్లి బరాత్‌కు వెళ్లాడు. నాగరాజు స్నేహితుడైన మీర్‌పేట నందిహిల్స్‌కు చెందిన పగిళ్ల పురుషోత్తం సైతం హాజరయ్యాడు. బరాత్‌లో వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. పురుషోత్తం బీరు సీసాతో కొట్టడంతో మహేశ్ తలకు గాయాలయ్యాయి. హత్యాయత్నం కేసు నమోదైంది. గతేడాది డిసెంబరు 20న వీరిద్దరూ రంగారెడ్డి జిల్లా కోర్టుకు హాజరు కావాల్సి ఉండగా.. అదే రోజు మహేష్ అతని అనుచరులు.. పురుషోత్తం, అతని స్నేహితులైన రాము, నాగరాజులపై కొడవళ్లతో దాడిచేశారు. చైతన్యపురి పోలీసులు మహేశ్, అతని అనుచరులను అరెస్టుచేశారు. 20రోజుల క్రితం మహేశ్ జైలునుంచి విడుదలయ్యాడు. మహేశ్ తిరిగి తనపై దాడిచేస్తాడనే భయంతో అతడిని చంపాలని పురుషోత్తం నిర్ణయించుకున్నాడు. శనివారం అర్ధరాత్రి 12.30గంటల సమయంలో కారులో అనుచరులతో కలిసి మహేశ్‌ను అనుసరించాడు. శివగంగకాలనీ మీదుగా భరత్ నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా వెనకనుంచి కారుతో ఢీకొట్టారు. కిందపడగానే గొడ్డలి, కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఇదిలావుండగా కొద్దిరోజుల క్రితం మరో సంఘటనలో తండ్రిని కుమార్తె క్రూరంగా చంపిన విషయం నగరంలో సంచలనం రేపింది. పనికెళ్లి రాత్రిపూట ఎందుకు ఆలస్యంగా వస్తున్నావని తండ్రి ప్రశ్నించిందకు తండ్రిని క్రూరంగా హత్య చేసింది. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్‌లోని అంబర్‌పేట, తులసీరామ్‌నగర్‌లో చోటుచేసుకుంది.

ఎంఎంటీఎస్ రైలులో యువతిపై లైంగికదాడికి యత్నం

ఎంఎంటీఎస్ రైలు బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ యువకుడు లైంగికదాడికి ప్రయత్నించిన విషయం సంచలనం రేపింది. అనంతపురం జిల్లాకు చెందిన యువతి (23) మేడ్చల్‌లో ఓ ప్రయివేే సంస్థలో ఉద్యోగం చేస్తోంది. తన సెల్‌ఫోన్ మరమ్మతు కోసం సికింద్రాబాద్‌కు వెళ్లి పని ముగించుకుంది. అనంతరం ఎంఎంటీఎస్‌లో మేడ్చల్‌కు బయలుదేరింది. మహిళల కోచ్‌లో ఆమె ఎక్కింది. ఆ బోగీలో ఉన్న మరో ఇద్దరు మహిళలు అల్వాల్ స్టేషన్‌లో దిగిపోయారు. బోగీలో యువతి ఒక్కతే ఉండగా ఓ యువకుడు (25) ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అతని నుంచి తప్పించుకునేందుకు బాధితురాలు రైలు నుంచి బయటకు దూకేసింది.

బాలీవుడ్ నటిపై దాడి

హైదరాబాద్ నగరంలో బాలీవుడ్ నటిపై దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ముంబయిలో ఉంటున్న ఓ బాలీవుడ్ /టీవీనటి(30)కి ఈ నెల 17న హైదరాబాద్‌కు చెందిన ఓ స్నేహితురాలు ఫోన్ చేసి షాప్ ప్రారంభోత్సవానికి అతిథిగా రావాలని, పారితోషికం చెల్లిస్తామని ఆహ్వానించింది. దాంతో హైదరాబాద్‌కు వచ్చిన అపార్ట్‌మెంట్‌లో ఉంది. నటివెళ్లిన అపార్టుమెంట్‌లోకి ఇద్దరు మహిళలు, మరో ముగ్గురు పురుషులు కలిసి నటి ఉన్న గదిలోకి వెళ్లారు. తమతో గడపాలని ఒత్తిడి తెచ్చారు. ఎదురుతిరిగిన ఆమెపై దాడి చేశారు. బాధితురాలు గట్టిగా అరిచి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించగానే ముగ్గురు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో మాసబ్‌ట్యాంక్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా నీలి చిత్రాల్లో నటిస్తే లక్షలు వస్తాయని ఓ కేటుగాడు వివాహితను మాయమాటలతో నమ్మించారు. వెబ్‌సైట్ వాళ్లు తనకు బాగా తెలుసని, ముఖానికి స్కార్ఫ్ కట్టుకుని నటిస్తే పది లక్షలు ఇస్తారని నిందితుడు చెన్నకేశవ బలవంతం చేశాడు. ఆర్థిక అవసరాల రీత్యా సరేనని చెప్పింది. నగరంలోని పంజాగుట్టలో ఉన్న ఓ ప్రముఖహెూటల్‌కు పిలిపించిన నిందితుడు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చాడు. ఆమె మత్తులోకి జారుకున్నాక నగ్నంగా వీడియోలు తీశాడు. దుర్మార్గుడు. మత్తు నుంచి తేరుకున్నాక ఆ వీడియోలను చూపించి వివాహితనే నిందితుడు బ్లాక్ మెయిల్ చేశాడు.

జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న పథకాలు భేష్



- అభిప్రాయపడ్డ ట్రైనీ ఐఏఎస్‌లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ద్వారా నగరంలో అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దోహద పడుతున్నాయని ట్రైనీ ఐఏఎస్‌లు అభిప్రాయపడ్డారు. 2023 సంవత్సరంలో ఐఏఎస్ లుగా ఎంపికై తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపు అయిన ట్రైనీ ఐఏఎస్‌లు పలు జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరికి పురపాలక, పట్టణాభివద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రజలకు అందిస్తున్న సేవలు, సంస్థ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల గురించి జీహెచ్ఎంసీకి వచ్చిన ట్రైనీ అధికారులకు కూకట్‌పల్లి జోనల్ అధికారి అపూర్వ చౌహాన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శానిటేషన్, భవన నిర్మాణ వ్యర్థాలు (సీ అండ్ డి), హెల్త్, వెటర్నరీ, ఎంటమాలజీ, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఎస్.ఎన్.డీ.పీ, ఎస్.ఆర్.డీ.పీ, సీ.ఆర్.ఎం.పీ పథకాలు, రెవెన్యూ, యుబీడీ, స్పోర్ట్స్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, నాలా పూడికతీత, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్, స్ట్రీట్ లైట్ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్‌తో పాటుగా వికారాబాద్ జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసిన మిస్ ఉమా హారతి, నారాయణ పేట్ లో పనిచేస్తున్న మిస్ గరిమ నారుల, ఈ ఈ యస్ఎస్‌డీ మనోజ్ (సంగారెడ్డి), అజయ్ యాదవ్ (కరీంనగర్), సాకేత్ కుమార్ (నిజామాబాద్), అభిగ్యాన్ మాల్వియా (ఆదిలాబాద్), మణాల్ శ్రేష్ఠ (ఖమ్మం జిల్లా) అసిస్టెంట్ కలెక్టర్లు, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ కోర్స్ డైరెక్టర్ డా.కందుకూరి ఉషా రాణి, జీహెచ్ఎంసీ చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ముఖ్యమైన పండుగలకు సెలవులివ్వాలి

సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి సి.మల్లేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

జీహెచ్ఎంసీ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకి ముఖ్యమైన పండుగలకు సెలవులు ఇవ్వాలని సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి సి. మల్లేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జీహెచ్ఎంసీ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ముఖ్యమైన పండగలప్పుడు ప్రభుత్వం సెలవు ఇవ్వాలని అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి సి.మల్లేష్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 18,600 మంది మున్సిపల్ కార్మికులు పనిచేస్తునామని ఎక్కువ శాతం మంది మహిళా కార్మికులు ఉన్నారని ముఖ్యమైన పండుగలు బోనాలు, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా మున్సిపల్ స్వీపర్స్‌ప సెలవులు ఇవ్వాలని కోరారు. తమ ఇండ్లల్లో పనులు చేసుకునేది మహిళలే కావున కుటుంబ సభ్యులు, పిల్లలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పండుగల సందర్భంగా ఒక్క పూట 10 గంటలకు అటెండెన్స్ తీసుకుని సెలవు ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంజయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి కృషి



- జోనల్ కమిషనర్ టి. వెంకన్న

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్రమ నిర్మాణాల, ఇంజనీరింగ్ సమస్యపై పలు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఏయంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలి

జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ అడ్వకేట్ బేల బాటియా, చెరుకు సుధాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. (శాంతి చర్చల కమిటీ) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ అడ్వకేట్ బేల బాటియా, చెరుకు సుధాకర్ హాజరై మాట్లాడుతూ మావోయిస్టుల నెపంతో ఆదివాసులు జీవించే హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణకు చేపట్టాలని కోరారు. చత్తీస్ ఘడ్ మరణకాండపై ఆదివాసీ, హక్కుల సంఘాలు, పౌర, ప్రజాస్వామిక సంఘాల రిపోర్టులు ఆధారంగా సుప్రీంకోర్టు చర్య తీసు కోవాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో రగులుతున్న హింసా కాండకు గల కారణాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయి నాయకత్వంలో మణిపూర్‌కు వెళ్లారు కానీ, హింసతో రగులుతున్న దండకారణ్యంలోని బస్తర్ సందర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత గిరిజన మహిళపై జరుగుతున్న అక్రమ దాడులను వ్యతిరేకించాలన్నారు. ఒకవేళ యుద్ధ వాతావంరణంలో ఆపకుండా శాంతి చర్చలు జరుపుకుంటే అమాయక ఆదివాసులు బలవుతున్నారని, అదేవిధంగా కొనసాగితే ప్రజల నుండి తిరుగుబాటు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, కందిమల్ల ప్రతాపరెడ్డి, జర్నలిస్టు దుర్గా ప్రసాద్, మాజీ మావోయిస్టు సీసీఎం జంపన్న, ఎంవీఎస్ ఫౌండేషన్ ఆర్.వెంకట్‌రెడ్డి, రచయిత అనిశెట్టి సాయికుమార్, జి .రాములు, తదితరులు పాల్గొన్నారు.

'సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి'



- నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత మూడు నెలలుగా డిగ్రీ థర్డ్ ఇయర్ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయకుండా కళాశాల యజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని కళాశాల విద్యార్థులు ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ ఎదుట విద్యార్థులంతా బైఠాయించి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వెంటనే ఫలితాలు విడుదల చేయాలని, లేకపోతే పైచదువులకు ఇబ్బంది అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నెలలో పీజీ ఎంట్రెన్స్ ఉందని, అప్పటి వరకు ఫలితాలు విడుదల చేయకపోతే ఎలా అని విద్యార్థులు ప్రశ్నించారు. ఈ విషయంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంటనే స్పందించాలని, లేకపోతే కళాశాల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. సుమారు 5 గంటల పాటు విద్యార్థులు ఆందోళన చేస్తుండగా కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్ విద్యార్థుల వద్దకు వచ్చి ఆందోళనను విరమించాలని కోరారు.కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఫలితాల విడుదలకు జాప్యం జరుగుతుందని ఆయన చెప్పారు. వచ్చే నెల 7వ తేదీలోగా ఫలితాలను విడుదల చేస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమింపజేశారు.

రవాణా రంగ కార్మికుల హామీలను అమలు చేయాలి

- ఐఎన్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎన్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డా.జి.సంజీవరెడ్డి పిలుపు మేరకు ప్రయివేట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్ టీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిజ్జల రామకృష్ణారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి చంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణ గూడ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్మికుల కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12వేలతో పాటు రవాణా రంగ కార్మి కుల సంక్షేమబోర్డు, ఆటోనగర్ ఏర్పాటు చేసి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, వాటిని అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులతో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్యాబ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కందుల ఉపేందర్, ఆటో యూని యన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్. దయానంద్, యూనియన్ నాయ కులు అంబదాసు, నాగరాజు, నాగ మల్లయ్య, జానయ్య, కనకయ్య, రఫీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యా రంగాన్ని పటిష్టపరుచుకుందాం



- నిజాం కళాశాలలో భగత్ సింగ్ 94వ వర్ధంతి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిజాం కళాశాలలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.దుబ్బ రంజిత్ పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ప్రధాతలుగా నిలిచిన గొప్ప వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు తమ నూనూగు మీసాల యవ్వనంలో బ్రిటిష్ పాలనను దిక్కరిస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన గొప్ప చరిత్ర వారి సొంతమన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ నేటి యువతరం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ట్స్ కళాశాల ఆవరణ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నినాదాలు ఇవ్వకూడదని యూనివర్సిటీ వీసీతో ఒక సర్క్యులర్‌ను జారీ చేయించిన విధానాన్ని తప్పుబడుతూ వెంటనే ఈ సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు కోరుకున్న సమసమాజ స్థాపన కోసం విద్యార్థులందరూ పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు గౌతమ్, రహీం, సాయికిరణ్, వంశీ, కిషోర్, ఉమేష్, సాయి, కిషోర్, రాజేష్, కిరణ్, సోమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్.కృష్ణయ్యపై జాజుల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి'

- పలు బీసీ విద్యార్థి, యువజన సంఘాల హెచ్చరిక



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యపై ఇటీవల బీసీ నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే జాజులకు దేహశుద్ధి, రాళ్ళ దాడి తప్పదని పలు బీసీ విద్యార్థి, యువజన సంఘాలు హెచ్చరించాయి. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ విద్యార్థి యువజన సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అనంతుల రామ్మూర్తి గౌడ్, బీసీ నేత ర్యాగ రమేష్ మాట్లాడుతూ వేలాది ఉద్యమాలు చేసి, జీవోలను తీసుకువచ్చి కోట్లాది మందికి విశేషమైన సేవలు అందించిన ఆర్.కృష్ణయ్యను బీసీ నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇటీవల ఒక సమావేశంలో తన స్థాయికి మించి ఆర్.కృష్ణయ్యపై తప్పుడు ఆరోపణలు చేశారని, భవిష్యత్తులో ఇలాంటివి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. జాజుల వెంటనే ఆర్.కృష్ణయ్యకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘం అధ్యక్షులు చెరుకుల రాజేందర్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య, బీసీ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు నిఖిల్, బీసీ యువజన సంఘం నాయకులు బడేసాహెబ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని అంబర్‌పేట డివిజన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు నరేష్ గౌడ్ దీపక్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగ భూషణం చారి, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రెటరీ యశ్వంత్, దయాకర్ యాదవ్, వెంకట్ స్వామి, శ్రీకాంత్, గడ్డం భాస్కర్ గౌడ్, యాదగిరి, మనోజ్ యాదవ్, ఎస్ ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **నవతెలంగాణ-అంబర్‌పేట**



నాయకుల అరెస్టు సరికాదు..

- సీఐటీయూ జోన్ కమిటీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆశాల న్యాయమైన డిమాండ్ కోసం పోరాటం చేస్తున్న కార్మిక నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని సీఐటీయూ చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆసందర్భంగా సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, రామ్ కుమార్‌లు మాట్లాడుతూ.. పారితోషకాలతో జీవనం గడుపుతున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని పోరాటం చేస్తున్న క్రమంలో నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా పండుగలు చేసుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట



కులమతాలకు అతీతంగా శాంతియుతంగా పండుగలు చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ ఓవైసీ నగర్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, సీఐ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులంతా రోజా ఉండడం వారికి తోచిన విధంగా పేద ప్రజలకు సహాయం చేయడం, కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిం సోదరులంతా ప్రతి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా కలిసి మెలసి జరుపుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక బస్తీ ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, అఫ్రోజ్ పటేల్, అమీర్, మోసిన్, సంతోష్ చారి, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.



రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన శ్లోకా హై స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకల్లో నిర్వహించిన కల్చరల్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారి వర్షిత

నవతెలంగాణ-అంబర్‌పేట

మానసిక ఒత్తిడితో శారీరక మార్పులు



మానసిక ఒత్తిడి మన శారీరక, మానసిక, భావోద్వేగ స్థితిని ప్రభావితం చేసే ఒక ప్రధాన అంశం. దీర్ఘకాలిక ఒత్తిడి స్త్రీల లైంగిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సరైన అవగాహన, జీవనశైలి మార్పులు, చికిత్స కీలకం.

మానసిక ఒత్తిడి వల్ల శరీరంలో కొన్ని హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ముఖ్యంగా ఒత్తిడి హార్మోన్‌లు పెరిగినప్పుడు ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్, టెస్టో స్టీరోన్ స్థాయిలు తగ్గుతాయి. ఇది లైంగిక ఆసక్తిని తగ్గించడమే కాకుండా, రిప్రొడక్టివ్ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

ముఖ్యమైన సమస్యలు

హైపోయాక్టివ్ సెక్స్యువల్ డిజైర్ డిజార్డర్: ఇది స్త్రీలలో అత్యంత సాధారణమైన లైంగిక సమస్య. దీని కారణంగా లైంగిక ఆకర్షణ పూర్తిగా తగ్గిపోతుంది. ఒత్తిడి, ఆందోళన, సంబంధాల్లో ఉద్రిక్తత దీని ప్రధాన కారణాలు.

అనారోగ్యకరమైన యోని మార్పులు: మానసిక ఒత్తిడితో యోని పొడిబారుతుంది. ఇది శరీర సంబంధ సమయంలో అసౌకర్యం, నొప్పి, చికాకు కలిగించవచ్చు.

లైంగిక స్పందనలో తక్కువతనం: ఒత్తిడి వల్ల రక్తప్రసరణ మందగించడం వల్ల జననాంగాల్లో స్పందన తగ్గుతుంది. దీని ప్రభావంగా శరీర సంబంధంలో ఆనందం తగ్గిపోతుంది.

ఆర్గాజమ్ పొందడంలో సమస్యలు: మానసిక ఒత్తిడి మెదడులోని ఆనందాన్ని నియంత్రించే కెమికల్స్ దోపమైన్, స్టెరాటోనిన్ స్థాయిని తగ్గిస్తుంది. ఈ మార్పులు శృంగార సమయంలో సంతృప్తి పొందడంలో ఆటంకంగా మారతాయి.



వాజినిజ్మస్: ఒత్తిడి, భయం, లేదా ట్రామా వల్ల యోని కండరాలు స్వచ్ఛందంగా గట్టిగా సంకోచించటం వల్ల శారీరక సంబంధ సమయంలో తీవ్రమైన నొప్పి సంభవిస్తుంది.

పీరియడ్‌లలో అవకతవకలు: ఒత్తిడి వల్ల పీరియడ్స్ ఆలస్యం లేదా ముందుగానే రావడం జరుగుతుంది. కొన్నిసార్లు తీవ్ర ఒత్తిడితో పీరియడ్స్ పూర్తిగా ఆగిపోవచ్చు.

సంతానోత్పత్తిలో ఆటంకం: మానసిక ఒత్తిడి వల్ల గర్భసంచి, కండరాల సంకోచం ఏర్పడి గర్భధారణలో సమస్యలు వస్తాయి.



ముఖ్యమైన సూచనలు

- మానసిక ఒత్తిడిని గమనించి తొందరగా చికిత్స తీసుకోవడం అవసరం.
- మహిళల్లో మానసిక ఒత్తిడి వల్ల ఏర్పడే లైంగిక సమస్యలు సాధారణమే కానీ లైంగిక సమస్యలను చిన్నగా భావించకుండా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.
- సరైన జీవనశైలి మార్పులు, ధ్యానం, మానసిక ఆరోగ్య సంరక్షణ ద్వారా ఒత్తిడి, లైంగిక సమస్యలను అధిగమించవచ్చు.
- జబ్బు తీవ్రతను బట్టి సైకో థెరపీ, మెడిటేషన్, లేదా మందుల ద్వారా చికిత్స పొందవచ్చు

తగ్గించడానికి ఏంచేయాలి

వ్యాయామం: నిత్య జీవితంలో ధ్యానం, ప్రాణాయామం వంటి వాటిని భాగం చేసుకుంటే ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

ఆరోగ్యకరమైన ఆహారం: విటమిన్ బి, మెగ్నీషియం, ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు లాంటి పోషకాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

నిజాయితీగా ఆలోచన చేసుకోవడం: ఒత్తిడికి మూలకారణాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చిత్తశుద్ధిగా ఆలోచించడం అవసరం.

ఆరోగ్యకరమైన జీవనశైలి: పోషకాహారం, నిద్ర, సమయపాలన వంటివి శారీరక ఆరోగ్యాన్ని సమతుల్యం చేస్తాయి.

శారీరక వ్యాయామం: నడక, జాగింగ్, లేదా ఏరోబిక్స్ వంటి శారీరక వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

కౌన్సిలింగ్ లేదా థెరపీ: ప్రత్యేకంగా సి.బి.టి.,సెక్స్ థెరపీ ఒత్తిడిని తగ్గించడంలో సమర్థంగా పనిచేస్తాయి.

భాగస్వామితో చర్చ: భాగస్వామితో స్వేచ్ఛగా తన భావాలను పంచుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

సమయ నిర్వహణ: ఒత్తిడిని తగ్గించేందుకు సమయాన్ని సమర్థవంతంగా నియంత్రించడం అవసరం.

- డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి,
9703935321

జాగ్వార్‌ను నడిపిన మొదటి మహిళా పైలట్



తనుష్క సింగ్... తాత, తండ్రి నుండి ప్రేరణ పొందింది. భారత సైన్యంలో చేరాలని కలలు కన్నది. భారత వైమానిక దళ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించింది. ఉన్నత శిఖరాలకు ఎగబాకింది. తనుష్క సాధించిన విజయం గురించి తెలుసుకొని అభినందించేందుకు ఆ రోజు ఉదయం నుండి బంధువులు, శ్రేయోభిలాషులు ఆమె తాతకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. తనుష్క వీడియో కాల్ ద్వారా తాతతో తన ఆనందాన్ని పంచుకుంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఆమె గురించిన పరిమితమైన సమాచారాన్ని మాత్రమే ఆయన బయటి ప్రపంచంతో పంచుకోగలిగారు.

అయితే ఆయన ఎంత దాచేందుకు ప్రయత్నించినా ఈ ఆనందకర సమయంలో కొన్ని ముఖ్యమైన విషయాలు పంచుకోకుండా ఉండలేకపోయారు. ఈరోజు తనుష్క సాధించిన ఈ ఘనతకు తన భార్య ఊర్మిళ సింగ్ కారణం. ఆమెనే మనవరాలి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గోండా నుండి రాజధానికి మార్చాలని బలవంతం చేసింది. ఈ నిర్ణయం ఫలితంగానే ఇప్పుడు వారి కుటుంబం మైలురాయిని చేరుకుందని ఆయన చెప్పారు.

తాత ప్రేరణతో



లక్నోలో పుట్టిన తనుష్క 2007 నుండి తన తండ్రి రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ ప్రతాప్ సింగ్‌తో కలిసి మంగళూరులో నివసిస్తుంది. అక్కడే ఆమె DPS MRPLలో పాఠశాల విద్యను పూర్తి చేసింది. 2022లో మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బిటెక్ డిగ్రీని పొందింది. తర్వాత ఐఏఎఫ్‌లో చేరింది. తనుష్క సైనిక కుటుంబం నుండి వచ్చింది. ఆమె తండ్రి, తాత ఇద్దరూ మంచి పేరున్న సైనిక సిబ్బంది. తనుష్క మొదట్లో భారత సైన్యంలో చేరాలనుకుంది. కానీ భారత వైమానిక దళంలో మహిళలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకుంది. తను దీని గురించి తన తాతతో మాట్లాడింది. తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని వైమానిక దళంలో చేరాలని నిర్ణయించుకుంది. 'నేను ఆమెను ప్రోత్సహించాను. ఇప్పుడు ఆమె దేశం మొత్తం గర్వపడేలా చేసింది' అంటూ ఆయన పంచుకున్నారు.

తొలి పైలట్ అని తెలియగానే

తెలంగాణలోని దుండిగల్‌లోని వైమానిక దళ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆమె హాక్ ఎంకె 132 విమానంలో ప్రత్యేక శిక్షణ పొందింది. తనుష్క తొలి పైలట్ అయ్యారనే వార్త తెలియగానే ఆమెను అభినందించడానికి ఇందిరానగర్‌లోని పటేల్ నగర్‌లోని ఆమె నివాసానికి శ్రేయోభిలాషులు గుమిగూడారు. ఆమె తాతా, మామ విజయ్ ప్రతాప్ సింగ్‌కు ప్రజలు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు యూఎస్ షాక్

వాషింగ్టన్ : యూఎస్‌లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు అనుమతించే ఎఫ్-1 వీసాలను ఆ దేశం గత కొన్నేండ్లుగా భారీగా తిరస్కరిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకు)లో అన్ని దేశాల నుంచి వచ్చిన 41 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అంటే, వీసా తిరస్కరణల సంఖ్య పదేండ్ల గరిష్ఠానికి పెరిగాయి. దాదాపు రెట్టింపునకు ఎగబాకాయి. అమెరికా విదేశాంగ శాఖ ఈ గణాంకాలను వెల్లడిస్తున్నది. దీని ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 2.79 లక్షల (41 శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం 2022-23తో పోలిస్తే ఈ తిరస్కరణల సంఖ్య ఎక్కువే. మొత్తం 6.99 లక్షల దరఖాస్తులు రాగా.. 2.53 లక్షలు (36శాతం) రిజెక్ట్ అయ్యాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 7.69 లక్షల మంది విద్యార్థులు ఎఫ్-1 వీసాల కోసం అప్లై చేసుకున్నారు. వీటిలో 1.73 లక్షల (23 శాతం) దరఖాస్తులు ఆమోదం పొందలేదు. అయితే, దీనితో పోలిస్తే.. గతేడాది తిరస్కరణకు గురైన ఎఫ్-1 వీసాల సంఖ్య దాదాపు రెట్టింపు కావటం గమనార్హం. ఇక 2014-15లో ఆమోదం పొందని దరఖాస్తుల సంఖ్య 25 శాతంగా ఉన్నది. ఆ తర్వాత ఏడాదుల్లో (2021లో తప్పితే) ఈ తిరస్కరణల సంఖ్య క్రమంగా పెరిగింది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన విద్యార్థి వీసా దరఖాస్తుల సంఖ్య గురించి మాత్రం అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించలేదు.

భారత విద్యార్థులకు 38 శాతం తగ్గిన ఎఫ్-1 వీసాలు

గతేడాది డిసెంబర్ 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 2023 ఇదే సమయంతో పోలిస్తే భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38 శాతం తగ్గినట్టు సమాచారం. కరోనా మహమ్మారి తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గటం ఇదే తొలిసారి కావటం గమనార్హం. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల సమాచారం ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.

దశాబ్ద కాలంలో వీసా దరఖాస్తులు

దాది	ఆమోదం	తిరస్కరణ	మొత్తం	తిరస్కరణ రేటు
2024	4.01 లక్షలు	2.79 లక్షలు	6.79 లక్షలు	41శాతం
2023	4.45 లక్షలు	2.53 లక్షలు	6.99 లక్షలు	36 శాతం
2022	4.11 లక్షలు	2.21 లక్షలు	6.32 లక్షలు	35 శాతం
2021	3.58 లక్షలు	88,583	4.46 లక్షలు	20 శాతం
2020	1.11 లక్షలు	50,490	1.62 లక్షలు	31 శాతం
2019	3.64 లక్షలు	1.24 లక్షలు	4.88 లక్షలు	25 శాతం
2018	3.63 లక్షలు	1.95 లక్షలు	5.58 లక్షలు	35 శాతం
2017	3.94 లక్షలు	2.15 లక్షలు	6.09 లక్షలు	35 శాతం
2016	4.72 లక్షలు	2.47 లక్షలు	7.18 లక్షలు	34 శాతం
2015	6.44 లక్షలు	2.12 లక్షలు	8.56 లక్షలు	25 శాతం
2014	5.96 లక్షలు	1.73 లక్షలు	7.69 లక్షలు	23 శాతం

ఎంపీల జీతాలు 24 శాతం పెంపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎంపీల జీతాలు 24 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పెంపు 2023 ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తారు. పార్లమెంట్ సభ్యుల జీతాలు, డైలీ అలవెన్సెస్, పెన్షన్, అదనపు పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. వాటిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల జీతం రూ. లక్షగా ఉంది. దాన్ని ఏకంగా 1.24 లక్షకు పెంచింది. డైలీ అలవెన్సెస్‌ను రూ.2 వేల నుంచి రూ.2,500కు పెంచింది. మాజీ సభ్యులకు ప్రతి నెలా రూ.25 వేల పెన్షన్ అందుతోంది. దాన్ని రూ.31 వేలకు పెంచింది. మాజీ సభ్యుల అదనపు పెన్షన్‌లోనూ మార్పులు చేసింది. దాన్ని రూ. 2 వేల నుంచి రూ.2,500కు పెంచింది. ఈ పెంపు 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుందని తెలిపింది.

చలో హైదరాబాద్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద రోడ్డుపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, హైదరాబాద్ సౌత్ అధ్యక్షులు మీనా, నాయకులు హేమలత, గంగామణి, సావిత్రి, మేడ్చల్ జిల్లా నాయకులు రుక్మిన్, నిజామాబాద్ జిల్లా నాయకులు నూర్జహాన్, సీఐటీయూ హైదరాబాద్ జిల్లా నాయకులు మహేందర్‌తోపాటు వందలాది మంది బైటాయించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి ఓయూ, కాచిగూడ, నారాయణగూడ, సుల్తాన్ బజార్, అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అదే సమయంలో వందలాది మంది ఆశా వర్కర్లు ఉమెన్స్ కళాశాల చౌరస్తా నడిరోడ్డుపై బైటాయించారు. పోలీసులతో వాగ్వివాదం అనంతరం వారిని కూడా వ్యాన్లలోకి ఎత్తిపడేశారు. ఈ క్రమంలో పలువురు ఆశా వర్కర్లకు గాయాలయ్యాయి. అక్రమ అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్‌ల ముందు ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తోపులాటలో జయమ్మ అనే ఆశా వర్కర్ స్పృహ కోల్పోయింది. అంతకుముందు ధర్నాలో పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు, ఏఎన్‌ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి పి.గంగామణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున ఆశాలు తరలివచ్చారు.

అరెస్టులపై నిరసన కార్యక్రమాలకు పిలుపు

ఆశాల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం, అక్రమ అరెస్టులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో కార్యక్రమాలు చేపట్టాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిలుపునిచ్చారు.

అరెస్టులను ఖండిస్తున్నాం
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఆశా వర్కర్లపై పోలీసులు దాడి చేయడం, అమానుషంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. వెంటనే ఆశా వర్కర్లతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన ఆశావర్కర్లను ఓయూ, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య, రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహారావు, కె.రమేష్, కోట రమేష్ తదితర రాష్ట్ర నాయకులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పరామర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పోలీసులతో ఉద్యమాన్ని ఆపాలనుకుంటే మరింత ఉధృతంగా ముందుకొస్తుందని హెచ్చరించారు. ఆశాలకు అంతకంతకూ పని భారం పెరుగుతున్నది కానీ వేతనం రూ. 9700 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వేలాదిగా వచ్చిన ఆశాలతో మాట్లాడి, ముఖ్యమంత్రి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించకుండా, మహిళలని చూడకుండా బట్టలు చినిగి పోయేటట్టు లాగేసి, వ్యాన్లల్లో పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. మహిళలను నడి రోడ్డుమీద ఈడ్చి, ఈ విధంగా అవమానించినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన మహిళలందరినీ బేషరతుగా విడుదల చేయాలని, ప్రభుత్వం చర్చించి సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ(ఎం) ఆందోళనకు పూనుకుంటుందని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తమకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వడంతో పాటు బీమాసౌకర్యం కల్పించాలనీ, ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు బయలుదేరిన ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఖండించారు. ఇండ్లలో నిద్రిస్తున్న ఆశాలను మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి, తెల్లవారుఝామున బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని తప్పుబట్టారు. దుశ్చర్యలన్నింటినీ అధిగమించి కోఠి, హైదరాబాద్‌కు చేరుకున్న ఆశాలు శాంతియుతంగా ధర్నాకు సిద్ధపడుతుంటే పోలీసులు ఆశాలను బూటుకాళ్ళతో తన్నడం దుర్మార్గమన్నారు. తలకు, చేతులకు, కాళ్ళకు తీవ్ర గాయాలైన వారిని కూడా పట్టించుకోకుండా రోడ్డు పైన ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాల్లో నిర్బంధించడాన్ని తప్పుబట్టారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్, ఉస్మానియా యూనివర్సిటీ, కాచిగూడ, నారాయణగూడ, చంద్రాయణగుట్ట తదితర పోలీస్ స్టేషన్లలో నిర్బంధించిన ఆశాలను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్ పరామర్శించారు. తీవ్ర గాయాలతో ఉన్న ఆశా వర్కర్లను ఉస్మానియా, సీజన్స్ ఆసత్రుల్లో పరామర్శించి ఓదార్చారు.

అలహాబాద్ హైకోర్టుకే యశ్వంత్ వర్మ

(మొదటిపేజి తరువాయి)

ట్రాన్స్‌ఫర్ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ప్రతిపాదించింది. దీనిని ఇప్పుడు ధృవీకరించింది. కాగా, ప్రతిపాదిత బదిలీ సిఫారసును కేంద్రం ఆమోదించిన తర్వాత ఆయన ట్రాన్స్‌ఫర్ అమలులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రానికి చేసిన ఈ బదిలీ సిఫారసును సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తీర్మానంలో బహిరంగంగా ప్రకటించింది. "సుప్రీంకోర్టు కొలీజియం మార్చి 20, 24 తేదీలలో జరిగిన సమావేశాలలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు పంపాలని సిఫారసు చేసింది" అని తీర్మానం వివరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయ.. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ ప్రారంభించారనీ, ఆయనను బదిలీ చేసే ప్రత్యేక ప్రతిపాదన ఉన్నదని సుప్రీంకోర్టు ఈనెల 21న తెలిపింది. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన సంఘటనకు సంబంధించి తప్పుడు సమాచారం, పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయని వివరించింది. సమాచారం అందిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయ అంతర్గత విచారణ ప్రక్రియ ప్రారంభించారనీ, ఆధారాలు, సమాచారాన్ని సేకరించారని సుప్రీంకోర్టు తెలిపింది. మార్చి 20న సుప్రీంకోర్టు కొలీజియం సమావేశానికి ముందే జస్టిస్ ఉపాధ్యాయ విచారణ ప్రారంభించారని చెప్పింది.

కొలీజియం నిర్ణయంపై దుమారం

అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై ఇప్పటికే దుమారం చెలరేగింది. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్.. దీనిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అవినీతి ఆరోపణలున్న యశ్వంత్‌ను ఇక్కడకు ఎలా బదిలీ చేస్తారని నేరుగా సీజేఐకి లేఖ రాసింది. ఆ 'చెత్త' మాకొద్దంటూ తీవ్ర పదజాలాన్ని వినియోగించింది.

ఈనెల 14న రాత్రి 11.35 గంటల ప్రాంతంలో లుటియన్స్ ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్నిప్రమాదం తర్వాత కాలిన నోట్ల కట్టలు పెద్ద ఎత్తున బయటపడ్డాయని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం, ఢిల్లీ హైకోర్టు.. జస్టిస్ వర్మకు న్యాయపరమైన విధులు కేటాయించకుండా వరుస ఆదేశాలు జారీ చేశాయి.

విచారణ కోసం సీజేఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి న్యాయపరమైన విధులనూ అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయను ఆయన కోరారు. జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరికిందని ఆరోపిస్తూ ఫొటోలు, వీడియోలతో సహా అంతర్గత విచారణ నివేదికను ఈనెల 22న సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఈనెల 14న అగ్ని ప్రమాదంలో జస్టిస్ వర్మ ఇంటిలోని స్టోర్‌రూమ్‌లో దొరికినట్టుగా చెప్పబడుతున్న నగదు ఫోటోలు, వీడియోలు ఈ నివేదికలో ఉన్నాయి. కాగా, నగదు దొరికిన విషయాన్ని జస్టిస్ వర్మ, ఆయన కుటుంబ సభ్యులు ఖండించిన విషయం తెలిసిందే. ఆ నగదు తమదేనన్న ఆరోపణలనూ వారు బలంగా తోసిపుచ్చారు. దీనిని కుట్రగా జస్టిస్ వర్మ అభివర్ణించారు.

జస్టిస్ యశ్వంత్ వర్మకు షాక్
న్యాయపరమైన విధులు అప్పగించని ఢిల్లీ హైకోర్టు

జస్టిస్ యశ్వంత్ వర్మకు మరొక షాక్ తగిలింది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకున్నది. ఆయన జ్యుడీషియల్ వర్క్‌ను తక్షణమే ఉపసంహరించుకున్నది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ నిర్ణయం అమలులో ఉంటుందని వివరించింది. అలాగే, యశ్వంత్ వర్మ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-3 కోర్ట్ మాస్టర్.. ఆ రోజు చేపట్టాల్సిన విషయాలలో తేదీలను ఇస్తారని పేర్కొన్నది.

ఎన్నికల్లో మనీ గేమ్

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తాయో ఈ అధ్యయనం బయట పెట్టింది. ఆదాయంలోనే కాదు..ఖర్చులోనూ అధికార బీజేపీదే పైచేయి. అధికార గణాంకాల అధ్యయనం ప్రకారం కేవలం 22 పార్టీలు రూ.18,742.31 కోట్లు ఖర్చు చేశాయి. వీటిలో ఆమ్‌ఆద్మీ, అసోం గణపరిషత్, అన్నా డీఎంకే, మజ్లిస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేడీ, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ (ఎం), డీఎంకే, కాంగ్రెస్, జేడీఎస్, జేడీయూ, ఎల్జేపీ (రాం విలాస్), ఆర్జేడీ, సమాజ్‌వాదీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, సిక్కిం క్రాంతికారి మోర్చ, టీడీపీ, వైసీపీ ఉన్నాయి. ఇవన్నీ ఎన్నికల కోసం రూ.3,861.57 కోట్లు ఖర్చు చేయగా ఒక్క బీజేపీయే రూ.1,737.68 కోట్లు...అంటే మొత్తం వ్యయంలో 45 శాతం ఖర్చు చేసింది. అన్ని పార్టీలకూ కలిపి రూ.7,416.31 కోట్లు విరాళాల రూపంలో అందగా అందులో 84.5 శాతం ఒక్క బీజేపీ ఖాతాకే చేరాయి. కేవలం ఏడు పార్టీలు అందజేసిన వివరాల ప్రకారం ప్రింట్, టీవీ, డిజిటల్ వేదికల ద్వారా మీడియా ప్రకటనల కోసం రూ.992.48 కోట్లు, సోషల్ మీడియా, వర్చువల్ ప్రచారం కోసం రూ.196.23 కోట్లు ఖర్చు చేశారని సీహెచ్‌ఆర్‌ఐ డైరెక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల హెలికాప్టర్, ప్రయివేటు జెట్ల ప్రయాణాలకు రూ.830.15 కోట్లు ఖర్చయ్యాయి.

ఇక బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి నిమిత్తం రూ.398.49 కోట్లు ఖర్చు చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు నగదు ఎలా లభించింది అని అడిగిన ప్రశ్నకు వెంకటేష్ నాయక్ సమాధానమిస్తూ 'జవాబు దొరకని ప్రశ్నలు అనేకం ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీల ఖాతాలలో రూ.14.848.46 కోట్లు నిల్వ ఉన్నాయి. ఈ అదనపు సొమ్ము ఎక్కడికి పోతుంది? బీజేపీ సహా ఆరు పార్టీల వద్ద ఎన్నికల ప్రారంభంలో కంటే ముగిసిన తర్వాతే ఎక్కువ సొమ్ము ఉంది. ఇది ఎలా సాధ్యం? సీపీఐ, జేఎంఎం, శివసేన, శిరోమణి అకాలీదళ్ సహా అనేక పార్టీలు తమ ఖర్చుల వివరాలే ఇవ్వలేదు' అని చెప్పారు.

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలపై
చర్చకు బీజేపీ అడ్డగింత

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ లోక్‌సభలో తీవ్ర గందరగోళం సృష్టించింది. న్యాయమూర్తి ఇంటి నుంచి 'కరెన్సీ నోట్ల' ను కనుగొనడం సహా ముఖ్యమైన అంశాలపై చర్చ జరగకుండా నిరోధించడానికి బీజేపీ ఉనికిలో లేని అంశాలను రెచ్చగొడుతోందని ప్రతిపక్షం విమర్శించింది. ప్రతిపక్ష సభ్యులు పాలకపక్షమే పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేయడాన్ని కొత్త ధోరణిగా విమర్శించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ తో సహా ఇతర ప్రతిపక్ష ఎంపీలు నోటీసు జారీ చేశారు. రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్, సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేలతో దీనిపై చర్చించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం, న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో నేరాలు పెరుగుతున్నాయని నిరసిస్తూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఈ ఉదయం లోక్‌సభకు పోస్టర్లతో రావడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు సభకు పోస్టర్లను తీసుకురావద్దు.

దయచేసి సహకరించండి. సభలో పోస్టర్లను చూపిస్తే..నేను మీపై చర్యలు తీసుకోవలసి వస్తుంది" అని ఆయన అన్నారు. పార్లమెంటును వాయిదా వేసేందుకు బీజేపీ "పూర్తిగా తప్పుడు" అంశాన్నీ ముందుకు తెచ్చిందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేశ్ దుయ్యబట్టారు. "బీజేపీ సభ్యులు సభను నడపకూడదని నిర్ణయించుకున్నట్టు కనిపిస్తోంది. చాలా రోజులుగా ఏదో ఒక సాకును వెతుక్కుంటూ (గందరగోళం సృష్టించడానికి) తిరుగుతున్నారు " అని వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. సభ వాయిదా పడిన అనంతరం ఆమె పార్లమెంట్ ఎదుట మీడియాతో మాట్లాడారు.



26 నుంచి జాతీయ కరాటే పోటీలు

హైదరాబాద్ : జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలు ఈ నెల 26 నుంచి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభం కానున్నాయి. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు పారా మిలటరీ జట్లు 49 విభాగాల్లో నేషనల్ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడనున్నాయి. అథ్లెట్లు, కోచ్‌లు, టెక్నికల్ సిబ్బంది సహా 1500 మంది ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొననున్నారు. బుధవారం నుంచి పోటీలు షురూ అవనుండగా.. గురువారం జరిగే ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారు. శనివారం జరిగే ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహక కమిటీ చైర్మెన్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నుంచి పూర్తి సహకారం అందిస్తామని శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి తెలిపారు.

ఐపీఎల్ హంగామా విశాఖ తీరానికి చేరింది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌తో తీరం పరుగులతో పోటెత్తింది. లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత 209/8 పరుగుల భారీ స్కోరు నమోదు చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ 19.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఛేదనలో ఆషుతోశ్ శర్మ (66 నాటౌట్) అజేయ అర్థ సెంచరీతో అదరగొట్టాడు.

క్యాపిటల్స్ బోణీ

- ఛేదనలో ఆషుతోశ్, విప్‌రాజ్ జోరు
- సూపర్‌జెయింట్స్‌పై ఢిల్లీ గెలుపు
- లక్నో 209/8 , ఢిల్లీ 211/9

నవతెలంగాణ-విశాఖపట్నం

లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క వికెట్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. సోమవారం విశాఖపట్నంలో జరిగిన ఐపీఎల్18 మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. ఆషుతోశ్ శర్మ (66 నాటౌట్, 31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో మెరువగా.. విప్‌రాజ్ నిగమ్ (39, 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. ట్రిస్టన్ స్టబ్స్ (34, 22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (22, 11 బంతుల్లో 3 ఫోర్, 1 సిక్స్) రాణించారు. 65/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న క్యాపిటల్స్‌ను విప్‌రాజ్, ఆషుతోశ్ జంట గెలుపు తీరాలకు చేర్చింది. 19.3 ఓవర్లలో క్యాపిటల్స్ 211/9 పరుగులు చేసింది. అంతకుముందు, మిచెల్ మార్ష్ (72, 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (75, 30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో రాణించగా లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది.

దంచికొట్టారు :

ఐపీఎల్18లో రెండో సొంత మైదానం విశాఖలో టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. లక్నో ఓపెనర్లు ఎడెన్ మార్‌క్రామ్ (15, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (72) మంచి ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 28 బంతుల్లో 46 పరుగులు జోడించారు. ఓ సిక్సర్, ఫోర్‌తో ఊపందుకున్న మార్‌క్రామ్ పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయాడు. నికోలస్ పూరన్ (75)తో జతకలిసిన మిచెల్ మార్ష్.. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 87 పరుగులు పిండుకుంది. ఓవర్‌కు పదికి పైగా రన్‌రేట్‌తో దంచికొట్టిన మార్ష్, పూరన్‌లు లక్నోను 250ప్లస్ స్కోరు దిశగా నడిపించారు. మార్ష్ ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 21 బంతుల్లో అర్థ సెంచరీ సాధించగా.. నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 24 బంతుల్లో పూరన్ ఫిఫ్టీ నమోదు చేశాడు.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు డెత్ ఓవర్ల ముంగిట బలంగా పుంజుకున్నారు. 38 బంతుల వ్యవధిలో 6 వికెట్లు పడగొట్టి సూపర్‌జెయింట్స్ జోరుకు కళ్లెం వేశారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పేసర్ మిచెల్ స్టార్క్‌లు వికెట్ల వేటలో సఫలం అయ్యారు. మిడిల్ ఆర్డర్‌లో ప్రమాదకర బ్యాటర్ రిషబ్ పంత్ (0) లక్నో తరఫున తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల ఖాతా తెరువలేదు. ఆరు బంతులు ఆడిన పంత్.. కుల్దీప్ ఓవర్లో నిష్క్రమించాడు. ఆయుశ్ బదాని (4), శార్దుల్ ఠాకూర్ (0), షాబాజ్ అహ్మద్ (9) నిరాశపరిచారు. డెవిడ్ మిల్లర్ (27 నాటౌట్) మరో ఎండ్‌లో ధనాధన్ జోరు చూపించాడు. ఇన్నింగ్స్ ఆఖరు రెండు బంతులను సిక్సర్లుగా బాది లక్నో స్కోరు 200 మార్క్ దాటించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మోహిత్ శర్మ, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్‌లకు వికెట్లు దక్కలేదు.



ముగ్గురికే గ్రేడ్-ఏ కాంట్రాక్టు

16 మందికి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు



ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 16 మంది మహిళా క్రికెటర్లకు వార్షిక సెంట్రల్ కాంట్రాక్టులు అందించింది. అందులో ముగ్గురు క్రికెటర్లకు మాత్రమే గ్రేడ్-ఏ కాంట్రాక్టు దక్కింది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు ప్రకారం గ్రేడ్-ఏ ప్లేయర్లకు రూ.50 లక్షలు, గ్రేడ్-బి ప్లేయర్లకు రూ.30 లక్షలు, గ్రేడ్-సి ప్లేయర్లకు రూ.10 లక్షల వార్షిక వేతనం అందనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతీ మంధాన, దీప్తి శర్మలకు గ్రేడ్-ఏ కాంట్రాక్టు దక్కగా.. రేణుకా ఠాకూర్, జెమీమా, రిచా ఘోష్, షెఫాలీ వర్మలకు గ్రేడ్-సి కాంట్రాక్టు.. యస్తికా భాటియా, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, అమన్జోత్ కౌర్, ఉమా చెత్రీ, స్నేహ్ రానా, పూజ వస్త్రాకర్‌లకు గ్రేడ్-సి కాంట్రాక్టు లభించింది. శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, ఉమ, అమన్జోత్‌లకు కొత్తగా కాంట్రాక్టు ఇవ్వగా.. రాజేశ్వరి గైక్వాడ్, హర్లీన్ డియోల్, మేఘన సింగ్, దేవిక వైద్య, అంజలీ తమ కాంట్రాక్టులు కోల్పోయారు. ఈ మేరకు మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ, చీఫ్ కోచ్ అమోల్ ముజుందార్ సిఫారసు చేసిన జాబితాకు బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఈ కాంట్రాక్టు అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు వర్తిస్తుంది.



ఏవైసీఏ అలవోక విజయం

టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ

హైదరాబాద్ : టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీలో అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఏవైసీఏ) అలవోక విజయం సాధించింది. తెలంగాణ రూరల్ పాంథర్స్‌పై 104 పరుగుల తేడాతో గెలుపొందింది. జాంబ్ (57), తనుశ్ (41) రాణించగా తొలుత ఏవైసీఏ 50 ఓవర్లలో 9 వికెట్లకు 242 పరుగులు చేసింది. ఛేదనలో పాంథర్స్ 27 ఓవర్లలోనే కుప్పకూలింది. ఏవైసీఏ బౌలర్ రిత్విక్ (4/19), శ్రేయాన్స్ (2/12) మెరవటంతో పాంథర్స్ 138 పరుగులకే ఆలౌటైంది. పాంథర్స్ బ్యాటర్ శాండీ (70) ఒంటరి పోరాటం చేశాడు. మరో మ్యాచ్‌లో రైజర్స్ 33.5 ఓవర్లలో 167/10 పరుగులు చేయగా.. వారియర్స్ 31.2 ఓవర్లలోనే 168/6తో ఛేదించి 4 వికెట్లతో గెలుపొందింది. అంతకుముందు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్లూ టైగర్స్‌కు సవాల్

బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ నేడు



షిల్లాంగ్ (మేఘాలయ) : భారత ఫుట్‌బాల్ కొత్త సీజన్ సవాల్‌కు సిద్ధమైంది. ఏడాదిన్నరకు పైగా గెలుపు లేకుండా సాగిన భారత సాకర్ జట్టు ప్రయాణం.. సూపర్‌స్టార్ సునీల్ ఛెత్రీ రీ ఎంట్రీతో ముగిసింది. గత వారం జరిగిన మ్యాచ్‌లో మాల్దీవులపై 3-0తో గెలుపొందిన భారత్ అదే ఉత్సాహంతో నేడు ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయింగ్ గ్రూప్-సి పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. సునీల్ ఛెత్రి, లిస్టన్ కొలాకోలు గోల్స్ వేటలో ముందుండి నడిపిస్తున్నారు. ఫార్వర్డ్ ఛెత్రి, మిడ్ ఫీల్డర్ లిస్టన్‌లు పాదరసంలా కదులుతూ ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తున్నారు. కానీ బంగ్లాదేశ్ తరఫున ఇంగ్లాండ్ సాకర్ ప్రొఫెషనల్ హమ్జా చౌదరి అరంగేట్రం చేయనున్నాడు. దక్షిణాసియా జట్టు తరఫున ఓ హై ప్రొఫైల్ ఆటగాడు బరిలోకి దిగటం ఇదే తొలిసారి. ఏమాత్రం ఒత్తిడికి గురి కాని, ప్రత్యర్థి బలానికి బెదరని ఆటగాడు హమ్జా. నేడు ఛెత్రి, లిస్టన్ జంట హమ్జాను నిలువరించి భారత్‌ను విజేతగా నిలబెడతారా? చూడాలి. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ఆరంభం కానుండగా.. స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతుంది.

ప్రీ క్వార్టర్స్‌లో స్వైటెక్

మియామి ఓపెన్ 2025



మియామి (యుఎస్‌ఏ) : మాజీ చాంపియన్, స్టార్ ప్లేయర్ ఇగా స్వైటెక్ (పోలాండ్) మియామి ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. బెల్జియం అమ్మాయి ఎలిసె మెర్టెన్స్‌పై 7-6(7-2), 6-1తో స్వైటెక్ వరుస సెట్లలో విజయం సాధించింది. ఆరు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిసిన స్వైటెక్ పాయింట్ల పరంగా 78-63తో పైచేయి సాధించింది. ఇండియన్‌వెల్స్ ఓపెన్ విజేత మిర్రా అండ్రీవ (రష్యా) 6-7(5-7), 6-2, 3-6తో అమెరికా అమ్మాయి చేతిలో ఓటమిపాలైంది. నాల్గో సీడ్ పెగులా 6-7(3-7), 6-2, 7-6(7-2)తో అనాపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్ 6-1, 7-6(6-1)తో అర్జెంటీనా ఆటగాడిపై అలవోక విజయం సాధించాడు. కాస్పర్ రూడ్ 6-4, 7-6(7-4)తో.. మోన్‌ఫిల్స్ 7-5, 5-7, 7-6(7-1)తో గెలుపొంది ముందంజ వేశారు.

ఆ రూల్ అవసరం లేదు!

ఇంపాక్ట్ ప్లేయర్‌పై ఎం.ఎస్ ధోని



చెన్నై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చర్చనీయాంశంగా మారిన రూల్ ఇంపాక్ట్ ప్లేయర్. మ్యాచ్ గతినే మార్చివేస్తున్న ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో దాదాపు ప్రతి జట్టు 12 మందితో బరిలోకి దిగుతోంది. అవసరాని అనుగుణంగా బౌలర్, బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా జట్లు ఆడిస్తున్నాయి. రెండు సీజన్లుగా ఐపీఎల్‌లో ఈ రూల్ కొనసాగుతుంది. క్రికెటర్లు, మాజీ ఆటగాళ్లు సహా విశ్లేషకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. చెన్నై సూపర్‌కింగ్స్ మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ రూల్ అవసరం లేదని వ్యాఖ్యానించాడు. 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ గురించి తొలిసారి విన్నప్పుడు.. ఐపీఎల్ మంచిగా సాగుతోంది. టీఆర్‌పీ రేటింగ్స్ ఎక్కువగా ఉన్నాయి. క్రికెట్ క్వాలిటీ సూపర్‌గా ఉంది. మంచి ఆటగాళ్లు లీగ్ నుంచి పుట్టుకొస్తున్నారు. ఇలాంటి సమయంలో ఈ రూల్ అవసరం లేదు. కానీ అమలు చేశారు. నిజానికి ఓ రకంగా ఇది ఉపయుక్తమే. కానీ నేను వికెట్ కీపింగ్ చేయాల్సి ఉంటుంది. అందుకే నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా రాలేను' అని ధోని తెలిపాడు.

తమీమ్‌కు గుండె సర్జరీ

మైదానంలో కుప్పకూలిన బంగ్లా స్టార్



ఢాకా : బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, వెటరన్ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ ఢాకా ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) మ్యాచ్‌లో గుండెపోటుకు గురయ్యారు. డీపీఎల్‌లో మహ్మదన్ స్పోర్టింగ్ క్లబ్‌కు సారథ్యం వహిస్తున్న తమీమ్.. ఓ ఓవర్ ఫీల్డింగ్ చేసిన అనంతరం గుండెనొప్పితో మైదానం వీడాడు. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా తమీమ్‌కు అత్యవసరంగా ఏంజియోప్లాస్టీ హృదయ శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, అయినా కరోనరీ కేర్ యూనిట్ (సీసీయు) పర్యవేక్షణలో ఉంచారని... కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లతో మాట్లాడినట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వర్గాలు తెలిపాయి.



భిన్న కాంబినేషన్‌లో నయా సినిమా షురూ..

హీరో వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్ ఇండో-కొరియన్ హర్రర్ -కామెడీతో సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. వరుణ్ తేజ్ పుట్టినరోజున అనౌన్స్ చేసిన ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఎగ్జైటింగ్ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

థ్రిల్లింగ్, హిలేరియస్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని హామీ ఇచ్చింది. యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణంలో తమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రం వరుణ్ తేజ్ కెరీర్‌లో ఒక ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌గా కాబోతోంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమంలో హీరోయిన్ రితిక నాయక్‌తో పాటు టీం సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా సోమవారం నుంచే హైదరాబాద్‌లో స్టార్ట్ కానుంది.

నవ్వించడమే లక్ష్యంగా తీసిన చిత్రం



'మ్యాడ్ విజయానికి కారణం వినోదం. అదే మా బలం. దానిని దృష్టిలో పెట్టు కొని పూర్తి వినోద భరిత చిత్రంగా 'మ్యాడ్ స్క్వేర్'ను తెరకెక్కించాం. అలాగే ఈ సినిమాలో కామెడీ పూర్తిగా కొత్తగా ఉంటుంది' అని అంటున్నారు కథానాయకులు నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్. ఈ ముగ్గురు నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి ఇది సీక్వెల్. కళ్యాణ్ శంకర్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా ఈనెల 28న విడుదల కానున్న నేపథ్యంలో హీరోలు నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఈ చిత్రానికి మెయిన్ హీరో ఎవరు?

- వినోదమే ఈ సినిమాకి మెయిన్ హీరో. ఆ వినోదమే 'మ్యాడ్ స్క్వేర్'ని నడిపిస్తుంది. 'మ్యాడ్'తో పోలిస్తే ఇందులో కామెడీ ఎక్కువ ఉంటుంది. అలాగే పాత్రలు కూడా ఎక్కువ వినోదాన్ని పంచుతాయి.

నిర్మాత నాగవంశీ ఈ సినిమాలో కథ లేదన్నారు కదా?

- 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' లాంటి సినిమాల నుంచి కథ ఆశించాలి. ఇది నవ్వించడమే లక్ష్యంగా తీసిన సినిమా. అందుకే పెద్ద కథ ఉంటుందని ఆశించకుండా, సరదాగా నవ్వుకోవడానికి రండి అని నిర్మాత నాగవంశీ చెప్పారు. అలాగే ఒక సినిమా మనం ఏ ఉద్దేశంతో చేశామనేది ముందే ప్రేక్షకులకు తెలిసేలా చేస్తే మంచిది. ఇది నవ్వించడానికి తీసిన సినిమా కాబట్టి, ఆ అంచనాలతో ప్రేక్షకులు థియేటర్లకు రావాలనే ఉద్దేశంతో అలా చెప్పారు.

సినిమాలో హీరోయిన్ పాత్రలు ఉంటాయా?

- మొదటి భాగానికి కొనసాగింపుగా వారి పాత్రలు మా జీవితాల్లో ఉంటాయి. కానీ, వారు తెర మీద కనిపించరు.

కుటుంబ ప్రేక్షకులు చూసేలా సినిమా ఉంటుందా?

- మొదటి పార్ట్ సమయంలో కూడా ఇలాంటి అనుమానాలే వ్యక్తమయ్యాయి. కానీ, సినిమా విడుదలైన తర్వాత కుటుంబ ప్రేక్షకులు ఎంతో ఆదరించారు. దీన్ని కూడా కూడా క్లీన్ కామెడీ ఫిల్మ్‌గానే రూపొందించాం.

లడ్డు పాత్ర ఎలా ఉండబోతుంది?

- 'మ్యాడ్'లో కంటే ఇందులో లడ్డు పాత్ర మరింత కామెడీగా ఉంటుంది. మేము ముగ్గురం కలిసి లడ్డుని ఫుల్‌గా ఆడుకుంటాం.

దర్శకుడు కళ్యాణ్ శంకర్ గురించి?

- చాలా హ్యూమర్ ఉన్న పర్సన్. ఈ సినిమాలోనూ పడిపడి నవ్వేలా సీన్స్ క్రియేట్ చేశారు. ఆయనకు మంచి గుర్తింపు తీసుకొచ్చే సినిమా అవుతుంది. ఆయనతో మళ్ళీ సినిమాలు చేయాలని ఉంది.

'మ్యాడ్' ఫ్రాంచైజ్ కంటిన్యూ చేస్తారా?

- చేస్తే బాగుంటుంది. కానీ, వెంటనే కాకుండా కొంత విరామం ఇచ్చి చేస్తే బాగుంటుంది అనుకుంటున్నాం.

నవచిత్రం

ఆ 20 నిమిషాల తర్వాత..



వెంకీ కుడుముల

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకీ కుడుముల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇందులో హీరో మాన్యుపులేటర్. ఫిజికల్ స్ట్రెంత్ కంటే మెంటల్ స్ట్రెంత్ స్ట్రాంగ్ అని నమ్మే పర్సన్. సినిమాలో ఫస్ట్ 20 మినిట్స్ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ చేయడానికి చేసిన రకరకాల గెటప్స్ అలరిస్తాయి. 20 నిమిషాల తర్వాత కథ మారిపోతుంది. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నితిన్ కెరీర్‌లో, నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని నమ్మకం ఉంది. సినిమా అంతా రెగ్యులర్ ఇంట్రవెల్స్‌లో ఫన్ ఉంటుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ ఎంటర్టైనర్ ఇది.

- ఒక క్యామియో రోల్ ఇంటర్నేషనల్ స్టార్ చేస్తే బాగుంటుందని అనుకున్నాను. నిర్మాతలు ఎవరని అడిగినప్పుడు డేవిడ్ వార్నర్ అని చెప్పాను. నాకు క్రికెట్ చాలా ఇష్టం. అలాగే డేవిడ్ వార్నర్ ఆట కూడా ఇష్టం. అయితే ఇది సాధ్యమవుతుందని అనుకోలేదు. నిర్మాత రవి చాలా సీరియస్‌గా ట్రై చేసి, మీటింగ్ అరేంజ్ చేశారు. నేను చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. వార్నర్‌ని ఢిల్లీలో కలిసి ప్రజెంటేషన్ ఇచ్చాను. ఆయన కూడా చాలా ఎగ్జైట్ అయ్యారు.

- ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్‌ది చాలా ఇంపార్టెంట్ రోల్. ఆయన సెక్యూరిటీ ఏజెన్సీ నడుపుతుంటారు. ఆయన్ని హీరో మాన్యుపులేట్ చేసి ఓ సీరియస్ వరల్డ్‌లోకి తీసుకెళ్తాడు. ఆయన అమాయకంగా అందులో ఇరుక్కుపోతాడు. టాలెంట్ ఉండడం వేరు. టాలెంట్ ఉందని ఊహించుకోవడం వేరు. ఇందులో శ్రీలీల క్యారెక్టర్ రెండో టైపు(నవ్వుతూ). వెరీ ఇంటలెక్చువల్ అనుకునే అమ్మాయి. చాలా ఫన్నీగా ఉంటుంది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఎంటర్టైన్మెంట్ ఉంటుంది.

- మ్యూజిక్ డైరెక్టర్ జీవి ప్రకాష్‌తో వర్క్ చెయ్యాలని ఎప్పటినుంచో ఉంది. ఆయన కరెక్ట్ టైంకి మ్యూజిక్ డెలివరీ చేసే కంపోజర్. ఇప్పటికే పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. బీజీఎం కూడా అద్భుతంగా చేశారు.

- 'భీష్మ' తర్వాత చిరంజీవితో సినిమా చేసే ఛాన్స్ మిస్సయ్యింది. అయితే - డెఫినెట్‌గా ఆయనతో సినిమా చేస్తాను (నవ్వుతూ).

అందమైన ప్రేమకథ



నవీన్ చంద్ర

'పొలిమేర' చిత్ర విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన సినిమా '28^{0}C'. ఏప్రిల్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.


నవీన్ చంద్ర హీరోగా నటించగా, షాలినీ వడ్నికట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మించారు. సోమవారం ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత సాయి అభిషేక్ మాట్లాడుతూ, 'మా సినిమాను ఓటీటీ కంటే బిగ్ స్క్రీన్ మీదకు తీసుకురావాలనే పట్టుదలగా ఉన్నాం. నా కో ప్రొడ్యూసర్స్ కూడా సపోర్ట్ చేశారు. మేమంతా వెయిట్ చేసి ఎట్టకేలకు థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నాం. సినిమాను థియేటర్స్‌లో చూసిన ఫీల్ వేరుగా ఉంటుంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చి, మా ఎఫర్ట్స్‌కు మంచి రిజల్ట్ ఇస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'దర్శకుడిగా నేను చేసిన తొలి సినిమా ఇది. ఇదొక బ్యూటీఫుల్ లవ్ స్టోరీ. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. హీరో హీరోయిన్స్ జంట మధ్య అనుకోని ఓ సమస్య వస్తే, దానిని వారు ఎలా ఫేస్ చేశారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా చివరి 20 నిమిషాలు మీరు ఎక్స్‌పెక్ట్ చేయలేరు. అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమాను చూసిన నా ఫ్రెండ్ వంశీ నందిపాటి ఇంతమంచి మూవీని రిలీజ్ చేయకుండా ఎలా ఉన్నారని అడిగి, తనే రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చారు' అని డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ చెప్పారు.

హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ,'డాక్టర్స్ అయిన ఓ జంట ప్రేమ కథ ఇది. 28^{0}C లోనే హీరోయిన్ క్యారెక్టర్‌ను ఉంచాలి లేకుంటే తనకు ప్రాబ్లెమ్ అవుతుంది. ఈ పాయింట్ విన్నప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది' అని అన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..



భీమగాని సుధాకర్ గౌడ్

'ఆదిత్య', 'విక్కీస్ డ్రీమ్', 'డాక్టర్ గౌతమ్' వంటి సందేశాత్మక బాలల చిత్రాలతో ప్రశంసలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్.

శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్ పై ఆయన రూపొందిస్తున్న మరో బాలల చిత్రం 'అభినవ్'.

ఈ సినిమాను చిల్డ్రన్స్ డే సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, 'మన సమాజానికి జాడ్యంలా పట్టుకున్న డ్రగ్స్ భూతం విద్యార్థులనూ వదలడం లేదు. డ్రగ్ మాఫియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మన దేశాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తోంది. ఇందులో అంతర్జాతీయ కుట్ర కోణం కూడా ఉండొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి మాఫియా బాగా పెరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాతయ్య నారాయణరావు స్ఫూర్తితో అభినవ్ అనే సాహస బాలుడు ఈ గంజాయి మాఫియా ఆట ఎలా కట్టించాడు అనేది ఈ చిత్రంలో చూడబోతున్నారు. తన స్నేహితులతో కలిసి అభినవ్ చేసిన సాహసాలు ఆకట్టుకుంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత సమాజం కోసం సినిమా వాళ్ల చిన్న వీడియో చేయాలని కోరారు. నా వంతుగా ఈ సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించాను. ఎన్‌సీసీ, స్కౌట్స్, యోగ, ధ్యానం నేర్చుకోవడం ద్వారానే పిల్లలు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండగలరు. మన దేశం ఆర్థికంగా వెనకబాటుకు పిల్లల్లో అక్షరాస్యత లేకపోవడం కూడా కారణం. పిల్లలను బాగా చదివించడం ద్వారా మన దేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చు. ఇలాంటి అంశాలన్నీ అభినవ్ చిత్రంలో చూపిస్తున్నాం' అని తెలిపారు.

'ఓ భామ అయ్యో రామ'

సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ కథానాయిక మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు.

రామ్ గోదాల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. వేసవిలో ఎంటర్‌టైన్‌చేయనున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం మేకర్స్ విడుదల చేశారు మేకర్స్.

ఈ సందర్భంగా నిర్మాత హరీష్ మాట్లాడుతూ, 'పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది' అని అన్నారు.



సుహాస్, మాళవిక మనోజ్

'తెలుగులో ఓ మంచి సినిమాతో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది' అని హీరోయిన్ మాళవిక చెప్పారు.

దర్శకుడా రామ్ గోదాల మాట్లాడుతూ, 'మణికందన్ తన ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు. రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరు పాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి' అని తెలిపారు.

హీరో సుహాస్ మాట్లాడుతూ, 'సాంగ్స్ చాలా బాగుంటాయి. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా చాలా క్వాలిటీగా తీశారు. సినిమాలో ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. లవ్‌స్టోరీ కొత్తగా ఉంటుంది. దర్శకుడు ఈ సినిమాని అందరికి నచ్చేలా తెరకెక్కించారు' అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్పిరిట్ మీడియా ప్రవీణ్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్, మణికందన్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



ఎంఎస్ఎంఈల టర్నోవర్ పరిమితి రెట్టింపు

- పెట్టుబడుల పరిమితిలోనూ మార్పులు

న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)ల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నూతన విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో సూక్ష్మ సంస్థల పెట్టుబడుల పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.2.5 కోట్లకు పెరిగింది. వీటి టర్నోవర్‌ను కూడా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు చేర్చింది. చిన్న సంస్థల పెట్టుబడులను రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పెంచింది. వీటి టర్నోవర్‌ను రూ.50 కోట్ల నుంచి రెట్టింపు చేసి రూ.100 కోట్లకు చేర్చింది. రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకు పెట్టుబడులను కలిగిన వాటిని మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తింపు. వీటి టర్నోవర్‌ను రెట్టింపు చేసి రూ.500 కోట్లకు పెంచింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ నిర్మలా సీతారామన్ ఎంఎస్ఎంఈల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు తెస్తున్నామని చెప్పారు. పెట్టుబడుల పరిమితిని 2.5 రెట్లు, టర్నోవర్ రెట్టింపు చేయనున్నట్లు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఎంఎస్ఎంఈలకు సంబంధించి నూతన విధానానికి ఆమోదం తెలిపింది.

బీమాపై 5 శాతం జీఎస్టీ.!



న్యూఢిల్లీ : ఆరోగ్య జీవిత బీమా పాలసీలపై భారంగా ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీమాపై అధిక పన్ను రేటు ఈ రంగానికి ప్రతికూలంగా ఉండటంతో పాటుగా పాలసీదారులపై తీవ్ర భారం పడుతోంది. దీన్ని తగ్గించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. దీనిపై ఎట్టకేలకు అడుగు ముందుకు పడుతోన్నట్లు సమాచారం. త్వరలో జరగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో బీమాపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలను జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయించడానికి తాము అనుకూలంగా లేమని.. అయితే పన్ను రేట్లు తగ్గించాలని భావిస్తున్నామని జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందంలోని ఓ సభ్యుడు పేర్కొన్నారు. మెజారిటీ సభ్యులు దీనికి అనుకూలంగా ఉన్నారన్నారు. మరోవైపు బీమా సంస్థలు సైతం జీఎస్టీ పూర్తి రద్దును వ్యతిరేకిస్తున్నాయని.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందడానికి అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోన్నాయి. ఏప్రిల్ నెలాఖరులో గానీ, మే నెలలో గానీ జరగనున్న తదుపరి జీఎస్టీ కౌన్సిల్ భేటీలో బీమాపై పన్ను రేట్ల తగ్గింపునపై స్పష్టత రానుందని సమాచారం.

కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.105 కోట్ల డిమాండ్ నోటీసులు

న్యూఢిల్లీ : రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఆర్ఈఎల్) అనుబంధ సంస్థ అయిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.104.77 కోట్ల డిమాండ్ నోటీసులు అందించింది. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఈ నోటీసులు అందుకున్నట్లు సోమవారం ఆ కంపెనీ వెల్లడించింది. ముంబయిలోని సెంట్రల్ సర్కిల్ 6(2)లోని ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం ఈ నోటీసులను జారీ చేసిందని ఆర్ఈఎల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

జీఎస్ఎంఏ బోర్డు నూతన ఛైర్మన్‌గా గోపాల్ విట్టల్



న్యూఢిల్లీ : జీఎస్ఎంఏ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల నూతన ఛైర్మన్‌గా భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన వైస్ ఛైర్మెన్, ఎండీ గోపాల్ విట్టల్ నియమితులయ్యారు. దీంతో ఆ పరిశ్రమ బాడీ అనుసరించాల్సిన అంతర్జాతీయ ఎత్తుగడలు, విధానాలకు సంబందించిన నిర్ణయాలను విట్టల్ కీలకంగా వ్యవహరించనున్నారు. జీఎస్ఎంఏ బోర్డు ఛైర్మెన్ బాధ్యతలు తీసుకున్న భారతీయుల్లో సునీల్ భారతీ మిట్టల్ తర్వాత రెండవ వ్యక్తిగా గోపాల్ విట్టల్ నిలిచారు. ప్రపంచంలోని టెలికం కంపెనీలకు చెందిన ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఇంటర్నెట్ కంపెనీలు తదితర వాటికి చెందిన 1.000కి పైగా కంపెనీలు జీఎస్ఎంఏ బాడీలో భాగస్వామ్యం కలిగి ఉన్నాయి.

అమెజాన్‌లో పలు ఉత్పత్తులపై సెల్లర్ ఫీజు రద్దు

న్యూఢిల్లీ : దిగ్గజ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియాన తన వేదికపై విక్రయించే 135 కేటగిరీలకు చెందిన రూ.300 కంటే తక్కువ విలువ కలిగిన 1.2 కోట్ల ఉత్పత్తులకు సెల్లర్ ఫీజును (రిఫరల్ ఫీజు) రద్దు చేసింది. ఏప్రిల్ 7 నుంచి ఇది అమల్లోకి రానుందని ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. వీటిపై ఇప్పటి వరకు కేటగిరీని బట్టి 2 శాతం నుంచి 16 శాతం వరకు ఫీజు వసూలు చేసింది.

'ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్' ఆఫర్లు..

మార్చి 21 నుంచి 26 వరకు 'ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్' పేరుతో పలు ఉత్పత్తులపై ఆఫర్లను అందిస్తున్నట్లు అమెజాన్ తెలిపింది. పలు ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఉత్పత్తులపై 75 శాతం వరకు ఆదా, పలు బ్యాంక్ కార్డులపై 7.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, సేవింగ్స్‌ను పొందవచ్చని ఆ కంపెనీ ప్రతినిధి జెబా ఖాన్ తెలిపారు.

సెన్సెక్స్ 1078 పాయింట్ల వృద్ధి

- ఆరో రోజూ మార్కెట్ల ఉరకలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో ఆరో రోజూ పరుగులు పెట్టాయి. సోమవారం సెషన్‌లో బ్యాంకింగ్ షేర్ల మద్దతుతో మార్కెట్లు భారీ లాభాలను ఆర్జించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1078.87 పాయింట్లు లేదా 1.40 శాతం పెరిగి 77,984.38కి చేరింది. ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర లాభపడి 78,107 గరిష్ట స్థాయిని తాకింది. చాలా రోజుల తర్వాత 78 వేల పాయింట్ల మార్క్‌ను తాకడం విశేషం. ఎన్ఎస్ఈ నిఫ్టీ 307.95 పాయింట్లు లేదా 1.32 శాతం రాణించి 23,658.35 వద్ద ముగిసింది. ఎఫ్ఐఐల కొనుగోళ్లు, చాలా నెలలుగా పతనమైన షేర్లు తక్కువ ధర వద్ద ఆకర్షణీయంగా ఉండటంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది. సెన్సెక్స్ 30లో 24 సూచీలు లాభాల్లో ముగిశాయి.

బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.418 లక్షల కోట్లకు చేరింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా, ఎస్బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.

సామ్‌సంగ్ ఉత్పత్తులపై 48 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ డిజిటల్ ఉపకరణాలపై ప్రత్యేక పండుగ ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఇందులో భాగంగా 48 శాతం వరకు తగ్గింపు, రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్‌తో వినియోగదారులు వారి ఇళ్ళను ఆధునిక టెక్నాలజీ ఉత్పత్తులతో అప్‌గ్రేడ్ చేసుకోవడానికి వీలుకల్పిస్తోన్నట్లు పేర్కొంది. ఏఐ ఆధారిత రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఏసీ, మైక్రోవేవ్ ఉత్పత్తులపై మార్చి 31 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలి

విద్య కాషాయీకరణ ఆపాలి • యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్ • యూనివర్సిటీల్లో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది : రాహుల్ గాంధీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ), విద్యను నిరంతరం కాషాయీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వేలాది మంది విద్యార్థులు కదం తొక్కారు. కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఇండియా బ్లాక్ విద్యార్థి సంఘాలు యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్‌ను నిర్వహించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విద్యార్థులు బారికేడ్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. ఎఈపీ, యూజీసీ ముసాయిదా, ప్రశ్నాపత్రాల లీక్ కుంభకోణం, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విశ్వవిద్యాలయ సంఘాల ఎన్నికలు, నిరుద్యోగ సమస్య వంటి వివిధ అంశాలపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎంఎస్ఎఫ్ సహా దాదాపు ఏడు విద్యార్థి సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. విద్య రంగంలో ప్రయివేటీకరణ-మతతత్వ బంధానికి వ్యతిరేకంగా నినదించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు ఈ మార్చ్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాఠ్యాంశాల్లో పెరుగుతున్న ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక చొరబాటు, విద్య వాణిజ్యకరణ, విద్య నుంచి అణగారిన వర్గాలను బహిష్కరించడం, జాదవ్‌పూర్, జామియా, పాండిచ్చేరి, హెచ్‌సీయూ నుంచి జేఎన్‌యూ వరకు క్యాంపస్ ప్రజాస్వామ్యం లేకపోవడం వంటి వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు తమ గళాలను వినిపించారు. ప్రజాస్వామ్య, సమ్మిళిత విద్యపై ఈ దాడులను సవాలు చేయాలనే విద్యార్థి ఉద్యమం దృఢ సంకల్పాన్ని ఈ మార్చ్ నొక్కి చెప్పింది.

సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, వి.శివదాసన్, సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్, సీపీఐఎంఎల్ ఎంపీ సుదామ ప్రసాద్, సీపీఐ(ఎం) మాజీ ఎంపీ నీలోత్పల్ బసు తదితరులు కూడా మాట్లాడి విద్యార్థులు ఉద్యమానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు వారికి వినతి పత్రాలు సమర్పించారు

యూనివర్సిటీల్లో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది: రాహుల్ గాంధీ

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "విశ్వవిద్యాలయాలలో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది. దేశ భవిష్యత్తును, విద్యా రంగాన్ని నాశనం చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. విద్యావ్యవస్థ పూర్తిగా ఆర్ఎస్ఎస్ అధీనంలోకి వెళ్లిపోతే దేశం నాశనమవుతుందని విమర్శించారు. ఆయా పార్టీల సిద్ధాంతాలు, విధానాల విషయంలో 'ఇండియా బ్లాక్' భాగస్వామ పార్టీల మధ్య సల్ప తేడాలు ఉండవచ్చునీ, కానీ దేశ విద్యా వ్యవస్థ విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. "దేశ భవిష్యత్తు, విద్యా వ్యవస్థను ఒక సంస్థ నాశనం చేయాలని చూస్తోంది. ఆ సంస్థ పేరు ఆర్ఎస్ఎస్. విద్యావ్యవస్థ వారి చేతుల్లోకి వెళ్తే దేశం నాశనమవుతుంది. ఎవరికీ ఉపాధి అవకాశాలు రావు" అని అన్నారు. దేశంలో యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లపై ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం చెలాయిస్తోందనీ, రాబోయే రోజుల్లో రాష్ట్ర యూనివర్సిటీల వీసీలను కూడా ఆర్ఎస్ఎస్ సిఫారసుతోనే నియమిస్తారని అన్నారు. దీనిని మనం ఆపాలనీ, ఈ విషయాలన్నీ విద్యార్థుల ముందుకు విద్యార్థి సంఘాలు తీసుకువెళ్లాలని సూచించారు.

ప్రధాని మోడీ గత వారం పార్లమెంట్‌లో మహాకుంభ మేళాను ప్రస్తావనకు తెచ్చారనీ, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించి కూడా ఆయన మాట్లాడి ఉంటే బాగుండేదని రాహుల్ గాంధీ అన్నారు. విద్యా వ్యవస్థపై కూడా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదని అన్నారు. దేశంలోని వనరులన్నింటినీ అదానీ, అంబానీలకు, విద్యా సంస్థలన్నింటినీ ఆర్ఎస్ఎస్‌కు అప్పగించడమే వారి మోడల్ అని విమర్శించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో టీచర్లు, సిబ్బంది నియామకాలకు సంబంధించిన యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ కేవలం ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాషను బలవతంగా రుద్దాలనే ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నంగా ఆయన పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ... జాతీయ విద్యా విధానంతో విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి వినతి పత్రం అందజేశారు. నాణ్యమైన, శాస్త్రీయమైన లౌకిక విద్య కోసం పోరాటంలో ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ప్రభుత్వ విద్యపై దాడులు తీవ్రతరం కావడంతో పోరాటం మరింత బలపడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ చౌదరి (ఎన్ఎస్‌యూఐ), ప్రసేన్‌జిత్ (ఏఐఎస్ఏ), దినేశ్ సీరంగరాజ్ (ఏఐఎస్ఎఫ్), నౌఫాల్ ఎండి సఫియుల్లా (పీఎస్‌యూ), టిస్ ముంబయిలో సస్పెండ్ అయిన పీహెచ్‌డీ స్కాలర్, ఎస్ఎఫ్ఐ సీఈసీ సభ్యుడు రామదాస్ ప్రిని శివానందతో పాటు ఎస్ఎఫ్ఐ నేతలు దినిత్ డెంటా, నితీష్ నారాయణన్, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు సూరజ్, ఐషీఘోష్, సమాజ్‌వాది ఛాత్ర సభ, సీఆర్‌జేడీ, ఎంఎస్ఎఫ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఫిర్యాదును ఖండిస్తున్నాం : బీజేపీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఖండించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో దొంగనోట్ల ప్రింటింగ్ చేసి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో గెలుస్తూ వచ్చిందని ఆరోపించారు. మానవ అక్రమ రవాణా చేసి డబ్బులు దోచుకున్న ఆరోపణలు బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలను గతంలో రేవంత్‌రెడ్డి కూడా చేశారని గుర్తుచేశారు. ఆ ఆరోపణల్లో నిజం లేదని నిరూపించుకోవాల్సిన బీఆర్ఎస్ నాయకులు బండిపై కేసు పెట్టడాన్ని తప్పుబట్టారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి మురికిగుంటలో కూరుకుపోయి, దాని పర్యవసానంగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. ఇప్పటికైనా దొంగనోట్ల వ్యాపారం విషయంపై విచారణకు అంగీకరించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరంలో అవినీతి జరిగిందనీ, రూ. 50 వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టును రూ. లక్షా 40 వేల కోట్లకు పైగా వెచ్చించారని ఆరోపించారు. హైదరాబాద్ చుట్టూ వేలకోట్ల రూపాయల భూమిని ప్రయివేటు కంపెనీలకు ధారాదత్తం చేశారని తెలిపారు. మెజారిటీ ప్రజల నమ్మకాన్ని అవమానించే వ్యక్తి కేటీఆర్ అని విమర్శించారు. దేశంలో తెలంగాణకు అన్యాయం జరుగుతందనీ, సీట్లు తగ్గుతాయని కేటీఆర్ మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేననీ, ప్రాంతాల వారీగా, భాషల వారీగా, ఉత్తర, దక్షిణ దేశంగా భారతదేశం విడిపోవాలని కుట్ర చేసే శాడిస్టిక్ సైకాలజీ ఉన్న పార్టీలని ఆరోపించారు. కుమార్ మాట్లాడుతూ..అవినీతిలో బీఆర్ఎస్‌కు డాక్టరేట్ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. బండి సంజయ్‌పై కేసులకు భయపడబోమనీ, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ అవినీతిపై పోరాటం చేస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు అసెంబ్లీలో మాట్లాడేందుకు మొఖం లేదు

- మంచివాడిని కాదని కేటీఆరే చెప్పుకుంటున్నాడు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీలో మాట్లాడేందుకు మొఖం చాటేసిన మాజీ సీఎం కేసీఆర్, బయట మాత్రం అబద్దాల ప్రచారానికి తెరలేపుతున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బహిరంగ సభ పేరున నాటకాలాడుతున్నారని విమర్శించారు. కరీంనగర్ సభకు వచ్చి కించప రిచే విధంగా మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ప్రతిపక్ష నేత పదవి క్యాబినెట్ హోదా కాదా?అని ప్రశ్నించారు. ఒకరు పింకు బుక్ ఒకరు బ్లాక్ బుక్, రెడ్ బుక్‌లో రాసుకుంటున్నామంటూ చెబుతున్నారనీ, ఈ ఉడుతూపులకు భయపడేవారు ఎవరూ లేరని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మాట్లాడటం మానుకోవాలని సూచించారు. కేటీఆర్ తనకు తానే మంచివాడిని కాదంటూ చెప్పుకుంటున్నారనీ, అది నిజమేనన్నారు. ఆయనలో మంచితనం లేదు కాబట్టే కేసీఆర్‌ను ఫాంహౌస్ నుంచి బయటకు రానీయటం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ కేటీఆర్ నోటికి వచ్చినట్టు మాట్లాడటం మానుకోవాలని సూచించారు. బాధ్యతరహి తంగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు.



పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్

- ప్రారంభించిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు
- పాల్గొన్న కేంద్ర మంత్రులు, ఏపీ రాష్ట్ర మంత్రి, ఎంపీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం అరకు కాఫీ స్టాల్‌ను లోక్‌సభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పియూశ్ గోయల్‌లు ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదేశాల మేరకు రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోక్‌సభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం క్యాంటీన్ ఏపీ గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ, బీజేపీ, జనసేన, ఇతర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు.

తొలుత శ్రవణ్‌ను ఇండియాకు రానివ్వండి



- ఆ తర్వాత కూడా ఆయనపై బలవంతపు చర్యలు తీసుకోవద్దు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో మధ్యంతర రక్షణ కల్పిస్తూ 'సుప్రీం' ఉత్తర్వులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న శ్రవణ్ కుమార్‌ను తొలుత ఇండియాకు రానివ్వండని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆ తర్వాత సైతం ఆయనపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం మధ్యంతర రక్షణ కల్పించింది. బీఆర్ఎస్ సర్కారులో జడ్జిలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, రాజకీయ నాయకుల ఫోన్లట్యాపింగ్ కేసులో శ్రవణ్ కుమార్‌ను ఏ-6 గా పోలీసులు చేర్చారు. అయితే ఈ కేసులో ముందస్తు బెయిలివ్వాలని శ్రవణ్.. హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ నెల 2న హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది.

ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ.. ఈ నెల 3న శ్రవణ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం విచారణ జరిపింది. తొలుత పిటిషనర్ శ్రవణ్ కుమార్ తరఫున సీనియర్ అడ్వొకేట్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ఇప్పటి వరకు తన క్లైంట్‌కు సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) కింద పోలీసులు నోటీసులు అందించలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. విచారణకు ఆయన అందుబాటులో ఉంటారనీ, అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. అందువల్ల మధ్యంతర రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. ఈ వాదనలపై ప్రభుత్వ అడ్వొకేట్ అభ్యంతరం తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ కీలకపాత్ర పోషించారని నివేదించారు. ఆయనను విచారిస్తే కీలక సాక్ష్యాలు, ఆధారాలు బయటికి వస్తాయన్నారు. మధ్యలో ధర్మాసనం జోక్యం చేసుకొని.. 'శ్రవణ్ కుమార్‌ను అరెస్టు చేస్తున్నారా?' అని ప్రశ్నించింది. ఇందుకు ప్రభుత్వ తరపు న్యాయవాది బదులిస్తూ... శ్రవణ్ కుమార్ దేశం విడిచి పారిపోయారనీ, అమెరికాలో ఉన్నట్టు కోర్టుకు వివరించారు. ఈ కేసులో శ్రవణ్‌పై రెడ్ కార్నర్ నోటీసు సైతం జారీ చేసినట్టు నివేదించారు. ఏడాది కాలంగా ఆయన పరారీలోనే ఉన్నారని తెలిపారు. మధ్యంతర రక్షణ కల్పిస్తే 48 గంటల్లోగా శ్రవణ్ కుమార్ స్వదేశానికి వస్తారని శేషాద్రి.. బెంచ్‌కు నివేదించారు. ఈ వాదనపై జస్టిస్ నాగరత్న స్పందిస్తూ... శ్రవణ్ ముందు దేశానికి రావాలంటే ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలూ తీసుకోవద్దనీ, శ్రవణ్ సైతం పోలీసుల విచారణకు అన్ని విధాలుగా సహకరించాలని ఉత్తర్వులు ఇస్తూ విచారణ వాయిదా వేశారు.

భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించే ఆలోచన లేదు : మంత్రి పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో భూభారతి చట్టం అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతామని సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన ఉందనీ, గడువు పొడిగించే ఆలోచన ఇప్పటికైతే లేదని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చా ట్ నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ కోసం డబ్బులు చెల్లించిన ప్రతి ఒక్కరికీ తగిన పరిశీలన అనంతరం ప్రొసీడింగ్స్ ఇస్తామన్నారు. గతంలో పది శాతం రిజిస్ట్రేషన్ అయిన లేఅవుట్లలో మిగిలిన 90 శాతం ప్లాట్లకు కూడా ఇప్పుడు ఎల్ఆర్ఎస్ చేసుకోవచ్చని సూచించారు. ఎల్ఆర్ఎస్ చేయకుంటే కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఇష్టానుసారం చేసి సస్పెండ్ అవుతున్నారని అన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఎల్ఆర్ఎస్ తెచ్చామన్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని వివరించారు. రెవెన్యూ సర్వే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దాదాపు వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తామని అన్నారు. స్లాట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ఆధార్‌తో అనుసంధానం చేస్తామని వివరించారు. అయితే గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 12 లక్షల సాదాబైనామాలను మాత్రమే భూభారతి వచ్చిన తర్వాత పరిష్కరిస్తామని చెప్పారు. 10,956 వీఎల్‌వో పోస్టులను మంజూరు చేశామని అన్నారు. ఇంటర్మీడియెట్ అర్హతతో దరఖాస్తు చేయొచ్చని సూచించారు.

టెన్త్ పరీక్షకు 1700 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లీష్‌కు 1,700 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,97,338 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,95,947 (99.72 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 1,391 (0.28 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 1,313 మంది దరఖాస్తు చేశారనీ, 1,004 మంది పరీక్ష రాశారని తెలిపారు. 309 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రయివేటులో కలిపి 1,700 మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. రాష్ట్రంలో ఒక విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ఛాంపియన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమంపై చర్చ జరుగుతుంటే వెళ్లిపోతారా?

బడుగు, బలహీన వర్గాల పట్ల బీఆర్ఎస్ చిత్తశుద్ధి ఇదేనా? : మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీనే ఛాంపియన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ నొక్కి చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమంపై చర్చ జరుగుతుంటే బీఆర్ఎస్ సభ్యులు నలుగురే ఉండటం బాధకరమన్నారు. సభమీద వారికి అసలు గౌరవం ఉందా అని ప్రశ్నించారు. అధికార పార్టీ నుంచి ఐదుగురు మంత్రులు, 30 మందికిపైగా సభ్యులు ఉన్నారని చెప్పారు. సంక్షేమంపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. చర్చలో 12 మంది పాల్గొన్నారని తెలిపారు. మైనార్టీలు, ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్య నుంచి రాజకీయాల వరకు ప్రతి అంశంలోనూ బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కులగణన చేపట్టామనీ, ఐదు ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇచ్చామని గుర్తుచేశారు.

తమ పార్టీ అభ్యర్థులను చూసి బీఆర్ఎస్ కూడా అనివార్యంగా బీసీలకు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం పెట్టిన గురుకులాలకు సొంతభవనాలున్నాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యులు వివేకానందకు తాము మాట్లాడేది రుచించడం లేదు కాబట్టే వెళ్లిపోతున్నారని విమర్శించారు. బలహీనవర్గాల పిల్లలకు డైట్ చార్జీలను పెంచామన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలు కడుతున్నామన్నారు. ఢిల్లీకి తీసుకునిపోయి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యతను బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్‌కు పదేండ్లలో రూ.4వేల కోట్లు కేటాయించి రూ.20 కోట్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

రియల్ ఎస్టేట్ కంపెనీగా కాంగ్రెస్ సర్కారు

అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రియల్ ఎస్టేట్ కంపెనీగా కాంగ్రెస్ సర్కారు పనిచేస్తున్నదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 2021లో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వం సీతారామ చంద్రస్వామి దేవస్థాన భూమి 1145 ఎకరాలు, సర్వే నెం.1663 నుండి 1672 ఎకరాల ప్రభుత్వ దేవాదాయ భూమిని ప్రయివేటు వ్యక్తులకు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకొని ధారాదత్తం చేసిందని తెలిపారు. అదే వక్ఫ్ బోర్డు భూములను ఇలా కేటాయించడానికి మాత్రం ధైర్యం లేదన్నారు. తిరిగి ఆయా దేవాదాయ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో 1022 ఎకరాల భూమిని కూడా పెద్ద ఎత్తున ముడుపులు తీసుకొని ఇండస్ట్రీ వ్యక్తులకు అప్పగించారని ఆరోపించారు. ఇలా వేల ఎకరాల దేవాదాయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రయివేటు కంపెనీలకు చెందిన వ్యక్తులకు అప్పగించడం బాధాకరమన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి గుడులను కట్టిస్తామని చెప్పడం దారుణమన్నారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, వికలాంగులకు కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.4 వేల పింఛన్ ఎప్పటి నుంచి ఇస్తారని అడిగారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు ఎప్పటిలోగా చెల్లిస్తారో స్పష్టతివ్వాలని కోరారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత డబ్బులు పెట్టుకుని పనిచేయిస్తున్నారనీ, ఆ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. హైడ్రా పేరుతో హైడ్రామా చేసారని విమర్శించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కాదు...కాంగ్రెస్ కమీషన్ల ప్రాజెక్టు అని ఆరోపించారు. మ్యానిఫెస్టోలో లేని అంశాన్ని తెరమీదకు తెచ్చి కమీషన్లు దండుకోవడం కోసమే అని అన్నారు.

మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ఉన్నాం

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

- రాష్ట్రంలోని మున్సిపాల్టీలన్నింటికి మాస్టర్ ప్లాన్లు
- ఏడాదిలోనే రూ.2లక్షలకు పైగా పెట్టుబడులు
- తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- సభ నుంచి వెళ్లి పోయిన బీఆర్ఎస్ సభ్యులు
- ఏకగ్రీవంగా ఆమోదం పొందిన పద్దులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"మూసీ పునరుజ్జీవనానికి కట్టుబడి ఉన్నాం. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎవరు అడ్డుపడ్డా దాన్ని పట్టాలెక్కిస్తాం. హైదరాబాద్ నగరాభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్ట్‌కు బీఆర్ఎస్ హయాంలోనే బీజం పడింది. బీజేపీ సైతం మూసీ సుందరీకరణ పేరిట మ్యానిఫెస్టోలో పెట్టారు. కాని ఆ తర్వాత వారు దాని గురించి పట్టించుకోలేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ ప్రజలకు క్వాలిటీ జీవితాన్ని ఇవ్వాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టాం"

అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అసెంబ్లీలో మున్సిపాల్టీ, ఐటీ,పరిశ్రమలు, రవాణా పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. మూసీని రెండు దశల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించామని తెలిపారు. రూ.7 వేల కోట్లతో గోదావరి జలాలను మూసీలో కలపడం ద్వారా కాల్యుష్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. "మూసీ పరిధిలో ఎవరిని బలవంతంగా తరలించ లేదు. 302 మంది స్వచ్ఛందంగా అక్కడి నుంచి తరలి పోయారు. వారికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇచ్చాం. 172 మంది మహిళలకు .సబ్సిడీ రుణాలు అందించాం. పునరావాసం చట్టం ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాతే వారిని తరలిస్తాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు. పట్టణీకరణలో దేశీయ సగటు 36.6గా ఉంటే, తెలంగాణలో 49.4 శాతగా ఉందని చెప్పారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా వారికి కావాల్సిన మౌళిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. ప్యారడైజ్ నుంచి షామీర్‌పేట వరకు 18 కిలోమీటర్లు, డైరీ ఫాం వరకు 5 కిలోమీటర్లు మొత్తం రెండు కారిడార్లకు శంకుస్థాపన చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించిన భూ సేకరణ జరుగతోందని తెలిపారు. 1,059 గ్రామాలతో 7,292 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో 11 జిల్లాలకు హెచ్ఎండీఏను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. "భవన నిర్మాణాల ప్రక్రియను సులభతరం చేసేందుకు బిల్డ్‌నౌ విధానాన్ని ఏర్పాటు చేశాం. ఏఐ ద్వారా పట్టణ మౌళిక వసతుల నియంత్రణకు చర్యలుచేపట్టాం. భవనాల అనుమతులకు గతంలో రెండు నెలల నుంచి ఐదు నెలలు పట్టేది. కాని బిల్డ్ నౌ ద్వారా 10 నిమిషాల్లో అనుమతులు లభిస్తున్నాయి. హైదరాబాద్ నలువైపులా మెట్రో రైలును నిర్మించేందుకు డీపీఆర్‌ను రూపొందించాం. హైదరాబాద్ నగరంలో వాహనాల రద్దీకి అనుగుణంగా ఫ్లై ఓవర్లు, అండర్ పాసులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. నగర తాగు నీటి అవసరాల కోసం గోదావరి జలాలను తరలించే ప్రక్రియను వేగవంతం చేశాం" అని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 18 మున్సిపాల్టీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వరంగల్‌కు మాస్టర్ ప్లాన్ ప్రకటించామనీ, . త్వరలో మిగతా మున్సిపాల్టీలకు మాస్టర్ ప్లాన్‌లను ప్రకటిస్తామని చెప్పారు. పట్టణాలను ప్రణాళికా బద్ధంగా విస్తరించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాత లండన్ లాంటి నగరాలు సైతం హైదరాబాద్‌ను ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఐటీ, పరిశ్రమల అభివృద్ధికి చర్యలు చేపట్టామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఏడాది కాలంలోనే దాదాపు 2లక్షలకు పైగా పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ఎంఎస్ఎంఈ పాలసీ 2024 తీసుకొచ్చాం. ఆ రంగానికి చెల్లించాల్సిన బకాయిలను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామని పేర్కొన్నారు.

ఏఐ-ఆధారిత పాలన, పాఠశాలల్లో ఇంటర్నెట్ విద్యాబోధన, యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల అంది పుచ్చుకోవడం ద్వారా తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎంఎంఐ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్, బీజేపీ శాసన సభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, ఇతర సభ్యులు వివేకానంద, పాయల్ శంకర్, అనిరుద్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సునితా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు చర్చలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతాం : మంత్రి సీతక్క

- అర్ధరాత్రి 12:30 గంటల వరకు కొనసాగిన సభ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. అంగన్‌వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. 57 రకాల ఆటవస్తువులను ఇచ్చి నర్సరీ స్కూళ్లగా మార్చామన్నారు. ఖాళీగా ఉన్న14 వేల అంగన్‌వాడీ పోస్టులను త్వరలోనే జిల్లాలవారీగా భర్తీ చేస్తామన్నారు. కలెక్టర్లు నోటిఫికేషన్లు ఇస్తారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫండ్ కింద అంగన్‌వాడీ సెంటర్లు కట్టించే ప్రయత్నం చేస్తామన్నారు. మహిళల కోసం కాల్‌సెంటర్ సమర్థవంతంగా పనిచేస్తున్నదన్నారు. మహిళలు నేడు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. 20 రకాల వ్యాపారాలు గుర్తించామనీ, ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. 21 వేల కోట్లకుపైగా వడ్డీలేని రుణాలిస్తున్నామన్నారు. ప్రమాదబీమాను మహిళా సంఘాల సభ్యులకు వర్తింపజేస్తున్నామని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈలను స్థాపన చేశామనీ, శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.110 కోట్లతో మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నామనీ, ఇప్పటి నుంచి వారు మీటింగ్‌లు పెట్టుకునేందుకు, వ్యాపారాలు చేసుకునేందుకు ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలోల బడి బాధ్యతలను మహిళలకు అప్పగించామని తెలిపారు. అన్ని విషయాలకు సమాధానాలు ఇచ్చానని భావిస్తున్నానన్నారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పింఛన్ల కోసం రూ.14 వేల కేటాయిస్తే పెంచిన పింఛన్లు ఇవ్వడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అర్థమవుతున్నదన్నారు. మల్టీపర్పస్ ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. పంచాయతీల్లో డ్రెయినేజీల క్లీన్‌కు కూడా డబ్బులు లేవని సభ దృష్టికి తీసుకొచ్చారు. మైనార్టీ రిజర్వేషన్లను బీసీల నుంచి ఎత్తేస్తే 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ఢిల్లీలో సహకరిస్తామని మరోమారు స్పష్టం చేశారు. పద్దులపై సుదీర్ఘ చర్చ అనంతరం అర్ధరాత్రి 12:30 గంటలకు శాసనసభ నడిచింది. మంగళవారం ఉదయం 10:00 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

సస్పెండ్ బులెటిన్ ఇవ్వలేదు ..ఇస్తే కోర్టుకెళతా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తనకు సస్పెండ్ బులెటిన్ ఇవ్వలేదనీ, అసెంబ్లీ సమావేశాలకు రావొద్దు అనడానికి ఎలాంటి పరిమితి ఉందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బులెటిన్ ఇస్తే తాను సమావేశాలకు రాననీ, కోర్టుకెళతానని స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలు, నిబంధనలు లేకుండా అసెంబ్లీ నడుస్తున్నదనీ, తనను ఎందుకు సస్పెండ్ చేశారో తెలియదన్నారు. బులెటిన్ ఇవ్వాలని స్పీకర్‌ను కలిసి కోరనున్నట్టు చెప్పారు. కోర్టుకు వెళతాననే భయంతోనే తనకు బులెటిన్ ఇవ్వడం లేదన్నారు. సస్పెండ్ చేసిన వెంటనే బులెటిన్ ఇవ్వాల్సి ఉండగా, వారం గడిచినా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశనలకు సమాధానం చెప్పలేక క్వశ్చన్ అవర్ రద్దు చేశారని తెలిపారు. గతంలో పవర్ ప్లాంట్‌లో రాత్రి 10.15 గంటలకు ప్రమాదం జరిగితే తాను మంత్రిగా 10.35 గంటలకు ఘటనాస్థలి వద్ద ఉన్నానని గుర్తుచేశారు. ఎస్ఎల్బీసీ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటికి తెస్తామన్న కాంగ్రెస్ సర్కారుకు వారి జాడ తెలియడం లేదని విమర్శించారు.

రెండు సవరణ బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంగళవారం అసెంబ్లీ రెండు బిల్లుల సవరణకు ఆమోదం తెలిపింది. తెలంగాణ మున్సిపాల్టీ (సవరణ) బిలును ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లును మంత్రి సీతక్క ప్రవేశ పెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకు ముందు ఈ రెండు బిల్లులపై సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మందుల సామెల్, కూనంనేని సాంబశివరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి, ఎడ్మ బొజ్జు, సంజీవరెడ్డి, మురళీనాయక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అనిల్ జాదవ్ మొదలగు సభ్యులు వివిధ అంశాలను లేవనెత్తారు. గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలో విలీనం, మున్సిపాల్టీలో ఉన్న గ్రామాలను తిరిగి పంచాయతీలుగా ఏర్పాటు, మార్పులు చేర్పులు, కొత్త జీపీలు, మున్సిపాల్టీల ఏర్పాటు తదితర అంశాలపై సభ్యుల సందేహాలకు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క సమాధానం చెప్పారు. సభ్యుల సూచనలు, సలహాలను పరిగణంలోకి తీసుకుని తగు నిర్ణయం తీసుకుంటామని వారు సభకు తెలిపారు.

గురుకుల విద్యార్థులతో ఇన్ఫోసిస్ అధినేత్రి సుధా మూర్తి మాటా మంతీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులతో ఇన్ఫోసిస్ అధినేత్రి సుధామూర్తి సోమవారం జూమ్‌మీటింగ్‌లో మాట్లాడారు. వారు వ్యక్తిత్వ వికాసం ,పరీక్షల్లో భయం వీడి , ఆత్మస్థైర్యంతో జీవితంలో రాణించేందుకోసం గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సుధామూర్తి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పే అంశాలను క్రమశిక్షణతో జాగ్రత్తగా వింటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె తెలిపారు. చదువు అనేది జీవితంలో ఒక మార్గం వంటిదని ఆమె అభివర్ణించారు.

ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాల పెంపు

- ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచుతాం..: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచుతామని, ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచుతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాలభావి వద్ద పానగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ రబీలో జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, అవసరమైతే ధాన్యం రాకను బట్టి కేంద్రాలు పెంచుతామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యానికి ప్రోత్సాహం ఇవ్వడంలో భాగంగా 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని, ఉగాది నుంచి హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. ఏఎమ్ఆర్పీ ఉదయ సముద్రం ద్వారా సాగు నీరు అందించామని, దీనివల్ల ఈ సంవత్సరం లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ఎల్లారెడ్డిగూడెం వరకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం హైడెల్ ప్రాజెక్టు ద్వారా ఏఎమ్ఆర్పీ నుంచి నీరు తీసుకురానున్నామని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెములను పూర్తి చేయడం ద్వారా మర్రిగూడెం చెరువుకు నీళ్లు ఇస్తామని, కాలువల ద్వారా నీరు అందించేందుకు భూసేకరణ పూర్తయిందని చెప్పారు. కట్టంగూరు, నార్కట్‌పల్లి, మునుగోడులో రానున్న మూడు, నాలుగు నెలల్లో కాలువలు పూర్తయితే మరో లక్ష ఎకరాలకు నీరు అందుతుందని వివరించారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పూర్తి చేస్తామని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని చెప్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గత సంవత్సరం సన్న రకం ధాన్యం 45 వేల మెట్రిక్ టన్నులు పండించిన రైతులకు 22 కోట్ల రూపాయల బోనస్ చెల్లించినట్టు చెప్పారు. వచ్చే సంవత్సరం ఇంకా ఎక్కువమంది సన్న ధాన్యం పండించడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం తిప్పర్తి మండలంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ నాగరత్నం రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ జూపూడి రమేష్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న సంస్కరణలతో అద్భుత ఫలితాలు

- ఫిలిప్పీన్స్ ప్రభుత్వంతో బియ్యం ఎగుమతి ఒప్పందం
- రూ.409 కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం పట్టివేత
- ధాన్యం కొనుగోలులో స్కాచ్ అవార్డ్
- రూట్ ఆప్టిమైజేషన్‌తో రూ.12 నుంచి 15 కోట్లు ఆదా : ఐఐఎం రాయపూర్‌లో అంతర్జాతీయ సెమినార్‌లో డి.ఎస్.చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నట్టు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ చౌక ధరల దుకాణాలను అనుసంధానం చేయడంతో అవకతవకలను కట్టడి చేయగలిగామని ఆయన స్పష్టం చేశారు. ఐఐఎం రాయపూర్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో చౌహాన్ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన మార్పులు ఇప్పుడు దేశానికే రోల్ మోడల్‌గా మారాయన్నారు. తద్వారా ఆహార భద్రత అంశంలో ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా మార్గం సులువుగా మారిందని ఆయన చెప్పారు.వినూత్న సంస్కరణలతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ యావత్ భారత దేశంలోనే అగ్రభాగంలో నిలిచిందన్నారు. ప్రధానంగా ధాన్యం కొనుగోలు సమయంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా జరిపిన కొనుగోలుకు స్కాచ్ అవార్డ్ రావడం ఇందుకు నిదర్శనంగా మారిందని చెప్పారు. అంతే కాకుండా డిజిటల్ మానిటరింగ్‌తో రైతు సంక్షేమానికి తీసుకున్న చర్యలను సెమినార్‌లో పాల్గొన్న పలు రాష్ట్రాల ప్రతినిధులు ప్రశంసించారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు కఠినంగా పాటించడంతో అక్రమాలకు తావు లేకుండా పోయిందని చౌహాన్ తెలిపారు. సన్నబియ్యం పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వివిధ రాష్ట్రాలు స్వాగతిస్తూనే ఆహార భద్రత విషయంలో తెలంగాణా ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న మక్కువకు అద్దం పడుతుందని పలువురు కొనియాడారని ఆయన చెప్పుకొచ్చారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతికై రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో ఒక మైలు రాయిగా నిలిచి పోతుందని హర్షం వ్యక్తం చేశారు. దారి మళ్లుతున్న పీడీఎస్ బియ్యంపై పెట్టిన గట్టి నిఘాతో రూ.409 కోట్ల విలువ చేసే బియ్యం పట్టుకున్నట్టు తెలిపారు. రూట్ ఆప్టిమైజేషన్‌తో రూ. 12 నుంచి రూ.15 కోట్లను ఆదా చేసినట్టు వెల్లడించారు.

డీసెట్‌లో ఇంటర్ అర్హత మార్కులు తగ్గించాలి

- డీఎడ్,బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిప్లొమ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమ ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-2025లో ఇంటర్ అర్హత మార్కులను తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీసెట్‌లో బీసీ అభ్యర్థులకు ఇంటర్‌లో 45 శాతం ఉంటే రాయడానికి గతంలో అర్హత ఉండేదని తెలిపారు. నాలుగేండ్లుగా అర్హత మార్కులను 50 శాతానికి పెంచడం వల్ల చాలా మంది బీసీ అభ్యర్థులు డీసెట్ రాయలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీలతో సమానంగా బీసీలకూ ఇంటర్‌లో 45 శాతం మార్కులుంటే అర్హత కల్పించాలని కోరారు. టెట్, డీఎస్సీలకు దరఖాస్తు చేయాలంటే బీసీలకు 45 శాతం మార్కులుంటే అర్హులని తెలిపారు. డీసెట్‌కు మాత్రమే 50 శాతం మార్కులెందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

డీఏల కోసం త్వరలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా : ఎస్టీటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలని కోరుతూ త్వరలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఎస్టీటీయూ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీ అమలు చేయాలనీ, పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని కోరారు.

అమెరికాలో గుడివాడ సాఫ్ట్‌వేర్ ఆత్మహత్య



గుడివాడ : అమెరికాలోని టెక్సాస్ సమీపంలోగల ఫీనిక్స్‌లో నివాసం ఉంటున్న కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని దొండపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొల్లి అభిషేక్ (30) ఆత్మహత్య చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన ఆయన కోసం స్నేహితులు తీవ్రంగా గాలించారు. ఈ నేపథ్యంలో అభిషేక్ మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పదేళ్ల క్రితం నుండి ఆయన అమెరికాలో ఉంటున్నారు. ఏడాది క్రితం వివాహమైంది. ఆరు నెలల నుంచి ఉద్యోగం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అభిషేక్ మరణ వార్త విన్న తల్లితండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తమకు చేదోడువాదోడుగా ఉంటూ ఎదిగొచ్చిన కుమారుడు చనిపోయాడని తెలియడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. అభిషేక్ మృతదేహాన్ని గుడివాడ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కాల్పుల విరమణపై అమెరికా, రష్యా భేటీ

రియాద్ : ఉక్రెయిన్‌లో పాక్షిక కాల్పుల విరమణపై చర్చించేందుకు అమెరికా, రష్యా ప్రతినిధి బృందాలు సోమవారం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో సమావేశమయ్యాయి. అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగిన కొద్ది గంటల తర్వాత ఈ సమావేశం ప్రారంభమైందని రష్యన్ మీడియా పేర్కొంది. ఈ సమావేశం అనంతరం మరోసారి అమెరికా, ఉక్రెయిన్ బృందాలు భేటీ అవుతాయని భావిస్తున్నట్టు టాస్, రియా నొవొస్తి వార్తా సంస్థలు తెలిపాయి. ఇంధన, పౌర సదుపాయాలపై రష్యా, ఉక్రెయిన్‌లు దీర్ఘశ్రేణి దాడులు జరపకుండా తాత్కాలికంగా విరామం ఇచ్చే అంశం సహా పలు అంశాలపై చర్చిస్తున్నారు.

కొడుకులు పోషణకు డబ్బులిస్తలేరు

- తన భూమి తనకే ఇప్పించాలని తండ్రి ఫిర్యాదు
- జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెరలో ఘటన



నవతెలంగాణ-పాలకుర్తి

'నేను సంపాదించిన భూమిని నా కొడుకులు తలా ఎకరం రిజిస్ట్రేషన్ చేయించుకుని పోషణకు డబ్బులు ఇస్తలేరు. మేము ఇరువురు భార్యాభర్తలం జీవించడం ఇబ్బందిగా ఉంది. నా భూమి నాకు ఇప్పించండి.' అంటూ జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన దుంప సొమ్మల్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సొమ్మల్లు మాట్లాడుతూ.. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, తనకున్న మూడెకరాల భూమిని తనకు విషయం చెప్పకుండానే తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని ముగ్గురూ ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తాము భార్యాభర్తల పోషణ నిమిత్తం ఒక్కొక్కరు రూ.3లక్షల చొప్పున రూ.9 లక్షలు ఇవ్వాలని అంగీకారం జరిగిందని అన్నారు. భూమి రిజిస్ట్రేషన్ చేయించుకొని ఏడాది గడుస్తున్నప్పటికీ ముగ్గురు కుమారుల్లో ఏ ఒక్కరూ ఒక్క పైసా ఇవ్వలేదని బోరున విలపించారు. పోషణకు డబ్బులు ఇవ్వకుండానే తన కుమారుల్లో ఒకరు వేరొకరికి భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అమ్ముకున్న భూమిని వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని వేడుకున్నాడు. పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని, వారి పేరున ఉన్న రిజిస్ట్రేషన్ రద్దుచేసి తన భూమి తనకు ఇప్పించాలని వేడుకున్నారు. స్పందించిన తహసీల్దార్ చర్యలు చేపడతామని తెలిపారు.

జర్నలిస్టులకు ఉద్యోగభద్రత, ఇంటి స్థలాలపై కూనంనేని వాయిదా తీర్మానం

- తిరస్కరించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, ఇంటి స్థలం, వైద్యసదుపాయాలు, పెన్షన్ పథకంతో పలు సంక్షేమ చర్యలు చేపట్టాలనీ, దానిపై సభలో చర్చించేందుకు అవకాశమివ్వాలని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. కూనంనేని సాంబశివరావు సభ ముందుంచిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

సమగ్ర పారిశ్రామిక విధానం అవసరం

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానించాలి

- ఐటీ రంగంలో శ్రమ దోపిడీ జరగకుండా చర్యలు
- మురికివాడల అభివద్ధికి స్పష్టమైన విధానం
- సూర్యాపేట జిల్లాకు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలి : శాసనసభలో సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పరిశ్రమల అభివృద్ధి జరిగేలా సమగ్ర పారిశ్రామిక విధానం అవసరమని సీపీఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. శాసనసభలో సోమవారం పరిశ్రమలు, వాణిజ్యం, పురపాలన, పట్టణాభివృద్ధి, సాంఘిక, గిరిజన, బీసీ, మైనార్టీల సంక్షేమం, సమాచార సాంకేతిక, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో ఉన్న వనరులను ప్రభుత్వంఅధ్యయనం చేసి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం జిల్లాలో ఎన్ పరిధిలో 500 ఎకరాల్లో స్పాన్జ్ ఐరన్ ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురువుతుందని చెప్పారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించడమా, లేకపోతే ఎన్‌కు కేటాయిస్తారా ఎదో ఒక్క నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కొత్తగూడెంలో ఎర్త్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయటం సముచితంగా ఉంటుందని తెలిపారు.

ఐటీ రంగంలో శ్రమ, మేధో దోపిడీ

ఐటీ రంగంలో శ్రమ, మేధో దోపిడీ జరుగుతుందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. శ్రమదోపిడీ నుంచి వారిని కాపాడేందుకు, కార్మిక చట్టాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటీ ఉద్యోగులకు చట్టబద్ధ సౌకర్యాలు సమకూరేలా ఆ రంగంపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గౌడ వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మురికివాడల అభివృద్ధికి ప్రభుత్వం స్పష్టమైన విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించారు. మున్సిపాల్టీల్లో విలీనమయ్యే పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించి వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాల్టీ నిధులను అక్కడే వాడుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. పోడు భూములను సాగు చేస్తున్న వారికి పట్టాలు లేక ప్రభుత్వ పథకాలు అందడం లేదనీ, వారికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అంగవైకల్యం ఏ శాతం మేరకున్న ఆ శాతం మేరకు పెన్షన్ అందించాలని కోరారు. విద్య వైద్యానికి జిల్లాల్లో ఐఏఎస్ అధికారులను నియమించి పర్యవేక్షిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాకు తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని కోరారు.

ఎస్టీల్లోనూ వర్గీకరణ డిమాండ్

ఎస్సీల్లో ఏబీసీడీ డిమాండ్ మాదిరిగానే ఎస్టీల్లోనూ డిమాండ్ వస్తుందనీ, తనకు దృష్టికి వచ్చిన డిమాండ్‌ను కూనంనేని సాంబశివరావు సభ దృష్టికి తెచ్చారు. ఆ అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో బీసీలకు ఆత్మగౌరవ భవనాల కోసం స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఎస్సీ రిజర్వేషన్ తొలగించారని తెలిపారు. దానిని పునరుద్ధరించాలని కోరారు. ఈ సమస్య ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువగా ఉందని చెప్పారు. ఎస్సీ సబ్ ప్లాన్ ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి

దళితులు క్రైస్తవులైతే కులం మారిందంటూ, వారిని బీసీలనడం సరికాదని కూనంనేని సాంబశివరావు తెలిపారు. క్రైస్తవులను దళితులు మిగిలిన మాల, మాదిగల మాదిరిగానే పేదలుగా వారి మధ్యనే ఉంటున్నారని చెప్పారు. వారికి న్యాయం చేయాలని కోరారు.